గాజాలో కాల్పుల విరమణ మంచి పరిణామం

- మసీదు ఆలయ వివాదాలు, వ్యవసాయ మార్కెటింగ్ పాలసీ ఫ్రేమ్ వర్కు తదితర అంశాలపై వైఖరి వెల్లడి
- సిపిఎం కేంద్ర కమిటీ ప్రకటన

7

PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 168 | విజయవాడ, సోమవారం 20 జనవరి 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Monday 20 January 2025 | Rs

ఖోఖో జగజ్జేతలు మనమే

- ఫైనల్లో నేపాల్‌పై విజయం

8

సదస్సులో మాట్లాడుతున్న ఎం.ఎ.గఫూర్ వేదికపై ఎం.గేయానంద్, తెలకపల్లి రవి, నల్లప్ప, గౌస్‌దేశాయ్, హరి

దేశ, విదేశాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు గుర్తింపు

20వ వార్షికోత్సవంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రపంచ దేశాల్లో సైతం నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (ఎన్‌డిఆర్‌ఎఫ్)కు మంచి గుర్తింపు లభించిందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా తెలిపారు. నేపాల్, ఇండోనేషియా, టర్కీ, జపాన్ వంటి దేశాల్లో విపత్తులు సంభవించినప్పుడు ఎన్‌డిఆర్‌ఎఫ్ అందించిన సేవలను ఆ దేశాలు కొనియాడాయని పేర్కొన్నారు. 20 ఏళ్లలో దేశంలోనే కాకుండా విదేశాల్లో సైతం గుర్తింపు పొందిన సంస్థగా ఎన్‌డిఆర్‌ఎఫ్ ఉందన్నారు. కృష్ణా జిల్లా, గన్నవరం మండలం, కొండపావులూరులో ఆదివారం నిర్వహించిన ఎన్‌డిఆర్‌ఎఫ్ 20వ వార్షికోత్సవం కార్యక్రమంలో భాగంగా, ఎన్‌ఐడిఎం సౌత్ క్యాంపస్‌ను, ఎన్‌డిఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ క్యాంపస్‌ను ప్రారంభించారు. వర్చువల్‌గా హైదరాబాద్‌లోని నేషనల్ పోలీసు అకాడమీలో 'ఇంటిగ్రేటెడ్ షూటింగ్ రేంజ్'కి శంకుస్థాపన చేశారు. అనంతరం తిరుపతిలోని ఇంటిగ్రేటెడ్ రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తులను ఎన్‌డిఆర్‌ఎఫ్ ఎదుర్కొంటుందని, మానవ విపత్తులను ఎన్‌డిఎ సమర్ధవంతంగా ఎదుర్కొంటుందని చెప్పారు. 2019 నుంచి ఐదేళ్లపాటు మానవ విపత్తు రాష్ట్రంలో జరిగిందని, దీని గురించి చింతించవద్దని, మోడీ, చంద్రబాబు నాయకత్వంలో రానున్న ఐదేళ్లలో అంతకు మూడింతలు అభివృద్ధి చేస్తామన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ఇచ్చాం, రానున్న కాలంలో మరింత సహకారం అందిస్తామన్నారు. అమరావతి ప్రాజెక్టుకు హడ్కో, వరల్డ్ బ్యాంక్ నుంచి రూ.27 వేలకోట్లు ఇచ్చామన్నారు. పోలవరం నుంచి 2028 నాటికి నీరందిస్తామని తెలిపారు. విశాఖ రైల్వే జోన్‌ను గాడిలో పెట్టామన్నారు. రూ.1.20 లక్షల కోట్లతో హైవేలు, ఇతర ప్రాజెక్టులు చేపట్టినట్లు చెప్పారు. విపత్తుల బారిన పడిన వారిని రక్షించడం నిన్నటి మాట అని, ఇప్పుడు వాటి బారిన పడకుండా నివారించడం కోసం అన్ని కోణాల్లో కేంద్రం కార్యాచరణ చేపడుతుందన్నారు. ఎన్‌డిఆర్‌ఎఫ్ పట్ల నమ్మకం పెంచిన సైనికులకు ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. ఎన్‌డిఆర్‌ఎఫ్, ఎన్‌ఐడిఎం విభజన చట్టం ప్రకారం రాష్ట్రంలో ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. హుదూద్, బుడమేరు ముంపు సమయాల్లో ఎన్‌డిఆర్‌ఎఫ్ సహసోపేతమైన సేవలందించిందని చెప్పారు. ఉగ్రవాదం, నక్సలిజం వంటి సమస్యలను సమర్ధవంతంగా ఎదుర్కొంటున్నారని, అమిత్ షా పనితీరు చూస్తుంటే తనకు అసూయ కలుగుతుందన్నారు. గత ఐదేళ్ల పాలన వల్ల రాష్ట్రం వెంటిలేషన్‌పై ఉందని, కేంద్రం ఆదుకోవడం వల్ల ఆ పరిస్థితి నుంచి బయటపడినా, ఇంకా పరిస్థితి చక్కబడలేదన్నారు. రూ.10 లక్షల కోట్లు అప్పులు ఉన్నాయని చెప్పారు. రాష్ట్రాన్ని కరువు రహితంగా మార్చేందుకు గోదావరి - బనకచర్ల ప్రాజెక్టు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ ప్రాజెక్టుకు కేంద్ర సహకారం అందించాలని కోరారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. గ్రామ స్థాయిలో విపత్తు నిర్వహణ బృందాల ఏర్పాటుకు హోంమంత్రి అమిత్ షా సూచనలు చేశారని, వాటిని అధికారులతో చర్చించి ఆచరణలో పెడతామన్నారు. జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ సేవలు మిగతా 2లో

ఎన్ఐడిఎం సౌత్ క్యాంపస్‌ను, ఎన్‌డిఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ క్యాంపస్‌ను ప్రారంభిస్తున్న అమిత్ షా

ప్రజా ఉద్యమాలే మార్గం

'రాష్ట్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు'పై రాష్ట్ర సదస్సులో ఎంఎ గఫూర్

ప్రజాశక్తి- కర్నూలు ప్రతినిధి

వెనుకబడిన ప్రాంతాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయని, దీనికి వ్యతిరేకంగా ప్రజా ఉద్యమాలు చేపట్టాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ఎంఎ గఫూర్ పిలుపునిచ్చారు. సిపిఎం 27వ రాష్ట్ర మహాసభ, తెలకపల్లి నరసింహయ్య ఆరో వర్ధంతి సందర్భంగా కర్నూలులోని లలిత కళా సమితిలో ఆదివారం సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్ దేశాయ్ అధ్యక్షతన 'రాష్ట్ర సమగ్రాభివృద్ధి-ప్రత్యామ్నాయ విధానాలు'పై రాష్ట్ర సదస్సు జరిగింది. ముందుగా నరసింహయ్య విగ్రహానికి అతిథులు, వక్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సదస్సులో ఎం.ఎ.గఫూర్ మాట్లాడుతూ ప్రజాశ్రేయస్సే లక్ష్యంగా పార్టీ కోసమే నరసింహయ్య పని చేశారని తెలిపారు. రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేసే బాధ్యత పాలకులపై లేదా అని ప్రశ్నించారు. అమరావతికి వేల కోట్ల రూపాయలు పెడతామంటున్నారని, అక్కడ కనీస వసతులు కల్పించి మిగిలిన అన్ని ప్రాంతాలనూ అభివృద్ధి చేయాలని కోరారు. గోదావరి నీళ్లు బనకచర్లకు తీసుకురావాలంటే 300 అడుగులపైకి పంపాలని, ఈ విషయం చంద్రబాబుకు తెలియదా? అని ప్రశ్నించారు. విజన్ 2047 పగటి కలని పేర్కొన్నారు. పోలవరం ద్వారా ప్రతి ఎకరాకూ నీళ్లివ్వొచ్చని సుందరయ్య అప్పుడే చెప్పారని గుర్తు చేశారు. చంద్రబాబుకు చిత్తశుద్ధి ఉంటే అఖిలపక్ష రాజకీయ పార్టీల సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధిపై చర్చించాలన్నారు. కర్నూలు జిల్లాలోని ప్రాజెక్టులు పూర్తి చేస్తామని రాష్ట్ర విభజన తరువాత తొలి స్వతంత్ర దినోత్సవ వేడుకల్లో ఇచ్చిన హామీ ఇప్పటికీ అమలు చేయలేదని, రాయలసీమ వాసి అయిన జగన్ సిఎం అయినా మిగతా 2లో

సాహితీ స్రవంతి కార్యాలయంగా నరసింహయ్య గృహం

తెలకపల్లి నరసింహయ్య 6వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన నివాసాన్ని సాహితీ స్రవంతీ ప్రాంతీయ కార్యాలయంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యాలయాన్ని గాడిచర్ల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చంద్రశేఖర కల్కూర, టిజివి కళాక్షేత్రం అధ్యక్షులు పత్తి ఓబులయ్య ప్రారంభించారు. అంతకు ముందు 108 సంవత్సరాల క్రితం 1917లో కర్నూలులో అచ్చయిన ఉయ్యాలవాడ రామచంద్రారావు 'చతురిక' చారిత్రక నవలను వెలువరించారు. ఈ చారిత్రక నవలను తన పరిశోధనలో భాగంగా సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి తీసుకొచ్చారు.

అమిత్ షా 'గోబ్యాక్'

వామపక్షాలు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో హోరెత్తిన నిరసనలు

2

విజయవాడలో అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వివిధ సంఘాల నాయకులు

ప్రభుత్వ రంగంలోనే విశాఖ ఉక్కు

• శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలి • ముఖ్యమంత్రికి సిపిఎం లేఖ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగంలో కొనసాగేలా శాశ్వత పరిష్కారం కోసం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఎం రాష్ట్ర కమిటీ కోరింది ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు పార్టీ రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు ఆదివారం లేఖ రాశారు. స్టీల్‌ప్లాంట్‌కు అవసరమైన తక్షణ సాయంగా రూ.11,400 కోట్ల ప్యాకేజీని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడాన్ని స్వాగతిస్తున్నామని, అయితే ఇది తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని తెలిపారు. శాశ్వత పరిష్కారం దిశగా ఇది మొదటి అడుగు అని, స్టీల్‌ప్లాంట్ నిలదొక్కుకోవాలంటే మరికొన్ని చర్యలు తీసుకోవాలని కోరారు.

సెయిల్‌లో విలీనం చేసి దీనికి శాశ్వత పరిష్కారం చూపాలన్నది ప్రజల వాంఛ అని వివరించారు. కేంద్ర ఉక్కుశాఖ మంత్రి కుమారస్వామి ఈ అంశం భవిష్యత్తులో ఆలోచించాలని అన్నారని, అయితే, వెంటనే సెయిల్ లో విలీనం చేయడం ద్వారా పెట్టుబడి, మార్కెట్, గనుల సమస్యలు పరిష్కారమవుతాయని సూచించారు. ఈ విషయంపై కేంద్ర ప్రభుత్వంలో ఉన్న పలుకుబడిని ఉపయోగించి సెయిల్‌లో విలీనం జరిగే విధంగా చూడాలని చంద్రబాబును కోరారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ స్థిరంగా లాభాలతో నడవాలంటే దానికి సొంత గనులు

కావాలని తెలిపారు. ఇంతవరకు ప్రారంభమే కాని ఆర్సిలార్ మిట్టల్ ఫ్యాక్టరీకి కూడా గనులు కేటాయించాలని కేంద్రాన్ని కోరిన విషయాన్ని ప్రస్తావించారు. పైపులైన్ ద్వారా సరఫరా జరిగేందుకు వీలుగా సొంత పోర్టును కూడా అనుమతించారని పేర్కొన్నారు.

మరి విశాఖ ఉక్కుకు ఎందుకు గనులు కేటాయించరన్న ప్రశ్న ప్రజల్లో ఉదయిస్తున్నదని తెలిపారు. గనులు కేటాయించ కుండా సంక్షోభం నుంచి బయటపడటం కష్టమని ముఖ్యమంత్రికి కూడా తెలుసునని, కావున కేంద్ర ప్రభుత్వం తక్షణం గనులు కేటాయించే విధంగా పలుకుబడిని ఉపయోగించాలని కోరారు. ప్యాకేజీ ప్రకటించడంతోపాటు విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ సమస్యపై కేంద్ర ప్రభుత్వం ఇంతవరకు ప్రకటన చేయలేదని పేర్కొన్నారు. నాలుగేళ్లుగా కార్మికుల ఆందోళనకు ముగింపు పలకాల్సి ఉందని అన్నారు. రాష్ట్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా ప్రజాభీష్టానికి అనుగుణంగా ప్రైవేటీకరణను వ్యతిరేకించాయని తెలిపారు. ఈ ప్రతిపాదనను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోకుండా ప్రైవేటీకరణ ప్రమాదం తొలగిపోదని వివరించారు. 32 మంది ప్రాణ త్యాగాలతో ఏర్పడిన విశాఖ ఉక్కు ఆంధ్రుల హృదయ స్పందనకు చిహ్నమని తెలిపారు. ప్రజల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని రాష్ట్ర ప్రభుత్వం తన యావత్ పలుకుబడిని ఉపయోగించి ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్ర కేబినెట్ ఉపసంహరించుకునే విధంగా చూడాలని కోరారు. నష్టాల నుంచి గట్టెక్కి ఇది ముందుకు నడపాలంటే అదొక్కటే అంతిమ పరిష్కారమని విజ్ఞప్తి చేశారు. ప్యాకేజీ పేరుతో సిబ్బంది కుదింపును ఆమోదించొద్దని కోరారు. వలంటరీ రిటైర్‌మెంట్ స్కీం ఉపసంహరించ చేసి, కాంట్రాక్టు వర్కర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. అప్పుడే ఉత్పత్తి, ఉత్పాదకత పెరుగుతుందని, కార్మికులకు, ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలబడాలని కోరారు.

కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి రావడంతో రఫాలో స్వీట్లు పంచుకుంటున్న స్థానికులు

మూడు గంటలు ఆలస్యంగా అమల్లోకి కాల్పుల విరమణ

జెరూసలెం : ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న గాజాలో కాల్పుల విరమణ ఎట్టకేలకు ఆరంభమైంది. హమాస్ మొదటి రోజున ముగ్గురు మహిళా బందీలను విడుదల చేసింది. విడుదలజేసే బందీల జాబితా హమాస్ ప్రకటించే వరకు పోరు కొనసాగుతుందని ఇజ్రాయిల్ హూంకరించింది. జాబితా విడుదలలో జాప్యం కారణంగా కాల్పుల విరమణ ఒప్పందం మూడు గంటలు ఆలస్యంగా అమలులోకి వచ్చింది. స్థానిక కాలమానం ప్రకారం .. ఆదివారం ఉదయం 11.45 గంటలకు గాజాలో హమాస్‌తో కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చినట్లు ఇజ్రాయిల్ ఓ ప్రకటనలో తెలిపింది.

చివరి నిమిషం దాకా దాడులు

ఇజ్రాయిల్ కిరాతకానికి 13 మంది బలి

ఒప్పందం ఖరారైన చివరి నిమిషం వరకు ఇజ్రాయిల్ సైన్యం గాజాపై దాడులు చేస్తూనే ఉందని గాజా పౌర రక్షణ సంస్థ తెలిపింది. స్థానిక కాలమానం ప్రకారం .. ఉదయం 8.30 గంటల నుండి ఇజ్రాయిల్ వైమానిక, ఫిరంగి దాడులు జరపడంతో 13 మంది పాలస్తీనియన్లు మరణించారని పాలస్తీనా వైద్యులు తెలిపారు. ఇజ్రాయిల్ ప్రధాని నెతన్యాహూ ఆదేశాల మేరకే గాజా ప్రాంతంలో దాడి కొనసాగిస్తున్నట్లు సైన్యం పేర్కొంది.

ఒప్పందం ప్రారంభం కావడానికి గంట ముందు విడుదల చేసిన ఓ ప్రకటనలో .. హమాస్ విడుదల చేయవలసిన బందీల జాబితాను ఇజ్రాయిల్ స్వీకరించే వరకు కాల్పుల విరమణ ఉండదని ప్రధాని సైన్యానికి తెలిపినట్లు ఆయన కార్యాలయం తెలిపింది.

బాబా రామ్‌దేవ్‌పై అరెస్ట్ వారెంట్

తిరువనంతపురం : పతంజలి ఆయుర్వేద్ ప్రజలను తప్పుదోవపట్టించే ప్రకటనలు ఇస్తోందని దాఖలైన ఫిర్యాదుపై కేరళలోని పాలక్కడ్ జిల్లా కోర్టు బాబా రామ్‌దేవ్, ఆయన సన్నిహితుడు ఆచార్య బాలకృష్ణలపై బెయిలబుల్ వారంట్లు జారీ చేసింది. కేరళకు చెందిన ఓ వైద్యుడు మూడేళ్ల క్రితమే ఈ అంశంపై కేంద్రానికి ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత కేరళలో పది కేసులు, ఉత్తరాఖండ్‌లో ఒక కేసు నమోదయ్యాయి. కన్నూర్‌కు చెందిన ఆప్తమాలజిస్ట్ కెవి బాబు దాఖలు చేసిన పలు ఫిర్యాదులను పురస్కరించుకొని కేరళ ఔషధ నియంత్రణ విభాగం రాష్ట్రంలోని తన కార్యాలయాలన్నింటికీ ఆదేశాలు జారీ చేసింది. 1954 డ్రగ్స్ అండ్ మ్యాజిక్ రెమిడీస్ (అభ్యంతరకర ప్రకటనలు) చట్టాన్ని ఉల్లంఘించినందుకు పతంజలిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని సూచించింది. కొన్ని పతంజలి ఆయుర్వేద ఉత్పత్తులు బిపి, సుగర్ వ్యాధులను నయం చేస్తాయని, ఇతర ఆరోగ్య సమస్యలను కూడా తీరుస్తాయని వ్యాపార ప్రకటనలు ఇచ్చారు. ఇలాంటి ప్రకటనలు జారీ చేయడాన్ని డిఎంఆర్ చట్టం నిషేధిస్తోంది.

నారావారిపల్లిలో ఏనుగుల దాడి ఉప సర్పంచ్ మృతి

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి):

ఏనుగుల దాడిలో ఉపసర్పంచ్ మృతి చెందిన ఘటన తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం కందులవారిపల్లి వద్ద శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్వగ్రామమైన నారావారిపల్లికి సమీపాన ఈ ఘటన జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు... శనివారం అర్ధరాత్రి సమయంలో కందులవారిపల్లి పరిసర ప్రాంతాలలోని పొలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయని సమాచారం రావడంతో ఆగ్రామ ఉపసర్పంచ్, చంద్రగిరి మండల టిడిపి అధ్యక్షుడు ఎం రాకేష్ చౌదరి (33) వాటిని తరిమేందుకు కొంతమంది రైతులతో కలిసి పొలాల వద్దకు చేరుకున్నారు. ఏనుగులను తరిమే ప్రయత్నంలో ఏనుగులే ఎదురు దాడి చేశాయి. దీంతో ఒకరు చెట్టు పైకిఎక్కగా, రాకేష్ చౌదరి పరుగులు తీశారు. ఏనుగులు ఆయన వెంబడించి తొక్కి దాడి చేశాయి. ఈ క్రమంలో రాకేష్ చౌదరి అక్కడికక్కడే మృతి చెందారు. ఆయనకు తల్లి జ్యోతి, భార్య లక్ష్మి, కుమార్తె ఉన్నారు. చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని అటవీశాఖ, పోలీస్ అధికారులను అప్రమత్తం చేశారు. ఆయన సంఘటనా స్థలానికి చేరుకొని రాకేష్ మృతదేహాన్ని పరిశీలించి నివాళులర్పించారు. తాము అండగా ఉంటామని ప్రభుత్వం నుంచి ఆర్థికసాయం అందిస్తామని రాకేష్ కుటుంబ సభ్యులకు భరోసా

ఇచ్చారు. రాకేష్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చంద్రగిరి ఏరియా హాస్పిటల్‌కు పోలీసులు తరలించారు. సిఐ సుబ్బరామిరెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు. పోస్టుమార్టం అనంతరం రాకేష్ మృతదేహాన్ని స్వగహానికి తరలించారు. రాకేష్ భౌతికాయంపై ఎమ్మెల్యే, పులివర్తి సుధారెడ్డి, పులివర్తి వినిల్, శ్యాప్ చైర్మన్ ఎ రవి నాయుడులు పార్టీ కండువాను కప్పి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతి టిడిపికి తీరనిలోటని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జరిగిన రాకేష్ అంతిమయాత్రలో ఎమ్మెల్యే నాని పాల్గొని స్మశానం వరకు పాడెను మోశారు.

రాకేష్ మృతి బాధాకరం : చంద్రబాబు

రాకేష్ చౌదరి మృతి చెందడంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంతాపం ప్రకటించారు. పంట పొలాలను ధ్వంసం చేస్తున్న ఏనుగుల గుంపును తరిమే క్రమంలో ఏనుగుల దాడిలో రాకేష్ మృత్యు ఒడికి చేరడం అత్యంత బాధాకరమన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటు అని పేర్కొన్నారు. రాకేష్ మృతి దిగ్భ్రాంతికి గురిచేసిందని విద్య, ఐటిశాఖల మంత్రి నారా లోకేష్ తెలిపారు. రాకేష్ కుటుంబానికి అండగా ఉంటామని వెల్లడించారు.

ప్రభుత్వ పాలసీల్లో 'ప్రపంచబ్యాంకు'

పెట్టుబడులు, కార్పొరేట్లకు అడ్డు లేకుండా లైన్ క్లియర్

వి సురేష్

తెలుగుదేశం కూటమి ప్రభుత్వ పాలనలో అన్నిటిలోనూ ప్రపంచబ్యాంకు విధానాలు గోచరిస్తున్నాయి. స్వర్ణాంధ్ర విజన్ 2047, వివిధ రంగాలపై తీసుకొచ్చిన సుమారు 22 పాలసీల్లో గతంలో ప్రపంచబ్యాంకు ఏదైతే చెప్పిందో వాటిని మళ్లీ వేర్వేరు రూపాల్లో తిరిగి తెస్తోంది. ప్రభుత్వ రంగాన్ని, ఉద్యోగులను కుదించడం, సంక్షేమాన్ని వదిలేసి యూజర్ ఛార్జీలు వసూలు చేయడం ఇలాంటి వాటిని కొత్తగా పాలసీలు, విజన్ పేరుతో అమలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నద్ధమవుతోంది. రెగ్యులేటరీ కమిషన్లు, ప్రైవేటీకరణకు వీలుగా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటు చేయనున్నారు. ముఖ్యంగా విద్యుత్, నీటిని వ్యాపారం చేయడం, అడిగిన వారికి భూములు అప్పగించడం, పట్టణ ప్రాంతాల్లో పెద్దపెద్ద వ్యాపార సంస్థలకు అనువుగా అర్బన్ ల్యాండ్ సీలింగ్ చట్టాన్ని సవరించడం, వ్యవసాయంలో యాంత్రీకరణ పెంచడం, ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యను తగ్గించడం, విదేశీ వ్యాపార సంస్థలకు ఎటువంటి అడ్డంకులూ లేకుండా చేయడం వంటి అంశాలున్నాయి. మరీ ముఖ్యంగా వ్యవసాయ భూములను పారిశ్రామిక ప్రాంతాలుగా మార్చడం, ఆహార పంటల స్థానంలో వాణిజ్య పంటలు పెంచడం, ప్రకృతి వ్యవసాయం పేరుతో ఆహార ఉత్పత్తులను తగ్గించడం(శ్రీలంక గతపాలసీ) ఇవన్నీ కూడా దండలో దారంలా ఒకదానికొకటి పెనవేసుకుపోయి ఉన్నాయి.

కొత్తగా తీసుకొచ్చే పాలసీల్లో లక్షల మందికి ఉపాధి కల్పన ఉంటుందని పేర్కొంటున్నారు. అదే సమయంలో ఉత్పాదకతలో సాంకేతికతను పెంచాలని ప్రతిపాదించారు. ఆధునీకరణ పేరిట ఇప్పటికే ఉన్న ఉపాధి పోతుంటే కొత్త ఉపాధి వస్తుందని మభ్యపెట్టడం తప్ప మరొకటి కాదు. వ్యవసాయంలో యాంత్రీకరణ, పారిశ్రామిక ఆధునీకరణ ఇందులో భాగమే. 2000 సంవత్సరంలో చంద్రబాబు తీసుకొచ్చిన సంస్కరణల్లో భాగంగా ఉద్యోగాలను ప్రైవేటుపరం చేయడం ద్వారా ఖర్చును తగ్గించుకోవాలని చూసింది. ఇప్పుడు ఇదే పద్ధతిని అమల్లోకి తీసుకువస్తున్నారు. ప్రభుత్వం ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్కులు తెచ్చి రైతులు నేరుగా వారికి భూములు అప్పగించొచ్చనీ ప్రకటించడమే కాకుండా రాయితీలూ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. గతంలో తీసుకొచ్చిన సరళీకరణ విధానాల్లో పారిశ్రామిక అవసరాలకు తగిన విధంగా భూములు కేటాయింపులు జరపాలనేది కీలకమైన షరతు. దీన్ని ఇప్పుడు పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు.

రాష్ట్రంలో వందకోట్ల పైబడి విలువైన కంపెనీలు ప్రభుత్వ లెక్కల ప్రకారమే 2800కిపైగా ఉన్నాయి. ఒకవైపు కార్పొరేట్లకు రాయితీలు కల్పిస్తూ ప్రజలకు సహజ ఆదాయవనరుగా ఉన్న భూమిని మాత్రం ఎవరి చేతి నుండి వారే నేరుగా కార్పొరేట్ల చేతుల్లో పెట్టే విధంగా చట్టాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. 2013 భూసేకరణ చట్టానికి రాష్ట్రంలో 2018లో సవరణలు తీసుకొచ్చారు. అంతకుముందే 2009లో ల్యాండ్ రిఫార్మ్స్ సవరణ చట్టాన్ని తీసుకొచ్చారు. ఇవి చాలదన్నట్లు ఇటీవల నెగోషియబుల్ పాలసీ తీసుకొచ్చారు. ఇంకొంచం ముందుకెళ్లి రీసెటిల్‌మెంట్ పాలసీని పరిచయం చేస్తున్నారు. ఈ మొత్తం పాలసీలన్నిటిలోనూ భూములను అడిగిన వారికి కోరుకున్నతంత కట్టబెట్టడమే ప్రధానంగా ఉంది.

పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన ప్లాంట్లను కూడా ప్రైవేటు భూముల్లోనే ఏర్పాటు చేసేందుకు మరో పాలసీ తీసుకొచ్చారు. దీనికి గ్రీన్ ఎనర్జీ అని పేరు పెట్టారు. పెద్దఎత్తున విద్యుత్ ఉత్పత్తి పెరిగిందని, ఆదా చేస్తున్నామని చెబుతూనే బయట మార్కెట్ నుండి అదనపు ధరకు విద్యుత్ కొనుగోలు చేసి ఆ భారాన్ని మిగతా 7లో

విశాఖలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

నంద్యాలలో నిరసన తెలుపుతున్న వామపక్ష పార్టీల నాయకులు

అమిత్‌షా 'గోబ్యాక్'

వామపక్షాల ఆధ్వర్యంలో హోరెత్తిన నిరసనలు

ప్రజాశక్తి- యంత్రాంగం

రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన, అవమానించిన కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా విజయవాడ పర్యటనను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో ఆదివారం రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు హోరెత్తాయి. అమిత్ షాను కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించాలని వామపక్ష నాయకులు నినాదాలు చేశారు. అమిత్ షా వైఖరిని ప్రజాతంత్రవాదులంతా ఖండించాలని కోరారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, సిపిఐ నాయకులు జి కోటేశ్వరరావు అధ్యక్షత జరిగిన నిరసన కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ మాట్లాడుతూ అమిత్ షా వ్యాఖ్యలను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఖండించకపోవడం దారుణమన్నారు. అమిత్ షా రాజీనామా చేసే వరకు నిరసన కార్యక్రమాలు కొనసాగుతాయని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వి.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో దేశపౌరులకు వాక్ స్వాతంత్రం, పత్రికా స్వేచ్ఛ ఉండటానికి కారణం రాజ్యాంగమని వివరించారు. అంబేద్కర్ లేకపోతే ప్రధాన మంత్రి పదవి తనకు దక్కేది కాదని రెండోసారి ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేసిన సమయంలో నరేంద్ర మోడీ అన్న మాటలను మర్చిపోయారా? అని ప్రశ్నించారు. రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు వామపక్షాలతో చంద్రబాబు, పవన్ కల్యాణ్, జగన్ గొంతు కలపాలని, లేదంటే రాష్ట్రంలో పుట్టగతులుండవని హెచ్చరించారు. సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు హరనాథ్, సిపిఎం న్యూడెమోక్రసీ నాయకులు పోలారి, ఎంసిపిఐయు నాయకులు ఖాదర్ బాషా మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో నడుస్తోన్న కేంద్రప్రభుత్వం రాజ్యాంగంపై దాడి చేస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఈ సమావేశంలో సిపిఐ మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ ప్రసంగించారు. అనంతపురం జిల్లా అనంతపురం, రాయదుర్గం, గుంతకల్లు, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్ పార్టీల నాయకులు నిరసన తెలిపారు. శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి, ధర్మవరం, రొద్దం తదితర ప్రాంతాల్లో వామపక్ష నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. అమిత్ షా గో బ్యాక్ అంటూ భీమవరం, ఏలూరు జిల్లాల్లో నినదించారు. కర్నూలు జిల్లా ఆదోని, కోడుమూరు, నంద్యాల జిల్లా కొత్తపల్లి, నందికొట్కూరు, ఆత్మకూరు, బేతంచర్ల, డోన్, సున్నిపెంటలో నిరసన తెలిపారు. సిపిఎం ఆధ్వర్యంలో ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు, మైలవరం, చీమలపాడులోనూ, వామపక్షాల ఆధ్వర్యాన కృష్ణా జిల్లా గన్నవరంలోనూ నిరసనలు హోరెత్తాయి శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో సిపిఎం, సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యాన నిరసన తెలిపారు. పార్వతీపురంలో ర్యాలీ నిర్వహించారు. పాచిపెంట, కొమరాడ మండలాల్లో నిరసనలు జరిగాయి. అనకాపల్లి, సబ్బవరం, చోడవరం, ఎస్.రాయవరం, అల్లూరి జిల్లా విఆర్.పురం మండలం రేఖపల్లి, కూనవరం, పాడేరు మండలాల్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. విశాఖలోని జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద సిపిఎం, సిపిఐ, సిపిఐ ఎంఎల్ (న్యూడెమోక్రసీ), సిపిఐ ఎంఎల్ ప్రజాపోరు పార్టీల ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

అమిత్ షాకు విందు 'సిగ్గు చేటు'
- దళిత, గిరిజన, ప్రజాసంఘాలు

రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాకు సిఎం చంద్రబాబు నివాసంలో విందు ఇవ్వడం సిగ్గు చేటని దళిత, గిరిజన, ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విజయవాడలోని బందరు రోడ్డులోగల అంబేద్కర్ స్మృతివనం వద్ద నిర్వహించిన నిరసన కార్యక్రమానికి అధ్యక్షతన వహించిన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ అంబేద్కర్‌పై అనుచిత వ్యాఖ్యలకు దేశ వ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతుంటే, రాష్ట్రంలో అధికార పార్టీలు, ప్రతిపక్ష పార్టీల అధినేతలు నేరు మెదపకపోవడం శోచనీయమన్నారు. అమిత్ షాను విందు ఇచ్చి సత్కరించడం దళితులను అవమానిండమేనని పేర్కొన్నారు. దేశంలో మనుస్మృతి అమలుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేస్తోందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, జై భీమ్‌రావ్ పార్టీ నాయకులు కొండలరావు, అంబేద్కర్ మిషన్ అధ్యక్షులు రామారావు, ఆమ్‌ఆద్మీ పార్టీ కో-ఆర్డినేటర్ నేతి మహేశ్వరరావు, ఆల్ ఇండియా కిసాన్ సంఘటన అధ్యక్షులు మరీదు ప్రసాద్‌బాబు, డివైఎఫ్ఐ నాయకులు సురేష్, ముస్లిం లీగ్ నాయకులు మహమ్మద్ ముస్తాఫ్, కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు. కెవిపిఎస్ ఆధ్వర్యాన ఎన్‌టిఆర్ జిల్లా విస్సన్నపేటలో నిరసన తెలిపారు.

మహాధర్నాలో పాల్గొన్న లోకనాథం, ఎంవిఎస్.శర్మ, జగ్గునాయుడు, సిపిఎం నాయకులు

స్టీల్‌ప్లాంట్‌ను అమ్మే నిర్ణయాన్ని రద్దు చేయాలి

- విశాఖలో సిపిఎం మహాధర్నా

ప్రజాశక్తి - కలెక్టరేట్ (విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను స్ట్రాటజిక్ సేల్ పేరుతో వంద శాతం అమ్మడానికి కేంద్రంలోని బిజెపి మంత్రివర్గం 2021 జనవరి 27న చేసిన నిర్ణయాన్ని రద్దు చేస్తూ ప్రధాని మోడీ వెంటనే ప్రకటన చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ అమ్మకం నిర్ణయాన్ని రద్దు చేయాలని, ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయాలని, సొంత గనులు కేటాయిస్తూ ప్రధాని మోడీ ప్రకటన చేసేలా చంద్రబాబు, పవన్‌లు ఒత్తిడి తేవాలని డిమాండ్ చేస్తూ సిపిఎం విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద మహా ధర్నా నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా లోకనాథం హాజరై మాట్లాడుతూ.. టిడిపి కూటమి నాయకులు కేంద్ర ప్రభుత్వ ప్యాకేజీకే పరిమితం కాకుండా ప్లాంట్ ప్రయివేటీకరణ నిర్ణయాన్ని రద్దు చేయించాలని డిమాండ్ చేశారు. ప్యాకేజి ప్లాంటుకు తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని తెలిపారు. స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు లేనందున ప్రతి టన్ను స్టీల్ ఉత్పత్తికి అదనంగా రూ.4 వేల భారం పడుతోందన్నారు. దేశంలో అన్ని ప్రభుత్వ, ప్రయివేటు స్టీల్ పరిశ్రమలకు సొంత గనులు ఇచ్చి, లక్ష మందికి ఉపాధి కల్పిస్తున్న విశాఖ ఉక్కుకు సొంత గనులు ఎందుకు కేటాయించరని కేంద్రాన్ని నిలదీశారు. మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు గనుల కోసం ఆరాటపడుతున్న సిఎం చంద్రబాబు విశాఖ ఉక్కుకు సొంత గనుల గురించి ఎందుకు మాట్లాడరని ప్రశ్నించారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు దోచిపెట్టడాన్ని కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తన విధానంగా పెట్టుకుందని, దీనికి చంద్రబాబు, పవన్, జగన్ తోడు దొంగల్లా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. కడపలో స్టీల్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని రాయలసీమ వాసులు పోరాడుతుంటే స్పందించని చంద్రబాబు.. అనకాపల్లి జిల్లాలో మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటుకు సిద్ధపడుతున్నారన్నారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కన్నా, కార్పొరేట్ల ప్రయోజనాలకే టిడిపి కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతనిస్తోందని విమర్శించారు. రాష్ట్ర విభజన హామీ మేరకు కడపలో స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ.. విశాఖ ఉక్కుకు పూర్వవైభవం తీసుకువస్తామని ప్రధాని, ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కూటమి నేతలు ప్రకటనలు గుప్పిస్తున్నారన్నారు. వేల సంఖ్యలో కార్మికులను తొలగించి పూర్తిస్థాయి ఉత్పత్తి ఎలా సాధించగలరని ప్రశ్నించారు. పార్టీ విశాఖ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కెఎం.శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన ధర్నాలో కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు, పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బి.పద్మ, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు యు.రామస్వామి, జె.అయోధ్యరాం, వైటి.దాస్, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకమని టిడిపి కూటమి ప్రకటించాలి : బొత్స

ప్రజాశక్తి- ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకమని కూటమి ప్రభుత్వం స్పష్టంగా ప్రకటించాలని శాసన మండలి సభ్యులు బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం సాయంత్రం ఆయన బీచ్ రోడ్డులోని వైసిపి క్యాంపు కార్యాలయంలో మీడియా సమావేశంలో మాట్లాడారు. కేంద్రం ఇచ్చిన ప్యాకేజీ ప్రైవేటీకరణ చర్యలో భాగమేనన్నారు. విశాఖ ఉక్కు-ఆంధ్రుల హక్కు నినాదానికి వైసిపి కట్టుబడి ఉందని, పొరుగు రాష్ట్రానికి కూడా ఇదే తరహా ప్యాకేజీ ఇచ్చారని, కానీ ఎలాంటి షరతులూ పెట్టలేదని తెలిపారు. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు ఇచ్చిన రూ.11,440 కోట్లకు చాలా షరతులు ఉన్నాయన్నారు. ఇప్పటి వరకూ ఉక్కు కార్మికులకు జీతాలు ఎందుకు చెల్లించలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కేంద్ర హోం మంత్రి రాష్ట్రంలో ఉన్నారని, విశాఖ ఉక్కు కర్మాగారాన్ని ప్రైవేటీకరించబోమని ఆయన నుంచిగానీ, ముఖ్యమంత్రి నుంచిగానీ హామీ రాలేదని, దీన్నిబట్టి సంకీర్ణ అభిప్రాయాల్లో ఏదో లోపం ఉందని అర్థమవుతోందని విమర్శించారు. ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకించడంలో టిడిపి కూటమికి చిత్తశుద్ధి ఉంటే ప్రధానితో విశాఖలోనే ప్రకటన చేయించి ఉండేవారన్నారు. కోట్లాది మంది భక్తులు పాల్గొనే కుంభమేళా సజావుగా జరుగుతుండగా తిరుపతి తొక్కిసలాట రాష్ట్ర ప్రభుత్వ అసమర్థతను తెరపైకి తెచ్చిందని తెలిపారు. తిరుపతిలో వరుస ప్రమాదాలపై కేంద్రం జోక్యం చేసుకునేందుకు ప్రయత్నించగా చంద్రబాబు నాయుడు, ఆయన బృందం అడ్డుకునే ప్రయత్నం చేశారని, ఆ కేసును సుమోటోగా స్వీకరించి విచారణ జరపాలని ఇప్పటికే తాము హైకోర్టుకు లేఖ రాశామని చెప్పారు. సమావేశంలో వైసిపి విశాఖ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పాల్గొన్నారు.

దావోస్ పర్యటనకు సిఎం చంద్రబాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

దావోస్ పర్యటలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం సాయంత్రం ఉండవల్లిలోని తన నివాసం నుంచి రోడ్డు మార్గంలో గన్నవరం ఎయిర్‌పోర్టుకు వెళ్లారు. అక్కడ దావోస్ వెళ్లే అధికారుల బృందంతో కలిసి విమానంలో ఢిల్లీ చేరుకుంటారు. అక్కడ నుంచి అర్ధరాత్రి 1:30 గంటలకు జ్యూరిచ్‌కు వెళ్తారు. జ్యూరిచ్‌లో సోమవారం ఉదయం పలు సమావేశాల్లో సిఎం పాల్గొంటారు. అక్కడ నుంచి రోడ్డు మార్గంలో దావోస్‌కు చేరుకుని అక్కడ జరిగే వరల్డ్ ఎకనామిక్ ఫోరం సదస్సుకు హాజరవుతారు. దావోస్ పర్యటనకు బయలుదేరిన సిఎం చంద్రబాబుకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్, సిఎంఒ అధికారులు శుభాకాంక్షలు తెలిపారు. దావోస్ పర్యటన విజయవంతం కావాలని, రాష్ట్రానికి పెద్దయెత్తున పెట్టుబడులు రావాలని వారు ఆకాంక్షించారు.

ప్రజల భాగస్వామ్యంతో ఉద్యమాలు

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఇళ్ల స్థలాలు పంపిణీ కోసం, విద్యుత్ ఛార్జీల పెంపునకు నిరసనగా చేపట్టబోయే ఉద్యమాల్లో పేద ప్రజలను భాగస్వామ్యులను చేయాలని పార్టీ శ్రేణులకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ సూచించారు. సిపిఐ జిల్లా, నగర, పట్టణ కార్యదర్శులతో విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవాడలోని దాసరి భవన్‌లో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత ఎన్నికల్లో టిడిపి ఇచ్చిన హామీల సాధనకు పార్టీ శ్రేణులు ప్రజలతో నిరంతరం మమేకమవ్వాలని కోరారు. ఎవరైతే ఇంటి స్థలం సమస్య ఎదుర్కొంటున్నారో వారిని గుర్తించి అర్జీలు సమర్పించే విధంగా అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైతే భూ సమస్యలున్నాయో గుర్తించి, సుదీర్ఘకాలం పాటు కబ్జాదారుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ భూముల వివరాలు సేకరించి నిరంతర భూ పోరాటాలు చేపట్టాలన్నారు. పార్టీ సహాయ కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణ వ్యయం పెరిగినందున లబ్ధిదారులకు ఇచ్చే మొత్తాన్ని పెంచాలని కోరారు. అంతకముందు 3 తీర్మానాలను ఆ పార్టీ నాయకులు ప్రవేశపెట్టారు. పేదలకు గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణాల్లో 2 సెంట్లు ఇళ్ల స్థలం ఇచ్చి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలని, బిఆర్ అంబేద్కర్‌ను అవమానించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా రాజీనామా చేయాలని, అదానీతో రాష్ట్ర ప్రభుత్వం చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను రద్దు చేయాలని కోరుతూ తీర్మానాలను ఆమోదించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ జెల్లి విల్సన్, సిపిఐ నాయకులు అక్కినేని వనజ, ఆవుల శేఖర్, పి దుర్గాభవాని, పి హరినాథ్‌రెడ్డి, జి ఈశ్వరయ్య, అజయ్‌కుమార్, ప్రభాకర్, దుర్గాభవాని తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ ఉపసంహరించుకోవాలి

- గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య డిమాండ్

ప్రజాశక్తి-గుంటూరు

ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్ విధానాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రభుత్వాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సమాఖ్య తీర్మానించింది. గుంటూరు బ్రాడీపేటలోని యుటిఎఫ్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర కమిటీ సమావేశంలో సమాఖ్య రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎవి.నాగేశ్వరరావు, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ కె.అనురాధ, డాక్టర్ గురుస్వామి మాట్లాడారు. రేషనలైజేషన్ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని కోరుతూ కలెక్టర్లు, మంత్రులు, ఇతర ప్రజా ప్రతినిధులకు వినతిపత్రాలు ఇవ్వనున్నామని, ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకునే వరకూ పోరాడతామని తెలిపారు. గ్రామ, వార్డు సచివాయాల్లో ఖాళీలు భర్తీ చేయాలని, ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఆలస్యం చేయడం వల్ల నష్టపోయిన తొమ్మిది నెలల బకాయిలను అరియర్స్ రూపంలో వెంటనే చెల్లించాలని, ఉద్యోగంలో చేరిన తేదీ నుండి సర్వీసు లెక్కించి, నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, పెండింగ్‌లో ఉన్న డిఎలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో పని చేస్తున్న ప్రతి ఉద్యోగికి నిర్దిష్ట ప్రమోషన్ ఛానల్ వెంటనే ప్రకటించాలని, పనిభారం తగ్గించాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా వార్డు సచివాలయాల్లో పనిచేసే శానిటేషన్ సెక్రెటరీలకు మిగితా సచివాలయ ఉద్యోగులకు ఉండే సమయపాలన పాటించే విధంగా ఉత్తర్వులు ఇవ్వాలని, ఎఎన్ఎం, హెల్త్ సెక్రెటరీలకు యాప్‌ల పని భారం తగ్గించాలని కోరారు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఒకేసారి అనేక రకాలైన సర్వేలు ఇచ్చి త్వరగా పూర్తి చేయాలని ఉద్యోగులను ఒత్తిడి చేయడం సరికాదన్నారు. అనంతరం గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుకు వినతిపత్రం అందజేశారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎవి నాగేశ్వరరావు

ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్య

- విజయనగరంలో ఒకరు.. గుంటూరులో మరొకరు

ప్రజాశక్తి-యంత్రాంగం

ఇద్దరు విద్యార్థులు తమ హాస్టల్ గదుల్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం వేర్వేరు ప్రాంతాల్లో చోటుచేసుకుంది. వారిలో ఒకరు వైద్య విద్యార్థి కాగా మరొకరు సిఎ విద్యార్థి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరం జిల్లా నెల్లిమర్లలోని మిమ్స్ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ ఫైనల్ ఇయర్ చదువుతున్న తూర్పుగోదావరి జిల్లా నిడదవోలుకు చెందిన అటుకూరి సాయి మణి దీప్ (24) తన హాస్టల్ గదిలో గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. తాను గత కొంత కాలంగా చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నానని, తోటి విద్యార్థులు చదువులో ముందుకు సాగుతున్నా, తాను మాత్రం గత పరీక్షల్లో సబ్జెక్టులు ఉండిపోవడంతో మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకుంటున్నానని సూసైడ్ లేఖలో రాశారు. తన వల్ల కుటుంబ సభ్యులు కూడా ఇబ్బందులు పడుతున్నారని, అందువల్ల ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నాడు. మృతదేహాన్ని ఎస్ఐ బి.గణేష్ పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు.

నెల్లూరు జిల్లా గూడూరు పట్టణానికి చెందిన కె.నాగప్రసాద్ (24) గుంటూరులోని ఓ ప్రయివేటు ఇనిస్టిట్యూట్ సిఎ కోర్సు నాలుగో సంవత్సరం చదుతున్నారు. బ్రాడీపేట 4వ లైన్‌లోని లోటస్ బాయ్స్ హాస్టల్‌లో ఉంటూ తరగతులకు హాజరవుతున్నారు. సహచర విద్యార్థులు లేనిసమయంలో హాస్టల్ గదిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. హాస్టల్ సిబ్బంది సమాచారం మేరకు అరండల్‌పేట పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. నాగప్రసాద్ ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదని, విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామని పోలీసులు తెలిపారు.

లారీని ఢీకొన్న కారు

- ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు దుర్మరణం
- తిరుమల శ్రీవారి దర్శనానికి వస్తుండగా ఘటన

ప్రజాశక్తి- రామచంద్రాపురం (చంద్రగిరి)

తిరుపతి జిల్లా చంద్రగిరి మండలం పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారి నెత్తురోడింది. జక్కలవారిపల్లి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు చిన్నారులు సహా ముగ్గురు మృతి చెందారు. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఆదివారం సాయంత్రం చోటుచేసుకున్న ఈ ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన కార్తికేయ (50) తన కుటుంబ సభ్యులతో కలసి తిరుమల శ్రీవారి దర్శనానికి కారులో వస్తున్నారు. పూతలపట్టు-నాయుడుపేట జాతీయ రహదారిపై జక్కలవారిపల్లి వద్ద ముందు వెళ్తున్న వాహనాన్ని అధిగమించే క్రమంలో చిత్తూరు వైపు వస్తున్న లారీని వారి కారు బలంగా ఢీకొట్టింది. కారు ముందు భాగం పూర్తిగా లారీ కిందకు వెళ్లిపోయింది. దీంతో, కారులోని ఇద్దరు చిన్నారులు జీవన్ (10), విశ్వ (6) అక్కడికక్కడే మృతి చెందారు. కార్తికేయ, సతీష్, కలైవేణి (45), ఐశ్వర్య తీవ్రంగా గాయపడ్డారు. తోటి ప్రయాణికులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 వాహనంలో ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కలైవేణి మరణించారు. కార్తికేయ పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వెంటిలేటర్‌పై ఆయన చికిత్స అందిస్తున్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

మృతిచెందిన చిన్నారులు

'గోదావరి -బనకచర్ల' ఆచరణ సాధ్యం కాదు

- నీటిపారుదలరంగ నిపుణులు లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గోదావరి జలాలను బనకచర్లకు తీసుకొచ్చి రాయలసీమ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలన్న ప్రభుత్వ ఆలోచన ఆచరణ సాధ్యంకాదని నీటిపారుదల రంగ నిపుణులు టి.లక్ష్మీనారాయణ తెలిపారు. గోదావరి నది 180 అడుగుల ఎత్తులో ఉండగా.. బనకచర్ల వద్ద 880 అడుగుల ఎత్తులో ఉన్న శ్రీశైలంలోకి నీటిని మళ్లించడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులన్నింటినీ యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కోరారు. 'ఆంధ్రప్రదేశ్‌లో నీటిపారుదల ప్రాజెక్టులు - ప్రస్తుత పరిస్థితి' అనే అంశంపై జన చైతన్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం గుంటూరులో చర్చాగోష్ఠి నిర్వహించారు. జన చైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ మాట్లాడుతూ.. పోలవరాన్ని 150 అడుగుల ఎత్తులో నిర్మించి, గరిష్ఠ స్థాయిలో నీటిని నింపినప్పుడే నిర్దేశిత లక్ష్యాలు నెరవేరుతాయన్నారు. అధ్వాన్నస్థితిలో ఉన్న ప్రాజెక్టులు, కాలువలకు అవసరమైన నిధులు కేటాయించి మరమ్మతులు చేయాలని కోరారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్య వరప్రసాద్ మాట్లాడుతూ.. గోదావరి-బనకచర్ల ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలకు భారంగా కాకూడదని తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు లభించే చిన్న ప్రాజెక్టులను నిర్మించాలన్నారు. ఆల్ ఇండియా కిసాన్ సభ జాతీయ ఉపాధ్యక్షులు వై.కేశవరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో గత ఐదేళ్లలో నీటిపారుదల ప్రాజెక్టుల కేటాయింపుల్లో 52 శాతం మాత్రమే ఖర్చు చేశారని, టిడిపి కూటమి ప్రభుత్వం బడ్జెట్లో రూ.15 వేల కోట్లు కేటాయించినా రూ.కోటి కూడా విడుదల చేయలేదని తెలిపారు. నీటిపారుదల ప్రాజెక్టుల ద్వారా ఉత్పత్తులు పెరిగి, సంపద సృష్టి జరిగి ప్రభుత్వాల ఆదాయాలు పెరుగుతాయన్నారు. ఉత్తరాంధ్ర చెరువుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షులు మరిసర్ల కృష్ణమూర్తి నాయుడు, ప్రొఫెసర్ డిఎఆర్ సుబ్రహ్మణ్యం, ఉమ్మడి గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షులు కల్లూరి శ్రీనివాసరావు, హైకోర్టు అడ్వకేట్ నర్రా శ్రీనివాసరావు, ఆంధ్రప్రదేశ్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు ఎవి పటేల్, నేస్తం సహ వ్యవస్థాపకులు టి.ధనుంజయరెడ్డి, వంశధార సాధన సమితి ప్రెసిడెంట్ ఎస్‌వివి ప్రసాదరావు ప్రసంగించారు.

తీరంలో అక్రమ నిర్మాణాల తొలగింపు

ప్రజాశక్తి - చీరాల (బాపట్ల జిల్లా)

బాపట్ల జిల్లా చీరాల మండలం వాడరేవు గ్రామంలో అక్రమ నిర్మాణాలను అధికారులు తొలగింపు కార్యక్రమం చేపట్టారు. వాడరేవు గ్రామంలోని సముద్ర అలల రేఖ హైటైడ్‌లైన్‌కు పది మీటర్ల దూరంలో సముద్ర తీరం వెంబడి సిఆర్‌జెడ్ పరిధిని ఉల్లంఘించి అక్రమంగా నిర్మిస్తోన్న ఐఆర్‌టి ఫిషింగ్ కంపెనీకి చెందిన సీఫుడ్స్ ప్రాసెసింగ్ యూనిట్ భవన నిర్మాణాలను అధికారులు ఆదివారం తొలగించారు. ఆర్‌ఐటి సంస్థ ప్రతినిధులకు తెల్లవారుజామున పంచాయతీరాజ్ శాఖ అధికారులు ఫైనల్ నోటీస్ జారీ చేశారు. చీరాల ఆర్‌డిఒ టి చంద్రశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో చీరాల డిఎస్‌పి ఎండి మొయిన్ పర్యవేక్షణలో 50 మంది పోలీసులు వాడరేవు గ్రామాన్ని అదుపులోకి తీసుకుని శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలుగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు.

అక్రమంగా నిర్మిస్తున్న ప్రాసెసింగ్ యూనిట్ భవనాన్ని రెవెన్యూ, పంచాయతీరాజ్ సిబ్బంది మూడు జెసిబిలతో కూల్చివేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు కె గోపికృష్ణ, ఎంపిడిఒ శివసుబ్రహ్మణ్యం, విఆర్‌ఒలు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజా ఉద్యమాలే మార్గం

(మొదటిపేజీ తరువాయి)

సీమ అవసరాలు పట్టించుకోలేదని తెలి పారు. వెనుకబడిన ప్రాంతాల్లోని ఉపాధి, తిండి, చదువు, రవాణా సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వాలను నిలదీయాలని కోరారు. విశాఖ ఉక్కుకు కేంద్ర ప్రభుత్వం సొంత గనులు కేటాయిస్తే నష్టాలు ఉండవని, వీటిని మోడీ ఇవ్వరని, దీనిపై చంద్రబాబు మాట్లాడరని అన్నారు. విభజన చట్టం ప్రకారం కడప ఉక్కు ఫ్యాక్టరీ, వెనుకబడిన ప్రాంతాలకు ప్రత్యేక ప్యాకేజీ మోడీ ఇవ్వకపోయినా జగన్, చంద్రబాబు ఎందుకు అడగం లేదని, రాయలసీమ డిక్లరేషన్ అన్న బిజెపి నాయకులు దాన్ని ఎందుకు అమలు చేయరని ప్రశ్నించారు.

అది సంపన్నుల అభివృద్ధి తప్ప సమగ్రాభివృద్ధి కాదు : తెలకపల్లి రవి

ప్రజల సొమ్మును వ్యాపారవేత్తలకు ధారాదత్తం చేయడం సంపన్నుల అభివృద్ధి తప్ప సమగ్రాభివృద్ధి కాదని ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లి రవి అన్నారు. సదస్సులో ఆయన మాట్లాడుతూ ప్రజలను ఆర్థికంగా అభివృద్ధి చేసినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. సమగ్రాభివృద్ధి దృష్టి ఉన్న వాళ్లు అమరావతి, పోలవరం మాత్రమే అభివృద్ధి చేస్తామని చెప్తారా? అని ప్రశ్నించారు. అందరూ ఒప్పుకున్న హైకోర్టును కర్నూలులో ఎందుకు పెట్టలేదని, అందరూ ఆమోదించిన అంశాలను ఎందుకు పట్టించుకోరని ప్రశ్నించారు. కార్పొరేట్ అభివృద్ధి తప్ప కామన్ మ్యాన్ అభివృద్ధి లేదన్నారు. సాగునీటి ప్రాజెక్టులు ప్రయివేటుపరం అయిపోతున్నాయని తెలిపారు. కడప ఉక్కు పరిశ్రమకు నాలుగుసార్లు శంకుస్థాపన చేసినా నిధులివ్వరన్నారు. విజన్ పేరుతో ఉన్న ఉద్యోగాలు ఊడపీకుతున్నారని, గతంలో విజన్ 2020ను వ్యతిరేకించిన స్ఫూర్తితో విజన్ 2047ను కూడా ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. అన్ని ప్రాంతాల అభివృద్ధి దిశగా మేధావుల సలహాలతో సమగ్రాభివృద్ధి కోసం ముందుకెళ్లాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ మాట్లాడుతూ విజన్ 2047లో వెనుకబడిన ప్రాంతాల గురించి, సాగు, తాగు నీటి ప్రాజెక్టుల గురించి, ప్రభుత్వాస్పత్రుల గురించి కనీస ప్రస్తావన లేదన్నారు. రాయలసీమలోని ప్రకృతి వనరులను కార్పొరేట్లకు అప్పగించే కుట్ర జరుగుతోందని తెలిపారు. కడపలో ఎపిజిబి ప్రధాన కార్యాలయాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. సదస్సులో సిపిఎం అనంతపురం జిల్లా కార్యదర్శి ఓ.నల్లప్ప, నరసింహయ్య కుమారుడు తెలకపల్లి హరి తదితరులు మాట్లాడారు.

దేశ విదేశాల్లోనూ ఎన్‌డిఆర్‌ఎఫ్‌కు గుర్తింపు

(మొదటిపేజీ తరువాయి)

అమూల్యమైనవన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు కె రామ్మోహన్‌నాయుడు, బి సంజయ్, బి శ్రీనివాసవర్మ, రాష్ట్ర మంత్రులు నారా లోకేష్, వి అనిత, కొల్లు రవీంద్ర, రాజమండ్రి ఎంపి డి పురందేశ్వరి, కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్, ఎన్‌డిఆర్‌ఎఫ్ డిజి పీయూష్ ఆనంద్, ఇడి రాజేంద్ర రత్నం, ఎమ్మెల్యేలు యార్లగడ్డ వెంకట్రావు, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, విపత్తు నిర్వహణశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా తదితరులు పాల్గొన్నారు.

స్వాధీనం చేసుకున్న సిగరెట్లు

రూ.కోటి విలువైన అక్రమ సిగరెట్లు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లాప్రతినిధి

విజయవాడలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.కోటి విలువైన 25,38,000 సిగరెట్ స్టిక్స్, 46 వేల పౌచ్ స్పిట్ టొబాకో (ఖైనీ)ను స్వాధీనం చేసుకున్నట్లు సెంట్రల్ జిఎస్‌టి కమిషనర్ సాధు నరసింహారెడ్డి తెలిపారు. ఈ మేరకు వివరాలను గుంటూరులో ఆయన ఆదివారం మీడియాకు వెల్లడించారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడ అజిత్‌సింగ్ నగర్‌లోని అంబాపురంలో తనిఖీలు నిర్వహించి సరైన పత్రాల్లేకుండా భారతీయ మూలం సిగరెట్లు, ఖైనీ (స్పిట్ టొబాకో) అక్రమంగా నిల్వ ఉంచినట్లు గుర్తించారు. 102 హెచ్‌డిపిఇ సంచుల్లో 25.38 లక్షల జిటిపిఎల్ విమల్, గోల్డ్ విమల్, గోల్డ్ ఫ్లేక్ పారిస్ సిగరెట్ స్టిక్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.96.82 లక్షలుగా నిర్ధారించారు. 23 హెచ్‌డిపిఇ సంచుల్లో 46,000 పౌచ్‌ల స్పిట్ టొబాకో (ఖైనీ) ఉన్నట్లు గుర్తించారు. వీటి విలువ సుమారు రూ.3.68 లక్షలుగా అంచనా వేశారు. తనిఖీలపై సమాచారం ఉన్నా సిగరెట్ల నిల్వదారుడుగానీ, ప్రాంగణం యజమానిగానీ అక్కడికి రాలేదు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటి వరకు రూ.4.17 కోట్ల అక్రమ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నట్లు కమిషనర్ తెలిపారు.

స్విమ్స్, విష్ణు నివాసాలలో టిటిడి ఇఒ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి- తిరుపతి సిటి

రోగులకు వైద్యసేవలు అందిస్తున్న స్విమ్స్, టిటిడి వసతి గృహం విష్ణు నివాసంలో ఆదివారం టిటిడి ఇఒ జె శ్యామలరావు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఇఒ వెంట టిటిడి అధికారులు, స్విమ్స్ అధికారులు ఉన్నారు. ముందుగా స్విమ్స్ ఆస్పత్రిలో టిటిడి ఇఒ, టిటిడి జెఇఒ వి వీరబ్రహ్మం తనిఖీలు చేపట్టారు. రాత్రి సమయాల్లో వైద్యులు, సిబ్బంది హాజరు పట్టికను పరిశీలించారు. స్విమ్స్‌లోని వార్డుల్లో ఆయా షిఫ్ట్‌లలో విధుల్లో ఉన్న వైద్యులు, సిబ్బంది వివరాలను సూచిక బోర్డుల్లో తప్పనిసరిగా పొందుపరచాలని అధికారులను ఇఒ ఆదేశించారు. ఆస్పత్రి లోపల, బయట పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. చికిత్స పొందుతున్న రోగులకు అందుతున్న భోజన సౌకర్యాలు, వైద్య సేవలపై వారిని అడిగి తెలుసుకున్నారు. వారు సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం స్విమ్స్‌లోని అత్యవసర సేవల విభాగం, నెఫ్రాలజీ వార్డు, ఐసియూ, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ, కార్డియాలజీ, ఆర్‌ఐసియు తదితర వార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ ఆర్‌వి కుమార్, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్, టిటిడి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

టిటిడి వసతి గృహం విష్ణు నివాసంలో గదుల కొరత కారణంగా హాలు, సెల్లార్ లో ఉన్న యాత్రికులతో ఇఒ మాట్లాడారు. సుదూర ప్రాంతాల నుండి శ్రీవారి దర్శనం కోసం వచ్చామని, సర్వదర్శనం టోకెన్లు పూర్తయిన నేపథ్యంలో తిరుమలలోని క్యూలైన్లలోనే దర్శనం చేసుకునేందుకు వెళ్తున్నామని యాత్రికులు తెలిపారు. సోమవారం నాడు తిరుమల క్యూలైన్లలోకి నేరుగా వెళ్లి శ్రీవారి దర్శనం చేసుకోవచ్చనే సమాచారాన్ని యాత్రికులకు నిరంతరం చేరవేసేలా మైకులు ద్వారా ప్రకటనలు ఇవ్వాలని అధికారులను ఇఒ ఆదేశించారు. ఇఒ వెంట టిటిడి అధికారులు, సిబ్బంది ఉన్నారు.

క్వార్టర్స్‌కు సబలెంక, గాఫ్

- ఆస్ట్రేలియన్ ఓపెన్



అర్యానా సబలెంక

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ మహిళల సింగిల్స్‌లో టాప్‌సీడ్, బెలారస్‌కు చెందిన అర్యానా సబలెంక, 3వ సీడ్ కోకా గాఫ్ క్వార్టర్‌ఫైనల్‌కు చేరారు. ప్రి క్వార్టర్స్‌లో సబలెంక 6-1, 6-2తో 14వ సీడ్ ఆండ్రీవా(రష్యా)ను చిత్తుచేయగా.. గాఫ్ 5-7తో తొలిసెట్ కోల్పోయినా.. ఆ తర్వాత పుంజుకొని 6-2, 6-1తో మిగిలిన రెండు సెట్‌లను చేజిక్కించుకొని క్వార్టర్స్‌కు చేరింది. ఇక 27వ సీడ్ పువెంచికోవా(రష్యా) 7-6(7-5), 6-0తో 18వ సీడ్ వేకిక్(క్రొయేషియా)ను, 11వ సీడ్ బడోసా(స్పెయిన్) 6-1, 7-6(7-2)తో డానిలోవిక్(సెర్బియా)ను ఓడించింది. ఇక మిక్స్‌డ్ డబుల్స్‌లో రోహన్ బొప్పన్న-జంగ్(చైనా) జంట క్వార్టర్స్‌కు చేరింది. రెండోరౌండ్ పోటీలో వీరికి వాకొవర్ లభించింది.

విద్యార్థుల్లో నైపుణ్యాల పెంపునకు కృషి

- విలువలతో కూడిన విద్యనందిస్తున్నాం : పి.మధు
- చిలువూరు స్కూల్లో రూ.1.80 కోట్లతో కళా ప్రాంగణం ప్రారంభం

కళావేదికను ప్రారంభిస్తున్న మాజీ వీసీ మహేంద్రదేవ్

ప్రజాశక్తి - దుగ్గిరాల (గుంటూరు జిల్లా)

విలువలతో కూడిన నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రతిఫలమేమీ ఆశించకుండా సేవా దృక్పథంతో పని చేస్తున్నామని రాజ్యసభ మాజీ సభ్యులు పి.మధు అన్నారు. గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరులోని కాట్రగడ్డ వెంకటసుబ్బయ్య హైస్కూల్ ప్రాంగణంలో రూ.1.80 కోట్లతో నిర్మించిన కొండపనేని రంగారావు కళా వేదికను మాజీ వైస్ ఛాన్స్‌లర్ సూర్యదేవర మహేంద్రదేవ్, రంగిశెట్టి ఫౌండేషన్ అధినేత, ప్రముఖ పారిశ్రామికవేత్త రంగిశెట్టి జగదీష్‌బాబు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ కాట్రగడ్డ నారాయణ అధ్యక్షతన నిర్వహించిన సభలో మధు మాట్లాడుతూ కళావేదిక నిర్మాణానికి సహకరించిన స్థానికులు గుంటుపల్లి రమేష్, అరబిందో ఫార్మా, నాట్కో ఫార్మా యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. దాతలు అందిస్తున్న సహకారంతో పాఠశాలను అభివృద్ధి పథంలో నడుపుతున్నామని, వచ్చే విద్యా సంవత్సరంలో పదో తరగతి కూడా ప్రారంభిస్తామని ప్రకటించారు. విద్యార్థుల్లో సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామని, ఇందుకు సహకరించేందుకు కోనేరు లక్ష్మయ్య ఇంజనీరింగ్ కాలేజీ ముందుకొచ్చిందని తెలిపారు. పాఠశాలలో కుట్టు మిషన్‌తోపాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. సూర్యదేవర మహేంద్రదేవ్ మాట్లాడుతూ సాంకేతిక విద్యను అందించడంలో మన దేశం చాలా వెనుకబడి ఉందని తెలిపారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లయినా దేశంలో విద్యా పురోగతి లేదని, నిరక్షరాస్యులు గణనీయంగా ఉన్నారని అన్నారు. మహిళల్లో రక్తహీనత, పిల్లలకు సమతుల్య ఆహార కొరత, ప్రజల్లో కొనుగోలు శక్తి లేకపోవడం బాధాకరమన్నారు.

2047 నాటికి దేశం ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే విద్యా రంగంలో పురోగతి అవసరమని పేర్కొన్నారు. రంగిశెట్టి జగదీష్‌బాబు మాట్లాడుతూ వందేళ్ల చరిత్ర కలిగిన చిలువూరు పాఠశాలకు ప్రపంచ స్థాయిలో గుర్తింపు ఉందన్నారు. ఈ పాఠశాలలో చదివిన వారు అనేక దేశాల్లో అత్యున్నత స్థానాల్లో ఉన్నారని, తానూ, మహేంద్రదేవ్ ఈ పాఠశాల పూర్వ విద్యార్థులమేనని తెలిపారు. పాఠశాల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పివి నరసింహారావు, పాఠశాల కమిటీ సహాయ కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ, అమరావతి బాలోత్సవం గౌరవాధ్యక్షులు చలువాది మల్లికార్జునరావు, స్కూల్ నిర్వహణ కమిటీ సభ్యులు ఎన్.భావనారాయణ, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కుసుమ కుమారి, గుంటుపల్లి రమేష్, ప్రముఖ వైద్యులు కెవిఎస్ సాయిప్రసాద్, టిడిపి నాయకులు కేసంనేని శ్రీఅనిత, మాజీ జడ్‌పిటిసిలు జయలక్ష్మి, వెంకట్రావు, తుమ్మపూడి సర్పంచ్ షేక్ అజిజున్ పాల్గొన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా త్వరలో సూర్యఘర్

- మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

కుప్పం నియోజకవర్గంలో ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్న సూర్యఘర్ పథకాన్ని త్వరలోనే రాష్ట్రం అంతటా అమలు చేస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రకటించారు. ఈ పథకంలో భాగంగా ఎస్‌సి, ఎస్‌టి కుటుంబాలకు సౌర ఫలకాలను ఉచితంగానే అమరుస్తామని వెల్లడించారు. దళిత, గిరిజనుల ఉచిత విద్యుత్ పథకానికి తూట్లు అంటూ వైసిపి నేతలు ప్రచారం చేస్తున్నారని ఆదివారం ఒక ప్రకటనలో ఖండించారు. ఎస్‌సి, ఎస్‌టిలకు అందించే ఉచిత విద్యుత్‌పై విషప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎటువంటి అదనపు భారాలు లేకుండా ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించే సూర్యఘర్, పిఎం కుసుమ్ వంటి పథకాల అమలులో జగన్‌కు వచ్చిన నష్టమేంటో ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. జగన్ గత ఐదేళ్ల విధ్వంస పాలన కేంద్ర పెద్దల దృష్టికి కూడా వెళ్లిందని తెలిపారు.

జెవివి పోస్టర్‌ను విడుదల చేస్తున్న డాక్టర్ గేయానంద్, తెలకపల్లి రవి , సురేష్‌కుమార్ తదితరులు

రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగ పోటీల పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి సైన్స్ ప్రయోగ పోటీల పోస్టర్‌ను జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ గేయానంద్, ప్రముఖ రాజకీయ విశ్లేషకులు తెలకపల్లిరవి, యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్ కుమార్ ఆదివారం కర్నూలులో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ గేయానంద్ మాట్లాడుతూ ప్రయోగ పోటీల ద్వారా పిల్లల్లో శాస్త్రీయ ఆలోచనలు, సృజనాత్మకతను పెంచడమే ముఖ్య ఉద్దేశమని తెలిపారు. మూఢనమ్మకాలను విశ్వసించరాదని, శాస్త్రీయతను విద్యార్థి దశ నుంచే అలవర్చుకోవాలని తెలిపారు. సైన్స్ ప్రయోగాల పోటీలు మూడు అంశాల్లో నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీ, పర్యావరణం సుస్థిరాభివృద్ధి, మూఢనమ్మకాలు - శాస్త్రీయ దృక్పథం అంశాల్లో జిల్లా స్థాయిలో మొదటి, రెండవ బహుమతులు అందజేస్తామన్నారు. ఈ పోటీల్లో 8, 9, 10 తరగతి విద్యార్థులు పాల్గొనవచ్చని, ప్రతి టీమ్‌లో ముగ్గురు విద్యార్థులు పాల్గొనవచ్చని తెలిపారు. ఐదు నిమిషాల నిడివి గల ప్రయోగ వీడియోలను ఫిబ్రవరి 15వ తేదీలోగా రాష్ట్ర కేంద్రానికి పంపాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనవిజ్ఞాన వేదిక అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుధీర్‌రాజు, ఖాజా హుస్సేన్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవికుమార్, నవీన్, జయరాజు జన విజ్ఞాన వేదిక నాయకులు పాల్గొన్నారు.

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేయాలి

- కడప ఉక్కు పరిశ్రమను విస్మరించడం తగదు
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు
- పార్టీ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని పిలుపు

సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు

ప్రజాశక్తి - కడప అర్బన్

వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పని చేయాలని, అమరావతితోపాటు అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. కడప జిల్లా పర్యటనకు వచ్చిన సిఎం చంద్రబాబు రాయలసీమ అభివృద్ధికి కీలకమైన కడప ఉక్కు ప్రాజెక్టు నిర్మాణాన్ని విస్మరించడం తగదన్నారు. సిపిఎం 27వ రాష్ట్ర మహసభ సందర్భంగా 'కడప జిల్లా సమగ్ర అభివద్ధి-ప్రజా ప్రణాళిక' అనే అంశంపై కడప ఆర్‌కె నగర్‌లోని సిపిఎం కార్యాలయంలో ఆదివారం సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి కోసం సిపిఎం పోరాటాలు నిర్వహిస్తోందని తెలిపారు. సూపర్ సిక్స్ పథకాల అమలు కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సమయం ఇచ్చామని, అమలులో విఫలమైందని అన్నారు. ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా కొత్త ప్రాజెక్టు నిర్మిస్తామని సిఎం చంద్రబాబు చెప్పడం ప్రజలను మోసగించడమే అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమకు కేంద్రం నిధులు కేటాయించిందంటే కార్మికుల పోరాట ఫలితమే అని పేర్కొన్నారు. రాష్ట్ర విభజన హామీ మేరకు సెయిల్ ఆధ్వర్యంలో కడపలో ఉక్కు పరిశ్రమను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు వల్ల 30 వేల మందికి ప్రత్యక్ష ఉద్యోగాలు, అనుబంధ పరిశ్రమల వల్ల లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. ఉచిత బస్సు ఊసే లేదని, మహిళలకు రూ.1,500 ఇంత వరకు అమలు కాలేదని, తల్లికి వందనం కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. మోడీ, బాబు పాలనలో కార్పొరేట్లకు అభివృద్ధి ఫలాలు అందుతున్నాయని తెలిపారు. విద్యుత్ బిల్లుల మోత నాలుగు రకాలుగా ప్రజలపై వేస్తున్నారని, ఇళ్లకు ఆదాని స్మార్ట్ మీటర్లు వస్తున్నాయని తెలిపారు. స్మార్ట్ మీటర్లు అంటే ఉరితాడే అని హెచ్చరించారు. ఫిబ్రవరి 1, 2, 3 తేదీల్లో నెల్లూరులో నిర్వహించే సిపిఎం రాష్ట్ర మహాసభలో వెనుకబడిన ప్రాంతాల అభివద్ధిపై తీర్మానం చేయనున్నట్లు తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్, కార్యదర్శివర్గ సభ్యులు రామమోహన్, మనోహర్, శివకుమార్, అన్వేష్ మాట్లాడుతూ జిల్లా సమగ్రాభివృద్ధి కోసం పోరాటాలు నిర్వహిస్తామన్నారు. ఉక్కు పరిశ్రమ నిర్మించే వరకు పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పాకిస్తాన్ ఘన విజయం

- తొలిటెస్ట్‌లో వెస్టిండీస్ 127పరుగుల తేడాతో గెలుపు

ముల్తాన్: వెస్టిండీస్‌తో జరిగిన తొలిటెస్ట్‌లో పాకిస్తాన్ 127 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. లో స్కోరింగ్ టెస్ట్‌లో పాకిస్తాన్ స్పిన్నర్లు వెస్టిండీస్‌ను కట్టడి చేశారు. పాకిస్తాన్ నిర్దేశించిన 251 పరుగుల లక్ష్య ఛేదనలో విండీస్ 123పరుగులకే ఆలౌటైంది. పాక్ స్పిన్నర్లు సాజిద్ ఖాన్(5/50), అబ్రార్ అహ్మద్(4/27), నౌమన్ అలీ చెలరేగడంతో విండీస్ సెకెండ్ ఇన్నింగ్స్‌లో 123 పరుగులకే కుప్పకూలింది. విండీస్‌ను గెలిపించేందుకు విండీస్ బ్యాటర్ అలిక్ అథనాజ్(55) అర్ధసెంచరీకి తోడు క్రెయిగ్ బ్రాత్‌వైట్ (12), మికైల్ లూయిస్ (13), టెవిన్ ఇమ్లాచ్ (14), కెవిన్ సింక్లెయిర్ (10) రెండంకెల స్కోర్లు చేశారు. కీసీ కార్తీ 6, జస్టిన్ గ్రీవ్స్ 9, కవెమ్ హడ్జ్, మోటీ, వార్రికన్ డకౌటయ్యారు.

పాక్ స్పిన్నర్ల మాయాజాలం

అంతకుముందు వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 137 పరుగులకే కుప్పకూలింది. నౌమన్ అలీ (11-2-39-5), సాజిద్ ఖాన్ (12-0-65-4), అబ్రార్ అహ్మద్ (1.2-1-6-1) విండీస్ నడ్డి విరిచారు.

విండీస్ ఇన్నింగ్స్‌లో 10, 11వ నంబర్ ఆటగాళ్లు వార్రికన్ (31 నాటౌట్), జేడన్ సీల్స్ (22) మాత్రమే 20కి పైగా పరుగులు చేశారు. బ్రాత్‌వైట్ (11), కెవిన్ సింక్లెయిర్ (11), మోటీ (19) రెండంకెల స్కోర్లు చేయగా.. మికైల్ లూయిస్ (1), కీసీ కార్తీ (0), కవెమ్ హడ్జ్ (4), అలిక్ అథనాజ్ (6), జస్టిన్ గ్రీవ్స్ (4), టెవిన్ ఇమ్లాచ్ (6) సింగిల్ డిజిట్ స్కోర్లకే టపా కట్టేశారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ సాజిద్ ఖాన్‌కు దక్కింది. ఈ గెలుపుతో రెండు టెస్ట్ మ్యాచ్‌లల సిరీస్‌లో పాక్ 1-0 ఆధిక్యంలో నిలిచింది. రెండో టెస్ట్ ఇదే వేదికగా జనవరి 25 నుంచి ప్రారంభం కానుంది.

తిరుపతి నగరంలోని జైశ్యామ్ థియేటర్‌లో చిత్ర యూనిట్

తిరుపతిలో 'సంక్రాంతికి వస్తున్నాం'.. సందడి

ప్రజాశక్తి- తిరుపతి సిటి

తిరుపతి నగరంలోని జై శ్యామ్ థియేటర్‌లో ఆదివారం సంక్రాంతికి వస్తున్నాం.. చిత్ర యూనిట్ సందడి చేసింది. తిరుమల శ్రీవారిని దర్శించుకుని అనంతరం చిత్రాన్ని తిలకించడానికి, ప్రేక్షకుల మధ్య గడపడానికి ఆ చిత్ర యూనిట్ జై శ్యామ్ థియేటర్‌కు వచ్చింది. ఈ సినిమాలో సన్నివేశాలను, డైలాగులను హీరోయిన్లతో కలిసి సెటైర్లు వేస్తూ అభిమానులు కేరింతలు కొట్టారు. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై దిల్‌రాజు నిర్మాతగా అనిల్ రావిపూడి దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రం శ్రీవెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో విజయవంతం అయిందని ఈ చిత్ర రథసారథులు అన్నారు. థియేటర్ నిర్వాహకులు ఎన్‌వి ప్రసాద్, ఆర్‌సి మునికృష్ణ, సిబ్బంది, పోలీసులు ఈ థియేటర్లో ఎటువంటి తొక్కిసలాట లేకుండా విజయవంతం చేశారు.

రాఘవమ్మ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

మతోన్మాద శక్తులపై పోరాటమే కర్తవ్యం

- రాఘవమ్మ సంతాప సభలో వక్తలు

ప్రజాశక్తి - అమలాపురం (అంబేద్కర్ కోనసీమ జిల్లా)

మతోన్మాద శక్తులపై పోరాటమే తక్షణ కర్తవ్యమని వక్తలు పిలుపునిచ్చారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం తొత్తరమూడిలో ఆదివారం సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అధ్యక్షతన కుడిపూడి రాఘవమ్మ సంతాప సభ జరిగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, డి రమాదేవి, సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బి బలరాం, పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు దడాల సుబ్బారావు హాజరై రాఘవమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ ఒక మహిళ కమ్యూనిస్టుగా మారడం ప్రజా సమస్యలపై గొంతు విప్పడం అంటే అప్పుడున్న పరిస్థితుల్లో సాధారణ విషయం కాదని అన్నారు, రాఘవమ్మ ఆశయ సాధన కోసం పాటుపడ్డాలని కోరారు. రమాదేవి మాట్లాడుతూ రాఘవమ్మ ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచి ఉంటారన్నారు. ఎర్ర జెండాను పట్టుకుని ఏళ్ల తరబడి ప్రజా సమస్యలపై పోరాడిన ధీరవనిత అని కొనియాడారు. రాఘవమ్మ ఆశించినట్టు ప్రస్తుతం దేశాన్ని పట్టిపీడిస్తున్న ఈ మతోన్మాద శక్తులను తిప్పి కొట్టడమే ఆమెకు ఇచ్చే ఘనమైన నివాళని అన్నారు. ఎమ్మెల్సీ ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజల సమస్యలపై రాఘవమ్మ పోరాడారని, తుది శ్వాస వరకూ నమ్మిన సిద్ధాంతానికి కట్టుబడి ఉన్నారని పేర్కొన్నారు. దడాల సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ కార్మిక సంఘం, మహిళా సంఘం, ప్రజా సంఘాల్లో రాఘవమ్మ చేసిన పోరాటాలు ఎప్పటికీ చిరస్థాయిగా ఉంటాయన్నారు. ఆమెను నేటి తరం యువత స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం, ప్రజా, కార్మిక సంఘాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టిఎన్‌యుఎస్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టిఎన్‌యుఎస్) 2025 డైరీ, కేలండర్‌ను హోంమంత్రి వంగలపూడి అనిత ఆవిష్కరించారు. విజయవాడలోని ఆమె నివాసంలో ఆదివారం ఈ కార్యక్రమం జరిగింది. ఉపాధ్యాయ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని అనిత తెలిపారు. ఉపాధ్యాయ నియామకాలు, ఉపాధ్యాయ వర్గానికి పెద్దయెత్తున మేలు చేసింది టిడిపి ప్రభుత్వం ఒక్కటే అని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం అధ్యక్షులు మన్నం శ్రీనివాస్, ఉపాధ్యక్షులు చెరుకూరి పూర్ణచంద్రరావు, కార్యదర్శి కె వెంకట్రావు యాదవ్, మేడా రామలింగయ్య, బి పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

The Accountant's General Office Employees Cooperative Housing Society Ltd,
Regd No. TA - 68. Flat No.201, 2nd Floor, H.No. 5-9-13/201, Taramandal Complex, Saifabad, Hyderabad - 500004.

NOTICE

All the members of the Accountant's General Office Employees Cooperative Housing Society Ltd are hereby informed that a Non-Official Person Incharge committee was appointed by the DRCS Secunderabad vide proc **Rc No.836/2024 Date 19-12-2024** to manage the affairs of society. In compliance to the instructions of the Registrar it was decided to update the members list and prepare the list of eligible voters for conduct of elections to the Managing Committee of the society. In this view all the members are hereby requested to submit their particulars such as Name, S/o, D/o or W/o, Admission No, Date of admission, Address, Age, Female/Male along with two passport size photos in Google Link: https://docs.google.com/ forms/d/e/1FAIpQL SecuCNOrZa_kouSQJctPefldowzwIEFW7QKERnY2uoWUkXZNQ/viewform or in the society office on or before 05-02-2025 for preparation of voters list.

Place : Hyderabad
Date : 18-01-2025

Sd/- Chairman/Person Incharge Committee, AG Office Employees CHBS Ltd.

Note: The members who have not paid the differential share capital of Rs.300/-are requested to remit the same to the society for inclusion of their name in the list of eligible voters.

UCO BANK
(A Govt. of India Undertaking)
హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ బ్రాంచ్, 4" అంతస్తు, 10, బిటిఎం సరణి, కోల్‌కతా-700001

ADV NO.: HO/HRM/RECR/2024-25/COM-75 Dated: 16-01-2025

యూకో బ్యాంక్, ప్రముఖ ప్రభుత్వరంగ బ్యాంకు వారు **రెగ్యులర్ ప్రాతిపదికన స్థానిక బ్యాంక్ ఆఫీసర్ (ఎల్‌బిఓ)**గా నియామకం కోసం అర్హతకలిగిన అభ్యర్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఖాళీల వివరాలు ఈ క్రింది విధంగా ఉన్నాయి

క్ర.సం.	రాష్ట్రం	తప్పనిసరి స్థానిక భాషా ప్రావీణ్యం	ఖాళీలు
1.	గుజరాత్	గుజరాతి	57
2.	మహారాష్ట్ర	మరాఠి	70
3.	అస్సాం	అస్సామీ	30
4.	కర్ణాటక	కన్నడ	35
5.	త్రిపుర	బెంగాలి/కొక్‌బొరోక్	13
6.	సిక్కిం	నేపాలి/ ఇంగ్లీష్	06
7.	నాగాలాండ్	ఇంగ్లీష్	05
8.	మేఘలయా	ఇంగ్లీష్/ గారో/ఖసీ	04
9	కేరళ	మలయాళం	15
10.	తెలంగాణ& ఆంధ్రప్రదేశ్	తెలుగు	10
11.	జమ్మూ& కాశ్మీర్	కాశ్మీరి	05
		మొత్తం	250

దరఖాస్తు ప్రారంభ తేదీ	16 జనవరి, 2025	దరఖాస్తు ముగింపు తేదీ	05 ఫిబ్రవరి, 2025

వివరణాత్మక ప్రకటన మరియు దరఖాస్తు కోసం, దయచేసి "కెరీర్"సెక్షన్ కింద మావెబ్‌సైట్: https://ucobank.com ని సందర్శించండి. అవసరమైన అర్హత ప్రమాణాలను కలిగిఉన్న అభ్యర్థులు బ్యాంక్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్న లింక్ ద్వారా మాత్రమే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు.

జనరల్ మేనేజర్
హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్

సవరణలు ఏదైనా ఉంటే, బ్యాంక్ వెబ్‌సైట్‌లో మాత్రమే పోస్ట్ చేయబడతాయి.

ఫారం జి
ఆసక్తి వ్యక్తీకరణ కొరకు ఆహ్వానము
M/s. సుదలగుంట షుగర్స్ లిమిటెడ్, షుగర్ ఇండస్ట్రీగా పని చేస్తున్నది
1. తంగెళ్ళపురం గ్రా॥ & గ్రామ పంచాయతీ, బిఎన్ కందిరీగ మం॥, తిరుపతి జిల్లా, ఎ.పి.
2. షుగర్ ఇండస్ట్రీ ప్రభగిరిపట్నం గ్రా॥, పొదలకూర్ మం॥, ఎస్‌పిఎస్ నెల్లూర్ జిల్లా (ఎ.పి)
(ఇన్సాల్వెన్సీ మరియు బ్యాంక్రప్టసీబోర్డ్ ఆఫ్ ఇండియా (కార్పొరేట్ వ్యక్తుల కొరకు ఇన్సాల్వెన్సీ తీర్మానప్రక్రియ) రెగ్యులేషన్స్, 2016లోని రెగ్యులేషన్ 36ఎ సబ్ రెగ్యులేషన్ (1) క్రింద)

సంబంధిత వివరాలు

1.	కార్పొరేట్ డెటార్ పేరు PAN & CIN / LLP నెం.	**M/s. సుదలగుంట షుగర్స్ లిమిటెడ్** U15424AP1994PLC018279
2.	రిజిస్టర్డ్ ఆఫీస్ యొక్క చిరునామా	మయూర నగర్, కటూర్ పోస్ట్, బి.ఎన్. కండ్రిగ మం॥, ఆంధ్రప్రదేశ్, పిన్: 517644, ఇండియా.
3.	URL యొక్క వెబ్‌సైట్	లేదు
4.	స్థిర ఆస్తులు మెజారిటీ ఉన్న స్థలం యొక్క వివరాలు	ప్రభగిరిపట్నం గ్రామం మరియు గ్రామ పంచాయతీ, పొదలకూరు మం॥, ఎస్‌పిఎస్ నెల్లూరు జిల్లా (ఎ.పి), తంగెళ్ళపురం గ్రా॥ & గ్రామ పంచాయతీ, బిఎన్ కండ్రిగ మం॥, తిరుపతి జిల్లా, ఎ.పి.
5.	ప్రధాన ఉత్పత్తులు/సేవల యొక్క వ్యవస్థాపించిన సామర్థ్యం	యూనిట్ 1: తంగెళ్ళపుం గ్రా॥, బి.ఎన్.కండ్రిగ మం॥, తిరుపతి జిల్లా (ఎ.పి). స్థాపిత సామర్థ్యం 4000 టిసిడి మరియు 8 మెగావాట్ల స్థాపిత సామర్థ్యంతో కోజెనరేషన్ ప్లాంట్. భూమి మరియు భవనము: 118.57 ఎకరాలలోని ఫ్యాక్టరీ భవనాలు 4,63,878.41 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయి. 2019 నుండి పని చేయడం లేదు. యూనిట్ 2: ప్రభగిరిపట్నం గ్రా॥, పొదలకూర్ మం॥, ఎస్‌పిఎస్ నెల్లూర్ జిల్లా (ఎ.పి). స్థాపిత సామర్థ్యం 3000 టిసిడి మరియు 6000 కిలోవాట్ల స్థాపిత సామర్థ్యం కలిగిన స్టీమ్ జనరేటర్ పవర్ ప్లాంట్. భూమి మరియు భవనము: 179.005 ఎకరాలలోని ఫ్యాక్టరీ భవనాలు 2,16,145 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్నాయి. 2019 నుండి పని చేయడం లేదు
6.	గత ఆర్థిక సంవత్సరంలో విక్రయించబడిన ప్రధాన ఉత్పత్తులు/సేవల పరిమాణం మరియు విలువ	లేదు
7.	ఉద్యోతులు/వర్క్‌మాన్ యొక్క సంఖ్య	లేదు
8.	రెండు సంవత్సరాల చివరిగా అందుబాటులో ఉన్న ఆర్థిక నివేదికలు (షెడ్యూళ్లతో) సహా మరిన్ని వివరాలు, రుణదాతల జాబితాలు URLలో అందుబాటులో ఉన్నాయి.	ఇ-మెయిల్: sudalaguntasugars2024@gmail.com
9.	కోడ్ యొక్క సెక్షన్ 25(2) (h) క్రింద దరఖాస్తుదారుల తీర్మానము కొరకు అర్హత	ఇ-మెయిల్: sudalaguntasugars2024@gmail.com
10.	ఆసక్తి వ్యక్తీకరణ స్వీకరణకు ఆఖరి తేది	04.02.2025
11.	ఔత్సాహిక తీర్మాన దరఖాస్తుదారుల తాత్కాలిక జాబితా జారీ తేది	14.02.2025
12.	తాత్కాలిక జాబితాకు అభ్యంతరములు దాఖలు చేయుటకు ఆఖరి తేది	19.02.2025
13.	ఔత్సాహిక తీర్మాన దరఖాస్తుదారుల తుది జాబితా జారీ తేది	01.03.2025
14.	ఔత్సాహిక తీర్మాన దరఖాస్తుదారులకు తీర్మాన ప్లాన్ల కొరకు వినతి మరియు ఇవాల్యుయేషన్ మాట్రిక్స్, ఇన్ఫర్మేషన్ మెమొరాండమ్ జారీ తేది	06.03.2025
15.	తీర్మాన ప్లాన్ల యొక్క దాఖలుకు ఆఖరి తేది	05.04.2025
16.	ఆసక్తి వ్యక్తీకరణను సమర్పించడానికి ఇమెయిల్ ఐడిని ప్రాసెస్ చేయండి	sudalaguntasugars2024@gmail.com

సం/- చిన్నం పూర్ణ చంద్ర రావ్
ఈ విషయంలో రిజల్యూషన్ ప్రొఫెషనల్
మెస్సర్స్ సుదలగుంట షుగర్స్ లిమిటెడ్ CIRP క్రింద
Reg No: IBBI/IPA-003/IP-N00119/2017-2018/11298
AFA 31.12.2025 వరకు చెల్లుతుంది

తేది: 20.01.2025
ప్రదేశం: హైదరాబాద్

ఫ్లాట్ నెం. జి1 క్లౌడ్ 9 హైట్స్, 7-1/ఎఫ్5/6/ఎ/1, రోడ్ నెం. 8, పంచవటి కాలనీ, మణికొండ, హైదరాబాద్-500089, తెలంగాణ రాష్ట్రం

సాహిత్యం జీవిత ప్రతిబింబం.
ఏ కాలం నాటి సాహిత్యం ఆనాటి
సామాజిక వ్యవస్థను ప్రతిబింబిస్తుంది.
– కాల్ రిడ్జ్

గాజా నవ్వుతోంది!

ఇంతకాలం వేలాదిమంది
పసిపాపల అసువులు తీసిన
వాడు ఒక్క ఫోన్ పిలుపుతో
యుద్ధాన్ని ఆపేసాడు!

ఇంకా ఏం మిగులుందని
ఇక్కడ జరగాల్సిన ఆక్రమణ
అంతా చేసి నిలువ నీడ లేకుండా చేసి
పసిపాపలను స్త్రీలను చంపుకుంటూ పోయి
ఆసుపత్రులు పాఠశాలలు లేకుండా చేసి
మిగిలి వున్న వాళ్ళని అవిటి వాళ్ళను చేసి
ఇప్పుడు నువ్ సీజ్ ఫైర్ అంటే
గాజా ఇంత దుఃఖంలోనూ నవ్వుతోంది

అమ్ముకున్న ఆయుధాల
బేహారులాకిది కొంత
మార్కెట్ విరామం కావొచ్చు!
సగం దేహాలతో
మిగిలిన వారికి ఇది
ఊపిరి పీల్చుకునే
సమయం మాత్రమే కదా!

బూడిద రాసులలోంచి
మరల మొలకెత్తే పాలస్తీనా
నీకిది కొత్తగాదు కదా?

– కె క్యూబ్ వర్మ, 94934 36277

పండుగ బానే జరిగింది!

ఫర్వాలేదు
గాలిపటాలు రివ్వున ఎగిరాయి
మాంజాలు గొంతు కోస్తున్నా.
గెలిచినా, ఓడినా,
కూరొండుకుంటారని తెలియని
పుంజులు పౌరుషానికి పోయాయి
ప్రాభవాలు కోల్పోయినా,
భారీగానే ఊరేగాయి ప్రభలు.
పిండి వంటలు నోరూరించాయ్,
చాకిరీ చేసిన ఇంటామెకు
కృతజ్ఞతలు చెప్పకుండానే ...
మగాళ్ల గళాసులతోనూ,
ఆడాళ్ల రీల్స్‌తోనూ సందడి చేశారు.
ఇంటి బయట ముసలాళ్లతో
సెల్ఫీ మాత్రం ఎవ్వళ్లూ మర్చిపోలేదు
ఆడంబరాలను ఆత్మీయతగా,
కలవని వరుసలను కుదుర్చుకోడాన్నే ప్రేమగా,
ఆస్తుల లెక్కలను అనురాగంగా,
మార్చుకోవడానికి ఏ యాప్ యూజ్ చేశారో
ఎవరూ మరొకరికి చెప్పలేదు!
బిగుతైన దుస్తుల నడుమ గొబ్బెమ్మలు,
తుళుకులీనే డ్యాన్సుల్లో సంక్రాంతి లక్ష్ములు
కనుమనాటి మందు, ముక్కల్లా
జత కలిసిపోయాయ్.
చీరలు తెరలు కట్టిన
పాత ఇంటి మండువా లోగిళ్లలో ...
ఎడ్ల పందేలు జోరుగా సాగడం
బహిరంగ రహస్యమే!
తెల్లవారుజాము చుక్కల ముగ్గుల్లో
ఎకసెక్కాలు ఎవరినీ గాయపర్చనందుకు
నైటీలేమీ నివ్వెరపోలేదు.
మొత్తం మీద పెద్ద పండుగ బాగా జరిగింది
ఎవరు, ఎక్కడ, ఎంత పోగొట్టుకున్నారో
మైక్ సౌండ్లలో ఎవరికీ వినిపించలేదు.
పగలే దుస్తుల్లేకుండా డాన్సాడిన
సుందరాంగులు తర్వాతెవరికీ అగుపియ్యలేదు.
మొదట డబ్బులొచ్చిన
గుండాటలోని మోసమేమిటో,
కొమ్ములు తిరిగినోళ్లకీ అవగతం కాలేదు.
హరిదాసులు, గంగిరెద్దులు స్మాల్ బ్రేక్‌లో
చేసిన ఎంటర్టైన్మెంట్,
పెద్దగా చిల్లర రాల్చలేదు.
డిజిటల్ తెరలపై కాసినో వెలుగుల్లో
ఒక్క బక్క రైతూ కనిపించనందుకు
మేథావులు సైతం విచారించిన దాఖలాల్లేవు.
సరళీకరణ, కార్పొరేటీకరణల మధ్య
సంస్కృతీ, సంప్రదాయం
నలిగిపోతున్నందుకు రహస్యంగానైనా
స్వామీజీలు నొచ్చుకున్నట్టు లేదు.
అందుకే, పెద్ద పండుగ భలే జరిగింది!

– దేశరాజు

వర్తమాన కవి

పాముల బస్తీలో జన్మించి
పోతన సాహిత్యానికి ప్రేరేపితుడై
తెలుగు సంస్కృత సాహిత్యాలను పఠించి
ఉత్తమ కావ్య సృష్టి చేసెనే!

వీధిబడి నుంచి విశ్వవిద్యాలయానికి ఎదిగి
వర్ణ ధర్మాన్ని కలముచే బద్దలు కొట్టి
అట్టడుగు జనుల ఆవేదనను ఆవిష్కరించి
దళిత సాహిత్య చరితను మలుపు తిప్పెనే

నేనింకా నిషిద్ధ మానవుడ్ని అనుచు
తాడిత పీడితుల్ని జాగృతం చేస్తూ
తొలి దళిత కవితా సంకలనంలో
మొదటి పేజీ తానయ్యనే ...

నీ వెండి కాళ్ళ కడియాల ముందు
వెయ్యేళ్ల కావ్య నాయకలు వెలవెలబోయారని
దళిత జాతి స్త్రీ సౌందర్యాన్ని
నల్ల ద్రాక్ష పందిరిగా ఉభయ భాషల్లో రచించెనే

దళిత బతుకుల వెతలను
కొత్త గబ్బిలంచే మోయించి
సాహిత్య సాగరమున
మేలిమి ముత్యమై మెరిసెనే

నా అక్షరమే నా ఆయుధమనుచు
కథానాయకుడు జాషువా ప్రాశస్త్యము
పుష్కర కవితలలో తెలిపి
వర్తమాన కవి తానై వెలుగొందెనే ...

(జనవరి 21 : ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారి జయంతి)

– అనిల్ కుమార్

కర్నూలు సాహితీ స్రవంతి అధ్యాయంలో ఒక మలుపు



పాతికేళ్ల క్రితం దేశాభిమానిగా ఉండి, తరువాత సాహితీ స్రవంతిగా అవతరించిన సాహిత్య సంఘానికి కర్నూలులో ఒక కార్యాలయం ఏర్పడింది. సీనియర్ సిపిఎం నాయకుడు తెలకపల్లి నరసింహయ్య ఆరవ వర్ధంతి సందర్భంగా కర్నూలులో ఆయన నివసించిన ఇంటినే సాహితీ స్రవంతి ప్రాంతీయ కార్యాలయంగా వినియోగించేందుకు వారి కుటుంబం ఇచ్చింది. సాహితీ స్రవంతి ఆవిర్భావం నుంచి కర్నూలు కీలక కేంద్రంగా ఉంది. అందులో తెలకపల్లి నరసింహయ్య గారి పాత్ర మరువలేనిది. సాహిత్య కార్యక్రమాలకు ఒక రూపును, కూర్పును ఇచ్చిన సాహితీ స్రవంతి కర్నూలులో నరసింహయ్య గారి చేతుల మీదుగానే ప్రారంభించబడింది. ఇప్పుడు ఆయన నివసించిన ఇంటిలో సాహితీ స్రవంతి కార్యాలయాన్ని గాడిచర్ల హరిసర్వోత్తమ రావు ఫౌండేషన్ అధ్యక్షులు కురాడి చంద్రశేఖర్ కల్కూర ప్రారంభించారు.

ఇదే సందర్భంలో 1917లో కర్నూలులోని చంద్రమౌళీశ్వర ముద్రాక్షరశాలలో ప్రచురించిన 'చతురిక' నవలను పున:ప్రచురించి ఆవిష్కరించారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం వెబ్‌సైట్‌లో ఉన్న 'చతురిక' నవలని సాహితీ స్రవంతి రాష్ట్ర గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి పరిశోధించి, వెలికి తీశారు. 1917లోనే కర్నూలులో ఒక ముద్రణాలయం ఉండడం, అందులో ఒక నవలను ముద్రించడం అన్న విషయం తెలిసి సాహితీలోకం ఒకింత ఆశ్చర్యానికి లోనయ్యింది కూడా. అప్పుడే ఈ నవలపై చర్చ మొదలైంది. కర్నూలు సాహిత్య చరిత్రలో దీన్నొక మలుపుగా చెప్పుకోవచ్చు. తెలకపల్లి రవి ముఖ్య అతిథిగా, లలితకళా సమితి అధ్యక్షులు పత్తి ఓబులయ్య, ప్రముఖ రచయిత ఎస్.డి.వి.అజీజ్ విశిష్ట అతిథులుగా పాల్గొన్న ఈ కార్యక్రమానికి సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అధ్యక్షత వహించగా, రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు సమన్వయకర్తగా వ్యవహరించారు. జిల్లా నాయకురాలు నాగమణి, నరసింహయ్య గారి మూడో కుమారుడు తెలకపల్లి హరి కూడా పాల్గొన్నారు. వక్తలు మాట్లాడుతూ, తెలకపల్లి రవి ఈ పరిశోధనా గ్రంధాన్ని సేకరించి కూర్పు చేయడం వల్ల నవలా సాహిత్య చరిత్రలో ఒక పుటను సంపాదించుకున్నారని అన్నారు.

ఈ నవలకు తెలకపల్లి రవి ముందుమాట రాశారు. 'చరిత్రలో, సాహిత్య చరిత్ర పరిశోధనలో ఎన్నో విషయాలు వెలుగులోకి వస్తుంటాయి. ఆ కోవలోకి ఈ 'చతురిక' నవల కూడా వస్తుంది. వివిధ దేశీయ భాషల్లో తొలి తరం రచయితలు ఎక్కువమంది అపరాధ పరిశోధక కథలతోనే రచన ప్రారంభించారు. ఆ ఒరవడిలోనిదే రచయిత ఉయ్యాలవాడ రామచంద్రరావు రాసిన 'చతురిక' నవల. కర్నూలు డిప్యూటీ కలెక్టరుగా పనిచేసిన నరహరి గోపాలక్రిష్ణ చెట్టి 1872లో వెలువరించిన శ్రీరంగరాజ చరిత్రము మొదటి నవల కాగా, 1878లో కందుకూరి ప్రచురించిన రాజశేఖర చరిత్రము రెండవ నవల. తెలంగాణలో ఇంకా ముందే చారిత్రక నవలలు వచ్చాయని మిత్రులు పేర్కొంటున్నారు. 1874లోనే అనంతపురం జిల్లాకు చెందిన గడియారం రామశాస్త్రులు 'పేటికాంతర శవం' తొలి అపరాధ పరిశోధక నవల వెలువడినట్టు తెలుస్తోంది.' అని పేర్కొన్నారు.

ఐదు అధ్యాయాలుగా 40 పేజీల్లో ఉన్న ఈ చిన్న నవలలో విజ్ఞానసాగరుడనే అపరాధ పరిశోధకుడు, అతని స్నేహితుడు, ఒక జమీందారు, చతురిక అనే ఒక వేశ్య ముఖ్య పాత్రధారులు. ఒక న్యాయవాది గురించిన విషయాలు వస్తుంటాయి కాని అది పాత్ర రూపంలో ఉండదు. విద్యాసాగరునికి చతురమైన బుద్ధిశక్తి, సూక్ష్మ విషయాలను కచ్చితంగా చెప్పే లక్షణం, సందర్భానుసాగంగా పరిసరాలను, మనుషులను, వస్తువులను చూసి అంతక్రితం ఏమి జరిగి ఉంటుందో చెప్పే తెలివితేటలు బాగా ఉంటాయని అతని మిత్రుడి పాత్ర తెలుపుతుంది. అటువంటి అపరాధ పరిశోధకుడితో ఒక జమీందారుకు పని పడుతుంది. చతురిక అన్న వేశ్య దగ్గర తామిద్దరూ ఉన్న చిత్రపటం (ఫోటో) ఉందని, తనకు పెళ్ళి జరగబోతున్నందున ఆ ఫోటోను ఎలాగైనా ఆమె దగ్గరనుండి తనకు తెచ్చివ్వాలని జమీందారు విజ్ఞాన సాగరుణ్ణి కోరతాడు. ఆ చిత్రపటాన్ని దొంగిలింపజేసే ప్రయత్నం చేశానని, అది విఫలమైందని కూడా చెబుతాడు. ఆమెకు డబ్బులిచ్చి తీసుకుందామని విజ్ఞాన సాగరుడు అనగా, ఆమెను డబ్బుతో కొనలేరని జమీందారు చెబుతాడు. ఇలా చతురిక గుణగణాలను చెప్పకనే చెబుతాడు రచయిత. ఆమె పాత్ర చూస్తుంటే కన్యాశుల్కంలోని మధురవాణి మనకు గుర్తొస్తుంది.

ఫోటోను సంపాదించే క్రమంలో విజ్ఞాన సాగరుని శక్తియుక్తులను రచయిత బాగా వర్ణిస్తాడు. అతడి ఎత్తుగడలు ఆసక్తిని కలిగిస్తాయి. సాంకేతిక విజ్ఞానాన్ని వినియోగించుకుంటాడు. చతురిక ఇంటి చుట్టుపక్కల వారిని వశపరచుకొని తన పనిలో ఉపయోగించుకున్నానని కూడా విజ్ఞానసాగరుడు మిత్రుడితో చెబుతాడు. డిటెక్టివ్ కథ కాబట్టి పెళ్ళైన చతురిక, భర్త అంటే న్యాయవాది ఇద్దరూ వేర్వేరు మార్గాల్లో వెళ్ళిపోవడం, తరువాత దేశాన్ని విడిచిపోవడం ఇవన్నీ కూడా కథానాయకుడైన డిటెక్టివ్ ఎప్పటికప్పుడు కనిపెడుతుంటాడు. నవలంతా ఒక ఎత్తు, విజ్ఞాన సాగరుడు, చతురిక మధ్య జరిగే సంభాషణలు ఒక ఎత్తు. అవి నవల చదివి తెలుసుకుంటేనే పాఠకులకు ఆసక్తి పెరిగేది. ఆ ఫోటోను చతురిక నుంచే తీసుకోవడం ఎలాగన్నది కూడా కొసమెరుపే. మొత్తం పైన 108 ఏళ్ళ నాటి నవల ఎంతో ఉత్తేజకరంగా ఉండడం మనల్ని ఆశ్చర్యపరుస్తుంది. ఈ నవలను ఇప్పుడు వెలువరించటం ఒక ప్రత్యేకతగా నిలిచిపోతుంది.

– జంధ్యాల రఘుబాబు,
98497 53298

శ్రీశ్రీ వ్యంగ్య వైభవం

ఆమధ్య వైజాగ్‌లో ఓ సాహిత్య సభలో శ్రీశ్రీ ఛలోక్తులపై చిరు ప్రసంగం సాగుతోంది. ప్రసంగకర్త నగరంలో కామెడీ క్లబ్బు నిర్వాహకుడు. సాధారణంగా ఆయన ప్రసంగాల్లో ఛలోక్తులు సీమటపాకాయల్లా పేలుతుంటాయి. అంచేత ఆరోజు కూడా ఆయన ప్రసంగం బాగా పండుతుందని అంతా భావించారు. కాని శ్రోతల నుంచి పెద్దగా ప్రతిస్పందన రాలేదు. ప్రసంగకర్త ఛలోక్తుల్ని బాగానే విసిరాడు. ఆయన ప్రయత్నంలో లోపం లేదు. మరి? సభ నీరసంగా జరగడానికి కారణం?

సాహితీప్రియుల్లో శ్రీశ్రీ ఛలోక్తులు ఎంత ప్రాచుర్యం పొందాయంటే అవి చాలామందికి కంఠోపాఠం! అవి ఎన్నోసార్లు చదివినవే. మిత్రుల నోటి వెంట విన్నవే! ఆ చతురోక్తులు అందరికీ తెలిసినవే. కాబట్టే ఆ ప్రసంగం అంతగా ఆకట్టుకోలేదనిపించింది. ఇంగ్లీషులో ఓ మాట వుంది... 'ఫెమిలియారిటీ బ్రీడ్స్ కన్‌టెంప్ట్' అలాగే మనకీ 'అతివ్యాప్తి దోషం' అన్న మాట వుంది. సభ విజయవంతం కాకపోవడానికి కారణం ఇదే కావచ్చు. శ్రీశ్రీ ఛలోక్తులు ఎంతగా జనంలోకి వెళ్లినా కొన్ని మాత్రం అంతగా ప్రచారంలోకి రాలేదు ఎందువల్లో. అయితే వీటి సంఖ్య చాలా స్వల్పం. అలాంటి వాటిని ప్రస్తావించడం ఈ వ్యాస ఉద్దేశ్యం.

శ్రీశ్రీ క్యాన్సర్ చికిత్సలో ఉండగా, ఆయన ఆరోగ్యం కొంచెం కుదుటపడి, మళ్లీ జబ్బు తిరగబెట్టింది. ఆ సందర్భంలో ఆంధ్రజ్యోతి వారపత్రిక సంపాదకుడు పురాణం సుబ్రహ్మణ్య శర్మకి కార్డు రాస్తూ 'నా 'విల్' విషర్స్' కొక శుభవార్త. ఒంట్లో మళ్లీ బాగులేదు" అని చమత్కరించారు. దిగులుపడాల్సిన సమయంలోనూ శ్రీశ్రీలో హ్యూమర్ స్పార్క్ తగ్గలేదు. 'వెల్ విషర్' అన్న ప్రసిద్ధిచెందిన పదబంధానికి శ్రీశ్రీ ఇచ్చిన ట్విస్ట్.

తెలుగు స్వతంత్ర, ఆంధ్రభూమి లాంటి ప్రసిద్ధ పత్రికలకు సంపాదకునిగా పనిచేసిన గోరా శాస్త్రి (గోవిందుని రామశాస్త్రి) షష్టిపూర్తి 1979లో హైదరాబాద్‌లో జరిగింది. ఆ సందర్భంగా నిర్వాహకులు గోరా శాస్త్రి అభినందన సంచికను వెలువరించారు. దానికి రాస్తూ శ్రీశ్రీ "గోరా శాస్త్రి షష్టిపూర్తి సన్మాన సమయంలో హైదరాబాద్‌లో ఉండాలనుకుంటున్నాను. లేకున్నా ఉన్నట్టే" అని అన్నారు. ప్రత్యక్షంగా రాలేకపోయినా తన మనసంతా అక్కడే ఉంటుందనే అర్థంలో అన్న మాట అది. శ్రీశ్రీ వాక్యాలు చురకత్తుల్లా మహా పదును!

అలాగే శ్రీశ్రీ రచనలపై పరిశోధన చేసిన మిరియాల రామక్రిష్ణకి ఉత్తరం రాస్తూ శ్రీశ్రీ "వెంటటే జవాబు రాయనందుకు క్షమించవద్దు" అని రాశారు. ఆ రోజుల్లో ఉత్తరాల భాషలో 'వెంటనే జవాబు ఇవ్వనందుకు క్షమించండి' అని రాయడం రివాజు. కాని శ్రీశ్రీ తీరు వేరు కదా!

ఒక ఇంటర్వ్యూలో క్రాంతికిరణ్ అన్న ఆయన శ్రీశ్రీని "మీరు మేరుపర్వతం అంత చిన్నవాళ్ళటగా?" అని అడిగాడు. దానికి శ్రీశ్రీ "నాకు మేరుపర్వతం ఎంత చిన్నదో తెలియదు" అని సమాధానం ఇచ్చారు.

ఒకసారి విజయనగరానికి చెందిన ఉల్లి తిరుపతి గారు అరవిందుడు గురించి ఒక గదిలో ప్రసంగిస్తున్నారు. లోనికి ప్రవేశిస్తూ గది కిటికీని సగం మూసేశాడు శ్రీశ్రీ. అదేమిటంటే "అర విండో" అని ఛలోక్తి విసిరారు.

ఇప్పటి తరంవారికి ట్రామ్‌ల సంగతి తెలియదు. ట్రామ్ బళ్లు రోడ్ల మీదే ఇనుప పట్టాలపై నడుస్తాయి. వీటికి రెండు మూడు పెట్టెలుంటాయి. వీటి వేగం తక్కువ. టిక్కెట్టు రేటు కూడా తక్కువే. ఒకప్పుడు కలకత్తా, బొంబాయి, మదరాసు మహానగరాల్లో ప్రజా రవాణావ్యవస్థలో ఇవి ముఖ్యమైనవి. నిన్న మొన్నటి వరకు కోల్‌కతా నగరంలో ఇవి తిరిగేవి. ఈమధ్యనే బెంగాల్ ప్రభుత్వం వీటి సర్వీసును నిలిపివేసింది. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా ప్రజల నుంచి నిరసన వచ్చింది. జనంలో ఇవి అంతగా ప్రాచుర్యం పొందాయి మరి. ఎంకి పాటల సృష్టికర్త నండూరి సుబ్బారావు చెన్నపట్నంలో ఓ రోజు ట్రామ్‌లో వెళుతున్నప్పుడు ఎందుకో 'గుండె గొంతుకలోన కొట్లాడుతాది' అన్న వాక్యం ఆయన మదిలో మెరుపులా మెరిసింది. చలం, శ్రీశ్రీ లాంటి ఎందరికో ఇష్టమైన 'ఎంకి పాటలు' కావ్యానికి అలా అంకురార్పణ జరిగింది. శ్రీశ్రీ 1948–50 ప్రాంతాల్లో మదరాసు నుండి వెలువడే 'ఆనందవాణి' పత్రికకు సంపాదకునిగా వ్యవహరించారు. అదే పత్రికలో ట్రామ్ గురించి ఒక చమత్కార రచన చేశారు..."

"ట్రాం మీద ప్రయాణం/ చవకే గాని
ఎక్కడికైనా వెళ్ళాలంటే
నిన్న బయలుదేరాలి"

కవిత్వంలో నిప్పులు కురిపించే శ్రీశ్రీ అదే స్థాయిలో నవ్వులూ పూయించగలరు. ఛలోక్తులు విసరడంలో తెలుగు సాహిత్యకారుల్లో శ్రీశ్రీది అగ్ర తాంబూలం!

– ఎస్. హనుమంతరావు
88978 15656

జీవిత తాత్వికతను వివరించే నవల

అసలు జీవితం ఏమిటి? ఎలా జీవిస్తున్నాం? దాన్ని ఎలా గడుపుతున్నాం? అసలు జీవిత అనుభవాలు అంటే ఏమిటి? ఏ పరిస్థితుల ప్రభావాలు మన జీవితం మీద ఎలా కొనసాగుతున్నాయి? అసలు మనం జీవిస్తున్నామా? లేక ఏదో ఒక గుంజకు మనల్ని మనం కట్టేసుకుని ఆ గుంజ చుట్టూ తప్పనిసరై తిరుగుతున్నామా? ఈ ప్రశ్నలు రేకెత్తించి వాటికి సమాధానాలు చెప్పే ప్రయత్నం చేస్తుంది 'తాకట్టులో రఘునాథ్' నవల. రేహన్ పర్ రఘ్గూ కాశీనాథ్ సింగ్ హిందీ రచన. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు పొందిన నవల. దీనిని ఆచార్య పేరిశెట్టి శ్రీనివాసరావు తెలుగులోకి అనువదించగా, కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించింది. మూల రచయిత రాసిన కథా వాతావరణానికి, పాత్రల స్వభావానికి, కథా కాలపు వర్తమాన సామాజిక పరిస్థితులకు ఎక్కడా తేడా రాకుండా అనువాదం సాగింది.



రఘునాథ్ అనే 71 ఏళ్ల వృద్ధుడు చెబుతున్న కథ ఈ నవల. తన అనుభవాలనుంచి చెబుతున్న కథ. అసలు అనుభవాలే లేకపోతే జీవించడం ఎందుకు? అనే ప్రశ్నతో నవల ప్రారంభమవుతుంది. హోరుగాలి, ధారాపాతమైన వర్షంలో తడవడానికి 71 ఏళ్ల వయసులో రఘునాథ్ తన ఇంటిలో నుంచి ప్రకృతి ఇచ్చే వర్షంలో తడిసే అనుభవాన్ని పొందడానికి చేసే ప్రయత్నంతో నవల ప్రారంభం అవుతుంది. ముగింపుకు ముందు చాప్టర్ కూడా ఇదే వర్ణన చేస్తారు రచయిత. ప్రకృతిలో తనకు తాను లీనమవ్వాలి, తన శరీరం నిండా ప్రకృతిని ఆస్వాదించాలి అనుకుని బయలుదేరతాడు. ఆ అనుభవం ఎలా ముగుస్తుంది? దాని పర్యవసానం ఎలా ఉంటుంది? ఇదే ఈ నవలంతా విస్తరించిన జీవన దృశ్యం. మనిషి తాను తన సహజ ప్రకృతికి అనుగుణంగా జీవించాలని అనుకుంటున్నాడా? అలా అనుకుంటే ఈ ప్రకృతిలోని బంధాలు ఆస్వాదించనియ్యవు సరిగదా అశక్తుణ్ణి చేస్తాయి. ఇది రఘునాథ్ పాత్రకు సంబంధించిన అంశం. కానీ రఘునాథ్‌తో ముడిపడి ఉన్న పాత్రలు బంధాలు అతన్ని ఏ రకంగా పట్టి ఉంచుతున్నాయో ఈ నవల వివరిస్తుంది.

చచ్చినా బతికినా కుటుంబం కోసం, కులం కోసం, గ్రామం కోసం అనుకునే స్థితి రఘునాథ్ జీవితం ప్రారంభించాడు. కాలం మారింది. పేపర్లు, సెల్ ఫోన్లు, కోచింగులు, పరీక్షలు, కాంపిటేటివ్ టెస్టులు పేరుతో కాలక్షేపం చేసే పరాన్న జీవ యువత తయారవుతున్న పరిస్థితుల్లోకి ఈ నవల మనల్ని నడిపిస్తుంది. ఒక పాత విలువకి కట్టుబడిపోలేక పోవడం,.కొత్త విలువకి సర్దుకుని పోలేకపోవడంతో ఉండే ఊగిసలాట ధోరణి కూడా కనిపిస్తుంది. మూడు భాగాలుగా ఉన్న నవలలో మొదటి భాగంలో రఘునాథ్ కుటుంబం, రెండో భాగంలో తన గ్రామం, మూడవ భాగంలో బెనారస్ అశోక్ విహార్ ఇంట్లో చిత్రితమవుతాయి.

రఘునాథ్ బెనారస్ ప్రాంతంలోని పహాడ్ గడ్ గ్రామవాసి. ఠాకూర్ సామాజిక తరగతికి చెందినవాడు. సంస్కారం, ఆలోచనాశక్తి ఉన్నవాడు. తన గ్రామానికి దగ్గరగా ఉన్న కళాశాలలో లెక్చరర్‌గా ఉద్యోగం చేశాడు. తను చదువు చెప్పే పిల్లలకి, తన గ్రామస్తులకీ జీవితంలో ఎదగడానికి, ఉద్యోగాలు సంపాదించడానికి సాయం చేశాడు. పెద్ద కొడుకు సంజయ్‌ని కంప్యూటర్ కోర్సు చదివించారు. రఘునాథ్ కళాశాల కరస్పాండెంట్ తన కూతుర్ని సంజయ్‌కి ఇవ్వాలనుకున్నాడు. దానికి రఘునాథ్ కూడా అంగీకరించాడు. కానీ, సంజయ్ తన ప్రొఫెసర్ కుమార్తెను వివాహం చేసుకుని అమెరికా వెళ్లిపోయాడు. దీని పర్యవసానంగా రఘునాథ్ నానా అవమానాలు పడి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకోవాల్సి వచ్చింది.

కూతురు సరళ ఎంఏ; బీఈడీ చేసి ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. ఆమెకు సంబంధాలు చూస్తున్నప్పుడు సుదేష్ భారతి అనే చమార్ కులస్తుణ్ణి చేసుకుంటానంటుంది. రఘునాథ్ తీవ్రంగా కోప్పడతాడు. కానీ సరళ 'నాన్నా, మీరు ఇతరుల షరతులతో నాకు పెళ్లి చేయాలనుకుంటున్నారు, నేను నా షరతులతో పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాను' అని చెప్పి వెళ్ళిపోతుంది. రెండో కొడుకు ధనుంజయ్ బీకాం పూర్తి చేస్తాడు. ఎంబిఏ చేసి విపరీతంగా సంపాదించాలని అతని కోరిక. రిజర్వేషన్ల వల్ల తనకు సీటు వచ్చే అవకాశం లేదని, అహ్మదాబాద్‌లో ఫీజు కట్టే కాలేజీలో చేరతానని తండ్రితో గొడవ పడతాడు. 'నీ బతుకు నువ్వు బతకరా' అంటే సంజయ్ విషయంలోనూ, సరళ విషయంలోనూ ఈ మాట ఎందుకు అనలేదని ఎదురు ప్రశ్నిస్తాడు. ఎంబిఎలో చేరుతాడు. అక్కడ చదువు సంగతి ఏమో కానీ, ఒక బిడ్డ ఉన్న ఉద్యోగస్తురాలైన వితంతువుతో సహజీవనం చేస్తూ ఉంటాడు. బతికినా కుటుంబం కోసమే అన్న రఘునాథ్ నమ్మకం సడలిపోతూ ఉంటుంది. పెద్ద కొడుకు సంజయ్ భార్య అమెరికా నుంచి బెనారస్ వచ్చి యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా చేరుతుంది. అత్తని మామని తనవద్దకు రమ్మని ప్రాధేయపడుతుంది. తండ్రి కొనిచ్చిన అశోక్ మహల్‌లో ఒంటరిగా ఉండడానికి ఆమెకు భయం. ఆ కాలనీలో ఒక్క సంవత్సరంలోనే ఒంటరిగా ఉన్న ముగ్గురిని హత్య చేశారు.

రఘునాథ్, ఉద్యోగ విరమణ తర్వాత స్వగ్రామం చేరతాడు. గ్రామంలో ఒకప్పటి పరిస్థితులు మారిపోయాయి. ఠాకూర్ యువకులంతా వ్యవసాయం చేయడం మానేసి దగ్గర్లో ఉన్న బెనారస్‌కి, మిగిలిన పట్టణాలకు వెళ్లి చదువులు, పరీక్షలు పేరుతో గ్రామానికి దూరంగా ఉంటున్నారు. ఏ పనీ చేతకాని వారిలా తిరుగుతున్నారు. మిగిలిన ఠాకూర్లు గ్రామంలో తమ ఆధిపత్యం కోసం పాకులాడుతూ ఉంటారు. గ్రామంలో చమార్లు వ్యవసాయ కూలీ పెంచమని అడగడంతో గొడవ ప్రారంభమైంది. కూలి విషయమై వారితో మాట్లాడడం మంచిదని చెబుతాడు రఘునాథ్. వారితో మాట్లాడటం అంటే వారికి లొంగడం అని ఠాకూర్లు భీష్మంచుకు కూర్చుంటారు. చమార్లు పనిచేయకపోతే వ్యవసాయం సాగదు. ఈ సమస్యకు పరిష్కారంగా గ్రామంలో ఉన్న యువకులు ట్రాక్టర్లు నడపటం నేర్చుకుంటే మంచిదని రఘునాథ్ చెబుతాడు. 'మీ పిల్లలు ఉద్యోగాలు చేయాలి మేము మాత్రం ట్రాక్టర్లు నడపాలా?' అని యువకులు ప్రశ్నిస్తారు. దశరథ్ యాదవ్ ఈ అవకాశాన్ని వినియోగించుకుని గ్రామానికి ట్రాక్టర్ తీసుకొస్తాడు. ఊళ్లోవాళ్లు ఆ ట్రాక్టర్‌తో పనులు చేయించుకోవడం ప్రారంభించారు. తన అన్న కొడుకులను చదివించిన రఘునాథ్ పెద్దవాడికి ఎలక్ట్రికల్ డిపార్ట్మెంట్లో ఉద్యోగం వేయించాడు. వాడు, వాడి తమ్ముళ్లు రఘునాథ్ ఇంటి స్థలం ఆక్రమించి దాన్ని అడిగినందుకు కొడతారు. కొడుకులకు ఈ విషయం చెబితే వాళ్లేమి పెద్దగా స్పందించరు. ఇంకా చాలా చేదు అనుభవాలు ఎదురవుతాయి. తన తల్లిదండ్రులు ఇచ్చిన భూమి ఇంతకాలం పంటతో తమని బతికించింది. కొడుకులు ఆ భూమిని అమ్మి వేయమంటారు. గ్రామ సంబంధాలు కూడా మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెడుతున్నప్పుడు ఇక అక్కడ ఉండలేననిపిస్తోంది. అప్పుడే కోడలు సోనల్ బెనారస్ వచ్చి అశోక్ విహార్లో ఉండమని ప్రాధేయపడింది. నిజానికి ఆమెని సంజయ్ సరిగా పట్టించుకోకపోవడం వల్లే దేశానికి వచ్చింది. సోనల్‌తో సరిపడక రఘునాథ్ భార్య కూతురు దగ్గరకు వెళ్లిపోయింది. రఘునాథ్ కోడలి దగ్గరే ఉంటాడు. జీవితంలో ప్రధానమైన భాగాన్ని ఎవరి కోసమైతే ఖర్చు పెట్టాడో వారి నుంచి క్రమక్రమంగా దూరంగా జరుగుతూ ఉన్నాడు రఘునాథ్.

పెద్ద కొడుకు ప్రతి సంబంధాన్ని తను ఆర్థికంగా ఎదగడానికి ఉపయోగించుకున్నాడు. చదువుకు తండ్రి, అమెరికా వెళ్లడానికి సోనల్‌తో పెళ్లి. అమెరికాలో మరో మెట్టు ఎక్కడానికి ఆరతీ గుర్జర్‌తో ప్రేమ. రెండవ కొడుకుకి తను కష్టపడకుండా సంపాదించుకోవడం ఇష్టం. దాని కోసం పెద్ద ఉద్యోగం చేస్తున్న వితంతువుతో కలిసి ఉంటున్నాడు. ఆ సంబంధాన్ని కొనసాగించడం వెనక భ్రమా లేదు, ప్రేమా లేదు, నమ్మకం కూడా లేదు. తను కష్టపడకుండా గడపాలనే అవసరం మాత్రమే ఉంది. తమ కళాశాలలో వయసులో పెద్దవాడైన లెక్చరర్‌ను సరళ ప్రేమిస్తుంది. వారి సారనాథ్ ప్రయాణం చేదు జ్ఞాపకంగా మిగులుతుంది. ఉద్యోగం సంపాదించిన సరళ యూనివర్సిటీలో తన క్లాస్‌మేట్ సుదేష్ భారతితో హోటళ్లకు, పిక్నిక్కులకు వెళుతూ ఉంటుంది. కూతురు తక్కువ కులం వాణ్ణి చేసుకుంటానంటే అంగీకరించని రఘునాథ్ ఇప్పుడు 'వాళ్ళిద్దరూ పెళ్లి చేసుకున్నా బాగుంటుంది' అని భార్యతో అంటాడు.

కోడలు సోనల్ యూనివర్సిటీలో చదువుకునేటప్పుడు తన కంటే సీనియర్ అయిన సమీర్‌ను చేసుకోవాలనుకుంటుంది. 'సామాజికోద్ధరణ అని తిరిగేవాళ్ళు పెళ్ళాం సంపాదన మీద ఆధారపడి తెల్లారి లేచాక ఎవడు కాఫీ పోయిస్తాడు, ఎవడు టిఫిన్ పెట్టిస్తాడు అని వీధిలో తిరుగుతారు. చేసుకోవద్ద'ని చెబుతాడు తండ్రి. సంజయ్‌ని ఇచ్చి పెళ్లి చేస్తాడు. అది విఫలమయ్యాక – తాను ఉద్యోగం సంపాదించుకొని తనదైన జీవితం తనకి వచ్చిన తర్వాత సోనల్ సమీర్‌ని కలుస్తుంది. అతన్ని తీసుకొచ్చి మామ గారికి పరిచయం చేసి మన ఇంట్లో ఉంటాడని చెబుతుంది.

నవల చివరలో వర్షంలో తడవడానికి వెళ్లి పడిపోయిన రఘునాథ్‌ను సమీర్ లోపలికి తీసుకువస్తాడు. కొన్ని సపర్యల తర్వాత స్పృహలోకి వస్తాడు. సోనల్, సమీర్ సాన్నిహిత్యాన్ని గమనించి, మనసులో ఆశీర్వదిస్తాడు రఘునాథ్. జీవితంలో ఇంతకాలం తాను చాలా వదులుకుని సంపాదించుకున్న బంధాలు తనవి కానివైపోతున్నాయి. అనుభవాలు జ్ఞాపకాలు మినహా ఈ వయసులో ఏ కట్టుగొయ్య తనని కట్టి ఉంచింది లేదు. నవల ముగింపు ఆలోచింపచేసేదిగా ఉంటుంది. ఈ నవల తాత్వికతను పట్టి ఇస్తుంది. వర్షంలో తడిచి కాస్త కోలుకున్న తర్వాత కర్ర సాయంతో బయటకు వెళ్లి వస్తూ ఉంటాడు రఘునాథ్.

ఒక రోజు తన అన్న కొడుకులు పంపిన ఇద్దరు అతని దగ్గరకు వచ్చి తుపాకీతో బెదిరించి పొలం దస్తావేజులు మీద సంతకం పెట్టమంటారు. ఈ పని చేయడానికి అన్న కొడుకు లక్ష రూపాయల సుపారి ఇస్తున్నట్టు తెలుసుకుంటాడు రఘునాథ్. 'మీకు రెండు లక్షలు ఇస్తాను. నన్ను కిడ్నాప్ చేయండి' అంటాడు. 'నా కొడుకులు ఉన్నారు. రెండు లక్షలు ఇవ్వడం వాళ్లకి కష్టమైన పని కాదు. వాళ్ళు ఇవ్వకపోతే నేనే ఇస్తాను. నన్ను కిడ్నాప్ చేయండి' అని వాళ్ల వెంట వెళ్లడంతో నవల ముగిసిపోతుంది.

రఘునాథ్ 'నేను రెండు లక్షలు ఇస్తాను. మా అన్న కొడుకుని చంపేయమ'ని వాళ్లతో చెప్పలేదు. ఇప్పటివరకు సంప్రదాయం నుంచి వచ్చిన, చావైనా బతుకైనా కుటుంబం కోసం అనే విలువతో తన శక్తిని ధారపోశాడు. పిల్లలు ఈ సమయంలో ఎలా రియాక్ట్ అవుతారో ప్రతిస్పందిస్తారో చూడాలనుకునకున్నాడు. ఇప్పటివరకు తన జీవితాన్ని ఏదో ఒక బంధం కోసం ముడి పెడుతూ ఏదో పొందడం కోసం మరేదో కోల్పోవడం జీవితం అంతా సాగుతూనే ఉంది. అందుకే పిల్లలు ఇవ్వకపోయినా ఆ డబ్బు నేనే ఇవ్వగలను అని వారి వెంట నడుస్తాడు. బాధ్యతలు, ప్రేమలు. కట్టుబాట్లు, భ్రమలు, నమ్మకాలతో జీవితం కూడా తాకట్టు వస్తువులా తెచ్చుకోలేనంతగా కిడ్నాప్ అవుతోంది. ఈ కిడ్నాపుతో మన జీవితాన్ని బలవంతంగా పట్టుకుపోతున్నారు. అందుకే వారి వెంట అయినా నా ఇష్టంతోనే నడవాలి అనే ఒక జీవన దక్పథంతో నవలని ముగిస్తారు. తన వ్యక్తిత్వాన్ని తన స్వేచ్ఛని నిర్బంధించిన కుటుంబాన్ని, సమాజాన్ని, గ్రామాన్ని దాటి తనంతట తానే తన ఇచ్ఛాపూర్వకంగా నడవాలి అనే ఒక ప్రాథమిక దక్పథాన్ని నవల ద్వారా వినిపిస్తారు. జీవిత తాత్విక చర్చల్ని చేసిన నవలని తెలుగు పాఠకులకు అందించినందుకు పేరిశెట్టి శ్రీనివాసరావు గారికి ధన్యవాదాలు.

– డాక్టర్ చిలుకోటి కూర్మయ్య
83329 80181

రాష్ట్రస్థాయి హాకీ విజేత కడప జట్టు

ప్రజాశక్తి-మదనపల్లి అర్బన్: 14వ హాకీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ బాలుర హాకీ ఫైనల్లో కడప జట్టు 3-1 గోల్స్ తేడాతో అనకాపల్లి జట్టుపై విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. మదనపల్లె బిటి కళాశాల మైదానంలో నాలుగు రోజుల పాటు రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ హాకీ పోటీలు ఆదివారంతో ముగిశాయి. మూడో స్థానంలో తిరుపతి, నాల్గో స్థానంలో అన్నమయ్య జట్టు నిలిచింది.

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1) [illegible] వెంకట రామాంజనేయులు, తండ్రి: వెంకట రత్నం, డి.నెం. 9-9-9, మోటుపల్లి వారి వీధి, కొత్తపేట, గుంటూరు జిల్లా-522001. **2) మండి ఫణీంద్ర,** తండ్రి: శ్రీనివాసరావు, డి.నెం. 2-31, సీతారాంపురం, ఉప్పరపాలెం, పొన్నూరు మండలం, గుంటూరు జిల్లా-522124.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీ ఏ.వి.రామాంజనేయులు కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.01-07-2017** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.20-12-2017** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.01-07-2017** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:
గుంటూరు జిల్లా, నల్లపాడు మెయిన్ రోడ్డు, నల్లపాడు, రాయల్ రెసిడెన్సీ సమీపంలో డి.నెం.434/4, వాసవి టవర్స్‌కు ఆనుకుని, సమీప డోర్.నెం.3-73/2, నాల్గవ అంతస్తులో (స్టిల్ + (గ్రౌండ్ + 4వ అంతస్తు) మొత్తం 4937 చ.అ.లలో 48 చ.గ.ల అవిభక్త వాటా గల 2 బెడ్‌రూమ్ నివాస ఫ్లాట్ నెం. 503 [illegible] వెంకట రామాంజనేయులు గారికి చెందిన రిజిస్టర్డ్ సేల్ డీడ్ నెం. 3069/2016, తేదీ. 24.04.2016. హద్దులు: **తూర్పు:** శూన్యాకాశము, **పడమర:** కామన్ కారిడార్, **ఉత్తరం:** శూన్యాకాశము, **దక్షిణం:** శూన్యాకాశము.

తేది: 16-01-2025 — **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ — **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1) మెస్సర్స్ ఎస్.ఎల్.ఎస్ ఫార్మా, ప్రొ. బొగ్గవరపు సుగంధి, షాప్ నం. 23-జి.ఎస్/19, 20, వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్, వెల్ఫేర్ సొసైటీ, గొల్లపూడి, విజయవాడ, ఎన్.టి.ఆర్ జిల్లా, ఏపి-521225. **2) శ్రీమతి బొగ్గవరపు సుగంధి (ఋణగ్రహీత),** తండ్రి: మురళి కుంచపర్తి, ఫ్లాట్ నెం.102, డి.నెం.16-170/1, సాయి టవర్స్, మౌలానగర్, ఆంధ్రా హాస్పిటల్స్ దగ్గర, గొల్లపూడి, విజయవాడ, ఎన్.టి.ఆర్ జిల్లా, ఏపి-521225. **3) శ్రీ బొగ్గవరపు శ్రీనివాసరావు (హామీదారు),** తండ్రి: బి.సుబ్బారావు, ఫ్లాట్ నెం.102, డి.నెం. 16-170/1, సాయి టవర్స్, మౌలానగర్, ఆంధ్రా హాస్పిటల్స్ దగ్గర, గొల్లపూడి, విజయవాడ, ఎన్.టి.ఆర్ జిల్లా, ఏపి-521225.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీ బొగ్గవరపు శ్రీనివాసరావు కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.19-01-2024** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.23-12-2024** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

ఆస్తిని స్వాధీన పరచుకున్న తర్వాత కూడా, మీరు **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170)** కు చెల్లించవలసిన బకాయి మొత్తమును మీరు చెల్లించలేదు. అందువలన, ఈ నోటీసు తేదీ నుండి 30 దినములు తర్వాత దిగువ తెలిపిన ఆస్తిని ఇ-వేలం ద్వారా విక్రయించవలసిన అవసరం ఏర్పడినది. విడిగా జారీచేయబడు అమ్మకం ప్రకటన ద్వారా, వేలం తేదీ మరియు సమయం మరియు సర్వీసు ప్రొవైడర్ వివరములు తెలియచేయ బడతాయి మరియు హెచ్చు ధర ఆఫర్ చేసిన వ్యక్తికి ఆస్తి విక్రయించబడుతుంది. కాబట్టి, ఆస్తులను ప్రైవేటు అమ్మకం ద్వారా కూడా విక్రయించవచ్చును. లేదా వ్యక్తుల నుండి కొటేషన్లు కూడా పొందవచ్చును. బ్యాంక్ ఆమోదయోగ్యమైన మరియు కొనుగోలుదారుని ఉద్దేశించిన నిబంధనలు మరియు షరతులకు లోబడి ఆస్తి విక్రయించవచ్చును.

మీరు ప్రైవేటు అమ్మకం ద్వారా లేదా కొటేషన్ పొందడం ద్వారా ఆస్తిని ఎవరికైనా విక్రయించే ప్రతిపాదనలను కలిగి ఉన్నట్లుయితే, ఈ నోటీసు అందిన తేది నుండి 7 రోజులలోపుగా దానిని బ్యాంక్‌కు తెలియజేయగలరు.

విఫలమైనచో, మీకు అలాంటి ప్రతిపాదన ఏమీ లేదని పైన సూచించిన ప్రకారం ఇ-వేలం ద్వారా ఆస్తి విక్రయం చేయుటకు బ్యాంక్ తదుపరి ప్రక్రియ కొనసాగిస్తుంది.

ఇ-వేలం ప్రకటన ప్రచురణ తేదీన లేదా ఆలోగా బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.19-01-2024** నందు సూచించిన పూర్తి మొత్తంతో పాటు చెల్లించు తేదీ వరకు అందుపై తదుపరి వడ్డీ మరియు అప్పటివరకు సంభవించిన ఖర్చులు మరియు వ్యయాలు చెల్లించి ఆస్తిని విడిపించుకోవచ్చునని దయచేసి మీరు గమనించగలరు. ఇట్టి విషయంలో షెడ్యూలులో తెలిపిన ఆస్తి అమ్మకానికి తదుపరి వేలం ఉండదు. చట్టంలోని సెక్షన్ 13(8) ప్రకారం విముక్తి హక్కు అందుబాటులో ఉంది.

షెడ్యూల్ ఆస్తి

తనఖా పెట్టబడిన ఆస్తుల వివరాలు దిగువ వివరించబడ్డాయి:
ఐటమ్ నెం: 1: కమర్షియల్ షాప్ బేరింగ్ షాప్ నెం: 1బి-132, వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ మొదటి అంతస్తులో, వెల్ఫేర్ సొసైటీ ప్రకారం సేల్ డీడ్ నెం: 1754/2015. ఏ-షెడ్యూల్: కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం, విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామపంచాయితీ ప్రాంతం, గొల్లపూడి గ్రామం, ఆర్.ఎస్.నెం: 188/1 మరియు 534/1కు హద్దులు: **తూర్పు:** బొమ్మసాని కృష్ణ మూర్తి గారి ఆస్తి, **దక్షిణం:** జాతీయ రహదారి రోడ్డు అభివృద్ధి కోసం పంచాయితీకి బహుమతిగా ఇచ్చిన ఆస్తి అంటే రోడ్డు, **పడమర:** తాడంకి రాబెలమ్మ గారి ఆస్తి, **ఉత్తరం:** వేణుగోపాల స్వామి వారి దేవస్థానం ఆస్తి. పైన పేర్కొన్న నాలుగు సరిహద్దుల మధ్య 21.00 చ.గ.లు లేదా 17.56 చ.మీ.ల అవిభక్త ఉమ్మడి వాటాతో 12,532.08 చ.గ.ల స్థలం. **బి-షెడ్యూల్:** పైన పేర్కొన్న ఏ-షెడ్యూల్‌లో చూపిన మొత్తం పరిధిలో అసెస్‌మెంట్ నెం: 8394, డి.నెం: 23-1బి/132, "వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ వెల్ఫేర్ సొసైటీ" పేరుతో నిర్మించిన వాణిజ్య కాంప్లెక్స్ నిర్మాణం మొదటి అంతస్తు, షాప్ నెం: 1బి-132కు హద్దులు: **తూర్పు:** కామన్ కారిడార్, **దక్షిణం:** ఈ షాపు మరియు షాప్ నెం: 1బి-131 మధ్య ఉమ్మడి గోడ, **పడమర:** శూన్యాకాశము, **ఉత్తరం:** ఈ షాప్ మరియు షాప్ నెం.1బి-133 మధ్య ఉమ్మడి గోడ. పైన పేర్కొన్న నాలుగు సరిహద్దుల మధ్య 516.0 చ.అ.ల ప్లింత్ ఏరియా గల షాపు, 171.00 చ.అ.లు కామన్ ఏరియా, పైన పేర్కొన్న కాంప్లెక్స్ యొక్క అన్ని ఉమ్మడి మరియు సౌలభ్య హక్కులతో. **ఐటమ్ నెం:2:** సేల్ డీడ్ నెం: 1753/2015 ప్రకారం వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ వెల్ఫేర్ సొసైటీ గ్రౌండ్ ఫ్లోర్‌లో కమర్షియల్ షాప్ బేరింగ్ షాప్ నెం: జిబి-58. **ఏ-షెడ్యూల్:** కృష్ణాజిల్లా, ఇబ్రహీంపట్నం సబ్ రిజిస్ట్రార్ ఆఫీస్, విజయవాడ రూరల్ మండలం, గొల్లపూడి గ్రామపంచాయితీ ఏరియా, గొల్లపూడి గ్రామం. ఆర్.ఎస్.నెం: 188/1 మరియు 534/1కు హద్దులు: **తూర్పు:** బొమ్మసాని కృష్ణమూర్తి గారి ఆస్తి, **దక్షిణం:** జాతీయ రహదారి రోడ్డు అభివృద్ధి కోసం పంచాయితీకి బహుమతిగా ఇచ్చిన ఆస్తి అంటే రోడ్డు, **పడమర:** తాడంకి రాబెలమ్మ గారి ఆస్తి, **ఉత్తరం:** వేణుగోపాల స్వామి వారి దేవస్థానం ఆస్తి. పైన పేర్కొన్న నాలుగు సరిహద్దుల మధ్య 21.00 చ.గ.లు లేదా 17.56 చ.మీ.ల అవిభక్త ఉమ్మడి వాటాతో 12,532.08 చ.గ.ల స్థలం. **బి-షెడ్యూల్:** పైన పేర్కొన్న ఏ-షెడ్యూల్‌లో చూపిన మొత్తం పరిధిలో అసెస్‌మెంట్ నెం: 8320, డి.నెం: 23-జిబి/58, "వాసవి ఫార్మా మార్కెట్ కాంప్లెక్స్ వెల్ఫేర్ సొసైటీ" పేరుతో నిర్మించిన వాణిజ్య కాంప్లెక్స్ నిర్మాణం గ్రౌండ్ ఫ్లోర్, షాప్ నెం: జిబి-58కు హద్దులు: **తూర్పు:** కామన్ కారిడార్, **దక్షిణం:** మెట్లు, **పడమర:** సెట్ బ్యాక్ ప్రయోజనం కోసం వదిలిన ఖాళీ స్థలం, **ఉత్తరం:** ఈ షాప్ మరియు షాప్ నెం.జిబి-59 మధ్య ఉమ్మడి గోడ. పైన పేర్కొన్న నాలుగు సరిహద్దుల మధ్య 516.0 చ.అ.ల ప్లింత్ ఏరియా గల షాపు, 171.00 చ.అ.లు కామన్ ఏరియా, పైన పేర్కొన్న కాంప్లెక్స్ యొక్క అన్ని ఉమ్మడి మరియు సౌలభ్య హక్కులతో.

తేది: 16-01-2025 — **అధీకృత అధికారి**
ప్రదేశము: విజయవాడ — **యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా**

సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసులో నిందితుడికి
24 వరకూ పోలీస్ కస్టడీ

ముంబయి : బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి కేసు లో అరెస్టయిన వ్యక్తికి ముంబయి కోర్టు ఆది వారం ఐదు రోజుల పోలీస్ కస్టడీ విధించిం ది. అలీఖాన్‌పై దాడి కేసులో అంతర్జాతీయ కుట్ర కోణంపై దర్యాప్తు జరపాల్సి ఉందనే పోలీసుల వాదనను కోర్టు అంగీకరిస్తూ ఈ నెల 24 వరకూ కస్టడీకి అనుమతించింది. అలీఖాన్‌పై దాడి చేసిన వ్యక్తిగా అనుమానిస్తూ ఒక వ్యక్తిని ముంబయి పోలీసులు శనివారం థానేలో అరెస్టు చేశారు. ఆదివారం మధ్యాహ్నం 1.30 గంటలకు బాంద్రాలోని హాలీడే కోర్టులో నిందితుడ్ని పోలీసులు హాజరుపర్చారు. దాడికి పాల్పడిన వ్యక్తి బంగ్లాదేశ్ జాతీయుడని, అతని చర్య వెనుక ఉద్దేశాన్ని కనుగొనాల్సి ఉందని పోలీసులు కోర్టుకు తెలిపారు. అంతర్జాతీయ కుట్రపై కూడా అనుమానం వ్యక్తం చేశారు. నిందితుడు 31 ఏళ్ల షరీఫుల్ ఇస్లాం షెహజాదా అని, ఇతను గత 5, 6 నెలలుగా ముంబయి, పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్నాడని, ఇతని వద్ద భారత నివాసానికి సంబంధించిన ఎలాంటి సరైన ధ్రువీకరణ లేదని పోలీసులు మీడియాకు తెలిపిన సమాచారంలో వెల్లడించారు. భారత్‌లోకి ప్రవేశించిన తరువాత తన పేరును విజయ్‌దాస్‌గా మార్చుకున్నాడని, హౌస్ కీపింగ్ ఏజెన్సీలో పనిచేస్తున్నాడని ముంబయి పోలీసులు తెలిపారు. ఇంట్లోకి చొరబడ్డం నిందితుడికి ఇదే మొదటిసారని చెప్పారు. నిందితుడ్ని అరెస్టు చేయడంలో ముంబయి పోలీసులకు ఒక లేబర్ కాంట్రాక్టర్ సహాయం చేసినట్లు ఒక అధికారి తెలిపారు. థానేలోని అటవీ ప్రాంతంలో ఉన్న ఒక లేబర్ క్యాంప్‌లో నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. గురువారం అర్ధరాత్రి దాటాకా బాంద్రాలోని తన నివాసంలోనే సైఫ్ అలీఖాన్‌పై పలుమార్లు కత్తితో దాడి జరిగింది. ముంబయిలోని లీలావతి ఆసుపత్రిలో సైఫ్ చికిత్స పొందుతున్నారు. ఐసియు నుంచి సాధారణ గదికి సైఫ్‌ను తరలించినట్లు వైద్యులు తెలిపారు. సైఫ్ ఆరోగ్య స్థితి నిలకడగానే ఉందని చెప్పారు.

ట్యాక్స్ టెర్రరిజానికి అంతం పలకండి

- బడ్జెట్‌కు ముందు కేంద్రానికి కాంగ్రెస్ విజ్ఞప్తి

న్యూఢిల్లీ : ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అడ్డంకిగా ఉన్న 'రైడ్ రాజ్, ట్యాక్స్ టెర్రరిజానికి' అంతం పలకాలని కేంద్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ విజ్ఞప్తి చేసింది. త్వరలో కేంద్రబడ్జెట్ ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి (కమ్యూనికేషన్స్) జైరాం రమేష్ ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. దేశీయ తయారీ రంగంలో ఉద్యోగాలను రక్షించడానికి చర్యలు తీసుకోవాలని, వేతనాలు, కొనుగోలు శక్తిని పెంచడానికి నిర్ణయాత్మక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇలాంటి చర్యలు దేశీయ వ్యాపార రంగంలో పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని చెప్పారు. 'జిఎస్‌టి, ఆదాయపు పన్ను రెండింటినీ కవర్ చేసే బైజాంటైన్, శిక్షాత్మక, ఏకపక్ష పన్ను విధానం ట్యాక్స్ టెర్రరిజానికి సమానం. ఇది దేశపు శ్రేయస్సుకు గొప్ప ముప్పు. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు అడ్డంకి' అని జైరాం రమేష్ విమర్శించారు. మన్మోహన్‌సింగ్ ప్రభుత్వ హయాంలో జిడిపిలో 30 శాతం వరకూ ఉన్న ప్రైవేట్ దేశీయ పెట్టుబడులు పదేళ్లలో 20 శాతానికి దిగజారిపోయాయని అన్నారు. పెట్టుబడులు క్షీణించడంతో వలసలు భారీగా పెరుగుతున్నాయని, గత దశాబ్ద కాలంలో 17.5 లక్షల మంది భారతీయులు ఇతర దేశాల పౌరసత్వాన్ని స్వీకరించారని తెలిపారు. 2022 నుంచి 2025 మధ్యకాలంలో దాదాపు 21,300 మంది మిలియనీర్లు దేశం విడిచిపోయినట్లు ఒక అంచనా అని జైరాం రమేష్ వెల్లడించారు. ఇలాంటి పరిస్థితికి మూడు ముఖ్య కారణాలు అని రమేష్ తెలిపారు. ఇందులో మొదటిది సంక్లిష్టమైన జిఎస్‌టి అని, ప్రస్తుతం జిఎస్‌టిలో సెస్‌లతోసహా వంద వరకూ వివిధ ట్యాక్స్ రేట్లు ఉన్నాయని చెప్పారు. ఇలాంటి గందరగోళపు రేట్లతో 2023 - 24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.01 లక్షల కోట్ల జిఎస్‌టికి దారితీసిందని, ఇది అంతకుముందు ఏడాది కంటే దాదాపు రెట్టింపు అని వెల్లడించారు. 2023-24లో రికార్డు స్థాయికి (85 బిలియన్ డాలర్లకు) వాణిజ్య లోటు చేరడం రెండో కారణమని, స్తబ్దుగా ఉన్న వేతనాలు మూడో కారణమని తెలిపారు. ఇలాంటి తిరోగమన విధానాలు భారత్‌పై పెట్టుబడిదారుల విశ్వాసాన్ని దెబ్బతీశాయని విమర్శించారు.

ఇంటివాడైన నీరజ్ చోప్రా

భారత జావెలిన్ స్టార్, రెండుసార్లు ఒలింపిక్ విజేత నీరజ్ చోప్రా ఇంటివాడయ్యాడు. తన పెళ్లి ఫొటోలను నీరజ్ సామాజిక మాధ్యమాల ద్వారా ఆదివారం విడుదల చేశాడు. ఈ ఫొటోలు వెంటనే వైరల్‌గా మారాయి. హిమానితో నీరజ్ పెళ్లి రెండ్రోజుల క్రితమే జరిగిందని, పానిపట్‌కు చెందిన ఆమె ప్రస్తుతం అమెరికాలో చదువుతోందని బంధువులు తెలిపారు.

కేంద్రం భూములిస్తే శానిటేషన్ వర్కర్లకు ఇళ్లు కట్టిస్తాం : ప్రధానికి కేజ్రీవాల్ లేఖ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం భూమి కేటాయిస్తే, ఢిల్లీ ప్రభుత్వం శానిటేషన్ వర్కర్లకు ఇళ్లు కట్టించి ఇస్తుందని ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పేర్కొన్నారు. ఈ మేరకు ప్రధాన మంత్రి నరేంద్రమోడీకి అరవింద్ కేజ్రీవాల్ ఆదివారం లేఖ రాశారు. ఢిల్లీలోని పారిశుధ్య కార్మికులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులకు సబ్సిడీపై భూమి కేటాయించాలని ఆ లేఖలో కోరారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పారిశుధ్య కార్మికులు మురికివాడల్లో నివసిస్తుండటం చూశాను. దీనిపై ప్రధానికి లేఖ రాశాను. ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఒక స్కీమ్ ప్రవేశపెట్టాలని కోరారు. ఆ పథకం కింద సబ్సిడీతో భూములను కేంద్రం కేటాయిస్తే అప్పుడు ఢిల్లీ ప్రభుత్వం వారికి ఇళ్లు కట్టించి ఇస్తుంది' అని తెలిపారు. తొలుత ఎన్‌డిఎంసి, ఎంసిడి పారిశుధ్య కార్మికులకు కేంద్రం భూమి కేటాయిస్తే, వారి వేతనాల నుంచి ఇన్‌స్టాల్‌మెంట్లుగా ఆ మొత్తాన్ని చెల్లిస్తామని చెప్పామని పేర్కొన్నారు. ఇది పేద ప్రజలకు ఉద్దేశించిన పథకం అయినందున ప్రధాని అంగీకరిస్తారని ఆశిస్తున్నట్టు తెలిపారు. ఇది పూర్తయిన తర్వాత మిగతా ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ పథకాన్ని అమలు చేయవచ్చునని చెప్పారు.

బాధితురాలి శరీరంపై గాయాలు లేవు.. గీతలు కన్పించాయి

ఐఐటి-బిహెచ్‌యు కేసులో వైద్యురాలి వాంగ్మూలం

వారణాసి : ఐఐటి - బిహెచ్‌యు విద్యార్థినిపై 2023 నవంబర్ 1వ తేదీన జరిగిన సామూహిక లైంగికదాడికి సంబంధించిన కేసును విచారిస్తున్న ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ముందు ప్రభుత్వ వైద్యురాలు సాక్ష్యమిచ్చారు. బాధితురాలి ప్రయివేటు భాగంపై కొన్ని గీతలు కన్పించాయని ఆమె తెలిపారు. బాధితురాలిని పరీక్షించిన డాక్టర్ అనామికా సింగ్ తన స్టేట్‌మెంటును ఫాస్ట్‌ట్రాక్ కోర్టులో నమోదు చేశారు. బాధితురాలి ప్రయివేటు భాగంలో అంతర్గత గాయం కన్పించలేదని, కానీ బయట కొన్ని గీతలు కన్పించాయని ఆమె తెలిపారు. అత్యాచారం జరిగిన సమయంలో హింసను తోసిపుచ్చలేమని చెప్పారు. నిందితుడు కునాల్ పాండే తరఫున హాజరైన న్యాయవాది వాదనల అనంతరం తదుపరి విచారణ ఈ నెల 20వ తేదీకి వాయిదా పడింది. ఐఐటి - బనారస్ హిందూ విశ్వవిద్యా లయానికి చెందిన బాధితురాలు తన స్నేహితురాలితో కలిసి 2023 నవంబర్ 1వ తేదీ రాత్రి హాస్టల్ నుంచి బయటికి వెళ్లారు. ఆ సమయంలో మోటారు సైకిలుపై వచ్చిన ముగ్గురు వ్యక్తులు ఆమెను ఆపారు. వారు ఆమెను చుట్టుముట్టి వివస్త్రను చేశారు. అనంతరం సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. ఆ దృశ్యాన్ని వీడియో తీశారు. ఈ ఘటన తర్వాత బిహెచ్‌యు విద్యార్థులు చాలారోజుల పాటు నిరసన ప్రదర్శనలు జరిపి నిందితులను అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. తొలుత ఐపిసి సెక్షన్ 354, ఐటి చట్టంలోని నిబంధనల కింద కేసు నమోదు చేసిన పోలీసులు ఆ తర్వాత ఎఫ్ఐఆర్‌లో సామూహిక అత్యాచారాన్ని చేర్చారు. నిందితులు ముగ్గురినీ పోలీసులు అరెస్ట్ చేశారు.

అస్సెట్ రికవరీ బ్రాంచి (79170), విజయవాడ, 4వ అంతస్తు, ఆంధ్రా బ్యాంక్ భవనం, ఆర్.ఆర్. అప్పారావు వీధి, విజయవాడ, ఏపి-520001.

అమ్మకం గురించి ఋణగ్రహీతకు తెలియపరుచు ప్రకటన (30 రోజుల ప్రకటన)
(RULE 6(2)/RULE 8(6) OF SECURITY INTEREST (ENFORCEMENT) RULES 2002)

ఋణగ్రహీతలు/కో ఆబ్లిగెంట్స్ / తనఖాదారులు / హామీదారులు: 1) శైలా ప్లాస్టిక్స్, ప్రొ. షేక్ రషీద్, డోర్ నెం. 54-8-1961 (కొత్త), పాత డోర్ నెం. 15-14-29, 4వ లైన్, ఆర్.టి.సి కాలనీ, పాత గుంటూరు-522001. **2) శ్రీ షేక్ రషీద్,** డి.నెం.39-8-824/7, 5వ లైన్, కన్నా స్కూల్ దగ్గర, ఆర్.టి.సి కాలనీ, పాత గుంటూరు-522001. **3) షేక్ మహబున్నీసా,** డోర్ నెం. 54-8-1961 (కొత్తది), పాత డోర్ నెం. 15-14-29, 4వ లైన్, ఆర్.టి.సి కాలనీ, పాత గుంటూరు-522001. **4) షేక్ రెహ్మాన్ బాబు,** తండ్రి: రషీద్, డోర్ నెం. 54-8-1961 (కొత్తది), పాత డోర్ నెం. 15-14-29, 4వ లైన్, ఆర్.టి.సి కాలనీ, పాత గుంటూరు-522001.

విషయం: సెక్యూరిటైజేషన్ & రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అస్సెట్స్ & ఎన్ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 ప్రకారం యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, అస్సెట్ రికవరీ బ్రాంచి (79170) వారికి శ్రీమతి షేక్ మహబున్నీసా కి చెందిన బకాయి వసూలు కొరకు మీకు చెందిన ఆస్తి అమ్మకం.

చట్టం 13(2) విభాగం పరిధిలో నేను/బ్యాంక్ డిమాండ్ నోటీసు **తేది.19-02-2022** ద్వారా మీకు డిమాండ్ పంపినప్పటికీ మీరు బ్యాంకుకు చెల్లించవలసిన బకాయి మొత్తం చెల్లించుటలో మీరు విఫలమైనారు.

పైన చెప్పిన చట్టం పరిధిలో సంక్రమించిన అధికారాలతో ఈ దిగువ తెలిపిన ఆస్తిని **తేది.02-01-2025** న అధీకృత అధికారి లాంఛనాత్మక స్వాధీన పరచుకున్నారు.

1991వ సంవత్సరపు ప్రార్థనా స్థలాల చట్టాన్ని సవాలు చేస్తూ హిందూ సంస్థలు దాఖలు చేసిన కొన్ని పిటిషన్లను విచారిస్తున్న సుప్రీంకోర్టు...దిగువ కోర్టులో దాఖలైన అన్ని వ్యాజ్యాలు, వాటి ఆదేశాల ప్రకారం జరుగుతున్న సర్వేలపై స్టే విధించింది.

ప్రార్థనా స్థలాల చట్టం చెల్లుబాటును సమర్థించాలని, ప్రార్థనా స్థలాలపై వివాదాలను లేవనెత్తేందుకు చేసే ప్రయత్నాలను అడ్డుకొని చట్టాన్ని అమలు చేయాలని సిపిఎం కేంద్ర కమిటీ సుప్రీంకోర్టును కోరింది.

జమిలి ఎన్నికల బిల్లుపై...

లోక్‌సభకు, రాష్ట్రాల శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించేందుకు వీలుగా మోడీ ప్రభుత్వం పార్లమెంటులో రెండు బిల్లుల్ని ప్రవేశపెట్టింది. వీటిలో మొదటిది 129వ రాజ్యాంగ సవరణ బిల్లు. ప్రస్తుతం అమలులో ఉన్న మూడు క్లాజులను సవరించాలని, రాజ్యాంగంలో కొత్తగా ఓ క్లాజును చేర్చాలని అది ప్రతిపాదించింది. పూర్తి పదవీకాలం ముగియక ముందే లోక్‌సభ రద్దయితే మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు జరపాలని వీటిలో ఒక సవరణ చెబుతోంది. ఉదాహరణకు ఎన్నికలు జరిగిన మూడు సంవత్సరాలకు లోక్‌సభ రద్దయితే తదుపరి ఎన్నికలను రెండు సంవత్సరాల కాలపరిమితికి మాత్రమే నిర్వహించాల్సి ఉంటుంది. రాష్ట్ర శాసనసభలకు సంబంధించి కూడా ఇలాంటి సవరణనే ప్రతిపాదించారు.

ఏదైనా రాష్ట్ర శాసనసభ పదవీకాలం మధ్యలోనే రద్దయితే మిగిలిన కాలానికి మాత్రమే ఎన్నికలు జరుపుతారు. ఇది రాజ్యాంగంలో పొందపరచిన పార్లమెంటరీ ప్రజాస్వామ్య మౌలిక సూత్రాలకు వ్యతిరేకం. ఇలా రాష్ట్ర శాసనసభ పదవీకాలాన్ని కుదించడం సమాఖ్యవ్యవస్థకు ఎన్నికైన శాసనసభ్యుల హక్కులకు తీవ్ర విఘాతం కలిగిస్తుంది. ఈ రెండు బిల్లులను తదుపరి పరిశీలన, సమీక్ష నిమిత్తం పార్లమెంటరీ కమిటీకి నివేదించడం జరిగింది.

సిపిఎం ఇప్పటికే 'ఒకే దేశం...ఒకే ఎన్నిక' విధానానికి వ్యతిరేకంగా ప్రచారోద్యమం ప్రారంభించింది. ప్రజాస్వామ్యానికి, ఫెడరలిజానికి విలువ ఇచ్చే వారందరూ ఈ రాజ్యాంగ సవరణ బిల్లుల్ని వ్యతిరేకించాల్సిన అవసరం ఉంది.

1న ముసాయిదా రాజకీయ తీర్మానం విడుదల

ఏప్రిల్ 2–6 తేదీల మధ్య మదురైలో జరగనున్న పార్టీ 24వ అఖిలభారత మహాసభ ముందు ఉంచే ముసాయిదా రాజకీయ తీర్మానంపై కేంద్ర కమిటీ చర్చించింది. ముసాయిదా రాజకీయ తీర్మానాన్ని కేంద్ర కమిటీ ఖరారు చేసింది. పార్టీలోని అన్ని స్థాయిలలో చర్చించేందుకు వీలుగా దీనిని ఫిబ్రవరి 1వ తేదీన విడుదల చేస్తారు. 'నిర్మాణ నివేదిక ముసాయిదా ' ను ఖరారు చేసేందుకు మార్చి 22, 23 తేదీలలో సమావేశం కావాలని కేంద్ర కమిటీ నిర్ణయించింది.

ఇసి నిబంధనలపై...

ఎన్నికల నిబంధనలకు ఎలక్షన్ కమిషన్ ఏకపక్షంగా మార్పులు ప్రకటించింది. వీడియోలు, ఇతర డిజిటల్ విచారణలు సహా ఎలక్ట్రానిక్ రికార్డులు పొందేందుకు రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, సంబంధిత పౌరులకు అవకాశం లేకుండా చేసింది. ఎన్నికల కమిషన్ తీసుకున్న ఈ తిరోగమన చర్య స్వేచ్ఛాయుత ఎన్నికల ప్రక్రియపై మరో దాడే. ఈ అంశంపై చర్చించి, దిద్దుబాటు చర్యలు చేపట్టేందుకు వీలుగా అన్ని రాజకీయ పార్టీలతో సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కేంద్ర కమిటీ ఎన్నికల కమిషన్‌ను కోరింది.

వ్యవసాయ మార్కెటింగ్ ఫ్రేమ్‌వర్క్‌పై...

రైతుల ఆందోళన కారణంగా ఉపసంహరించుకున్న మూడు వ్యవసాయ చట్టాలలోని అంశాలను తిరిగి తెర పైకి తెచ్చేందుకు ఈ విధాన ఫ్రేమ్‌వర్క్ ప్రయత్నిస్తోంది. ప్రయివేట్ హోల్‌సేల్ మార్కెట్లను ఏర్పాటు చేయాలని ఇది ప్రతిపాదిస్తోంది. కార్పొరేట్ ప్రాసెసర్లు, ఎగుమతిదారులు నేరుగా వ్యవసాయ క్షేత్రాల నుంచి కొనుగోళ్లు జరిపేందుకు అనుమతిస్తోంది. సంప్రదాయ మార్కెట్ యార్డులు కార్పొరేట్ నియంత్రణలోకి వెళతాయి. రాష్ట్రంలో ఒకే రకమైన మార్కెట్ ఫీజును, ట్రేడింగ్ లైసెన్స్ పద్ధతిని ప్రవేశపెట్టాలని ముసాయిదా ప్రతిపాదించింది. బడా కార్పొరేట్ సంస్థలు ఎపిఎంసి మార్కెట్ యార్డులకు వెళ్లకుండా నేరుగా రైతుల నుంచే ఉత్పత్తులను కొనుగోలు చేసేందుకు ఇది వీలు కల్పిస్తోంది. ముసాయిదా విధానానికి వ్యతిరేకంగా కిసాన్ సభ, సంయుక్త కిసాన్ మోర్చా ప్రారంభించిన ఆందోళనకు కేంద్ర కమిటీ పూర్తి మద్దతు తెలిపింది. ఈ విధానానికి వ్యతిరేకంగా ప్రజలను సమీకరించాలని పార్టీ శాఖలన్నింటికీ పిలుపునిచ్చింది.

ట్రంప్‌తో ముకేశ్ అంబానీ దంపతులు భేటీ

వాషింగ్టన్ డిసి : అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేయడానికి ఒక రోజు ముందు డోనాల్డ్ ట్రంప్‌తో రిలయన్స్ ఇండస్ట్రీస్ ఛైర్మన్ ముకేశ్ అంబానీ దంపతులు భేటీ అయ్యారు. యుఎస్ క్యాపిటల్‌లో జరిగే ట్రంప్ ప్రమాణ స్వీకార కార్యక్రమానికి అంబానీ దంపతులు హాజరుకానున్నారని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు. ట్రంప్ క్యాబినెట్ మంత్రులు, అధికారులు, ఇతర ప్రముఖ అతిథులతో ఈ జంట కూడా వేదికపై ఉంటారని పేర్కొన్నారు. ముకేశ్ అంబానీ, ఆయన భార్య, రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, ఛైర్‌పర్సన్ నీతా అంబాని ఈ నెల 18నే వాషింగ్టన్ చేరుకున్నారు. ఆదివారం ట్రంప్‌తో భేటీ అయ్యారు. ట్రంప్ ప్రమాణ స్వీకారానికి భారత ప్రభుత్వం తరపున కేంద్ర విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ హాజరవుతారు.

మహా కుంభమేళాలో అగ్నిప్రమాదం

ప్రయాగ్‌రాజ్ : ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో మహా కుంభమేళా ప్రాంతం వద్ద ఆదివారం అగ్నిప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో 18 టెంట్లు దగ్ధమయ్యాయని పోలీసులు తెలిపారు. మహా కుంభ్ మేళాలోని సెక్టార్ 19, గీతా ప్రెస్ టెంట్‌లో ఉన్న రెండు గ్యాస్ సిలిండర్లు ఆదివారం సాయంత్రం 4.30 గంటలకు పేలడంతో ఈ అగ్ని ప్రమాదం సంభవించిందని పోలీసులు తెలిపారు. ప్రమాదం సంభవించిన వెంటనే ఆ ప్రాంతంలో ముందస్తు చర్యల్లో భాగంగా మోహరించి ఉన్న అగ్నిమాపక శకటాలు మంటలను అదుపులోకి తీసుకొచ్చాయని అధికారులు తెలిపారు. అగ్రిప్రమాదం స్థలంలో సమీపంలో ఉన్న టెంట్ల నుంచి ప్రజలను ఖాళీ చేయించినట్లు చెప్పారు. 'చాలా విచారకరం. మహాకుంభ్‌లో జరిగిన అగ్ని ప్రమాదం అందర్నీ దిగ్భ్రాంతికి గురిచేసింది. తక్షణమే సహాయ, భద్రతా చర్యలను ప్రారంభించాం. అందరి భద్రత కోసం మేం గంగా మాతను ప్రార్థిస్తున్నాం' అని మహా కుంభమేళా అధికారిక ఎక్స్ ఖాతా పేర్కొంది.

రాహుల్ గాంధీపై మరో ఎఫ్ఐఆర్

గౌహతి : రాహుల్‌గాంధీపై మరో ఎఫ్ఐఆర్ నమోదైంది. అస్సాం రాజధాని గౌహతికి చెందిన మోన్‌జిత్ చాటియా ఫిర్యాదు మేరకు పాన్‌బజార్ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్ఐఆర్ నమోదైంది. ఈ నెల 15న ఢిల్లీలోని కోట్లా రోడ్డులో ఎఐసిసి నూతన ప్రధాన కార్యాలయం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతి సంస్థను స్వాధీనం చేసుకున్నాయి. మేం ఇప్పుడు బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్‌తోపాటు భారత రాజ్యంతో పోరాడుతున్నాం' అని అన్నారు. ఈ వ్యాఖ్యలపై చాటియా ఫిర్యాదు చేశారు.

అమెరికాలో టిక్‌టాక్ సేవలు బంద్

వాషింగ్టన్ : సోషల్‌మీడియా యాప్ టిక్‌టాక్ అమెరికాలో తన సేవలను నిలిపివేసింది. ఈ యాప్‌ను నిషేధించే ఫెడరల్ చట్టం అమల్లోకి రావడానికి ముందే ఈస్టర్న్ స్టాండర్డ్ టైమ్, యాపిల్, గూగుల్ యాప్ స్టోర్‌లలో శనివారం టిక్‌టాక్ మాతృసంస్థ బైట్‌డ్యాన్స్ ప్రకటించింది. "అమెరికాలో టిక్‌టాక్‌ను నిషేధించే చట్టం అమల్లోకి రానున్నందున మీరు ఈ టిక్‌టాక్‌ను ఉపయోగించలేరు" అని వినియోగదారులకు శనివారం సాయంత్రం సందేశాన్ని పంపింది.

ట్రంప్ ప్రమాణ స్వీకారానికి ముందే నిరసన సెగ

- వాషింగ్టన్‌సహా పలు నగరాలలో ఆందోళనలు
- 'ట్రాన్స్ లివ్స్ మ్యాటర్', 'స్టాండప్... ఫైట్ బ్యాక్', ట్రస్ట్ బ్లాక్ ఉమెన్', 'ఉయ్ కాంట్ బి సైలెంట్' అంటూ నినాదాలు

వాషింగ్టన్‌లో భారీ నిరసన ప్రదర్శన

వాషింగ్టన్ : అమెరికా 47వ అధ్యక్షుడుగా డోనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపడుతున్న తరుణంలో వాషింగ్టన్ నగరం నిరసనలతో హోరెత్తింది. ట్రంప్ విధానాలను నిరసిస్తూ వేలాది మంది ప్రజలు భారీ ప్రదర్శన నిర్వహించారు. 'ట్రాన్స్ లివ్స్ మ్యాటర్', 'స్టాండప్... ఫైట్ బ్యాక్', ట్రస్ట్ బ్లాక్ ఉమెన్', 'ఉయ్ కాంట్ బీ సైలెంట్' అంటూ వారంతా నినాదాలు చేశారు. 'సఖి ఫర్ సౌత్ ఆసియా సర్వైవర్స్' సహా పలు స్వచ్ఛంద సంస్థలు పీపుల్స్ మార్చ్ పేరిట నిరసన చేపట్టాయి. పీపుల్స్ మార్చ్‌ని గతంలో ఉమెన్స్ మార్చ్ అని పిలిచే వారు. 2017 నుంచి ప్రతి సంవత్సరం ఇది జరుగుతోంది. ట్రంప్ వ్యతిరేక పోస్టర్లు, బ్యానర్లను ప్రదర్శించిన నిరసనకారులు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. టెస్లా యజమాని ఎలన్ మస్క్ సహా ట్రంప్ సన్నిహిత మద్దతుదారులను కూడా వారు వదిలిపెట్టలేదు. 2017 జనవరిలో ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం చేసినప్పుడు సైతం వీరు ఇదే రకంగా నిరసన ప్రదర్శన నిర్వహించారు.

నగరంలోని మూడు వేర్వేరు పార్కుల నుంచి ప్రారంభమైన నిరసన ప్రదర్శనలు లింకన్ మెమోరియల్ సమీపాన కలిసిపోయాయి. 'ఫాసిజానికి తలవంచబోమని సమాజానికి చాటిచెప్పేందుకే భారీ ప్రదర్శన చేపట్టాం' అని పీపుల్స్ మార్చ్ తెలిపింది. ప్రమాణస్వీకారానికి ముందు అనేక కార్యక్రమాలకు హాజరయ్యేందుకు ట్రంప్ ఇప్పటికే వాషింగ్టన్ చేరుకున్నారు. అదే సమయంలో నిరసన ప్రదర్శనలు జరగడం గమనార్హం. అబార్షన్ యాక్షన్ నౌ, టైమ్ టూ యాక్ట్, సిస్టర్‌సాంగ్, ఉమెన్స్ మార్చ్, పాప్యులర్ డెమొక్రసీ ఇన్ యాక్షన్, హ్యారియట్స్ వైల్డెస్ట్ డ్రీమ్స్, ది ఫెమినిస్ట్ ఫ్రంట్, నౌ, ప్లాన్డ్ పేరెంట్‌హుడ్, ది నేషనల్ ఉమెన్స్ లా సెంటర్ యాక్షన్ ఫండ్, సియర్రా క్లబ్, ఫ్రంట్‌లైన్ వంటి స్వచ్ఛంద సంస్థలు ఈ ప్రదర్శనలో భాగస్వాములయ్యాయి. న్యూయార్క్, సియాటెల్, చికాగో వంటి ఇతర నగరాలలోనూ నిరసన ప్రదర్శనలు జరిగాయి. మహిళలు, సమానత్వం, ఇమ్మిగ్రేషన్ కు మద్దతుగా వచ్చామని బ్రిట్టానీ మార్టినెస్ అనే యువతి చెప్పారు. ట్రంప్ విధానాలు, విలువలపై నిరసనకారులు మండిపడ్డారు.

ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల బరిలో 719 మంది అభ్యర్థులు

- కేజ్రీవాల్ స్థానంలో అత్యధికంగా పోటీ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలోని 70 అసెంబ్లీ స్థానాలకు 719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. మొత్తం 1,040 నామినేషన్లు దాఖలయ్యాయి. ఉప సంహరణల తరువాత 981 నామినేషన్లను ఎన్నికల అధికారులు పరిశీలించి, 477 తిరస్కరించారు. 719 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నట్లు ప్రకటించారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రుల కుమారులైన బిజెపికి చెందిన పర్వేష్ వర్మ (సాహిబ్ సింగ్ వర్మ కుమారుడు), కాంగ్రెస్‌కు చెందిన సందీప్ దీక్షిత్ (షీలా దీక్షిత్ కుమారుడు) న్యూఢిల్లీ స్థానంలో కేజ్రీవాల్‌తో తలబడుతున్నారు. ఈస్థానం నుంచి అత్యధికంగా 29 మంది అభ్యర్థులు 40 నామినేషన్లు దాఖలు చేశారు. చివరకు 23 మంది పోటీలో నిలిచారు. పటేల్ నగర్, కస్తూర్బా నగర్ స్థానాల్లో అత్యల్పంగా ఐదుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఫిబ్రవరి 5న ఢిల్లీలో ఒకే దశలో పోలింగ్ జరగనున్నది. ఫిబ్రవరి 8న కౌంటింగ్ నిర్వహించి ఫలితాలు ప్రకటిస్తారు.

కేజ్రీవాల్‌ను చంపేయాలనుకుంటున్నారు : అతిషి

కేజ్రీవాల్‌ను ఎన్నికల్లో ఓడించలేని బిజెపి ఆయనను చంపేయాలని అనుకుంటోందని ఢిల్లీ ముఖ్యమంత్రి అతిషి ఆరోపించారు. న్యూఢిల్లీ నియోజకవర్గంలో ప్రచారంలో పాల్గొన్న కేజ్రీవాల్ కారుపై శనివారం రాళ్లదాడి జరిగిన నేపథ్యంలో ఎంపి సంజయ్ సింగ్‌తో కలిసి అతిషి ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేజ్రీవాల్‌పై దాడి చేసి, కారుపై రాళ్లు విసిరిన వ్యక్తులు తీవ్రమైన నేరస్థులు. వారిపై దోపిడి, హత్యాయత్నంతో ఇప్పటికే కేసులు నమోదై ఉన్నాయి' అని తెలిపారు. కేజ్రీవాల్‌పై దాడిలో పాల్గొన్న రాహుల్ అలియాస్ షంకీ పర్వేష్ వర్మకు 'అత్యంత సన్నిహితుడు' అని చెప్పారు.

ట్రంప్ పాలన పట్ల ఇయులో భయాందోళనలు!

- పలు దేశాల్లో మిశ్రమ ప్రతిస్పందనలు

బ్రస్సెల్స్ : అమెరికాలో ట్రంప్ అధికారం చేపట్టడం పట్ల యూరోపియన్ యూనియన్ సభ్య దేశాలు కొన్ని పెదవి విరిచాయని, మిగతా దేశాల్లో కూడా మిశ్రమ ప్రతిస్పందనలు వ్యక్తమవుతున్నాయని ఇటీవల నిర్వహించిన ఓ సర్వేలో వెల్లడైంది. ట్రంప్ వచ్చిన తర్వాత కేవలం అమెరికాకే మంచి జరగడం కాకుండా ఉక్రెయిన్‌లో, మధ్య ప్రాచ్యంలో శాంతి నెలకొనడానికి దోహదపడవచ్చని మరికొందరు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. తన స్వప్రయోజనాలు నెరవేర్చుకునే దిశగా 'అమెరికా ఫస్ట్' అన్న ట్రంప్ నినాదం యూరప్‌ను తీవ్రంగా భయపెడుతోంది. ఇయు వ్యాప్తంగా 22శాతం మంది అమెరికాను మిత్రపక్షంగా భావిస్తుండగా, 51శాతం మంది అవసరమైన భాగస్వామిగా పేర్కొంటున్నాయి. తొమ్మిది శాతం మంది ప్రత్యర్థిగా పేర్కొంటుండగా, మూడు శాతం మంది ప్రతికూల శక్తిగా భావిస్తున్నాయి. ప్రపంచవ్యాప్తంగా 24 దేశాల్లో 28,549మందిపై విదేశీ సంబంధాలపై యురోపియన్ కౌన్సిల్ (ఇసిఎఫ్ఆర్), ఆక్స్‌ఫర్డ్ యూనివర్శిటీలు సంయుక్తంగా ఈ సర్వే నిర్వహించాయి. . ట్రంప్ రెండో సారి అధికార పగ్గాలు చేపట్టనుండడం పట్ల భారత్‌లో మోడీ ప్రభుత్వం సంతోషంగా వుంది. ఇక అమెరికా మిత్రపక్షాలైన బ్రిటన్, కొరియా రిపబ్లిక్, ఇయు సభ్య దేశాల్లోని ప్రజలైతే ట్రంప్ పాలన పట్ల అనేక సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. యురోపియన్ మిత్రపక్షాలే ఎక్కువ నిరాశావాదాన్ని ప్రకటించా యి. రాబోయే ట్రంప్ ప్రభుత్వం వల్ల అమెరికన్లకు ఎదురుదెబ్బ తగులుతుందని, అంతర్జాతీయ ఘర్షణల పరిష్కారానికి కూడా విఘాతమేర్పడవచ్చని పలువురు పేర్కొన్నారు. ఇక రిపబ్లిక్ ఆఫ్ కొరియాలో అయితే ట్రంప్ పట్ల ఇయు కన్నా ఎక్కువ వ్యతిరేకత నెలకొంది. ముఖ్యంగా ప్రపంచవ్యాప్తంగా ఒక మోస్తరు దేశాలన్నీ ప్రపంచ పోలీస్‌గా అమెరికాను ఇంకెంత మాత్రమూ అనుమతించేది లేదని చెబుతున్నాయి. ఇయులోనే మరో సెక్షన్ ట్రంప్‌ను స్వాగతిస్తోంది.

ప్రభుత్వ పాలసీల్లో 'ప్రపంచబ్యాంకు'

(మొదటిపేజీ తరవాయి)

ప్రజలపై ట్రూఅప్, ఎఫ్‌పిపిఎస్‌ఎ పేరుతో వేస్తున్నారు. గత 10 సంవత్సరాల కాలంలో విద్యుత్ ప్లాంట్లకు రాష్ట్ర వ్యాప్తంగా 1.20 లక్షల ఎకరాలు కట్టబెట్టారు. వాటిని తీసుకున్న వారు మాత్రం తాకట్టు పెట్టి కోట్ల రూపాయలు రుణాలు తీసుకుంటున్నారు.

ఇక నీటి అవసరాలు తీర్చే పేరుతో తొలిసారిగా జలవనరుల ప్రాజెక్టుల్లో ప్రైవేటు పెట్టుబడులను ఆహ్వానించినట్లు వాటర్ పాలసీలో పేర్కొన్నారు. నీటి రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేయనున్నారు. ఇప్పుడు విద్యుత్‌లాగే ఇక నీటికి కూడా వినియోగ ఖర్చు ప్రాతిపదికగా డబ్బు వసూలు చేస్తారు. చంద్రబాబునాయుడు తొలిసారి సంస్కరణలు అమలు చేసిన సమయంలో విద్యుత్‌తోపాటు నీటిని కూడా వినియోగ వస్తువుగా మార్చాలనేది కీలకాంశంగా పేర్కొన్నారు. 2008లోనే అన్ని పట్టణ ప్రాంతాల్లో మీటర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని తీర్మానాలు చేయించారు. దాని ఫలితంగా పట్టణ ప్రాంతాల్లో నీటి మీటర్లు బిగించారు. వీటి నిర్వహణ పేరుతో రెగ్యులేటరీ కమిషన్ ఏర్పాటు చేసి నీటి వ్యాపారాన్ని స్థిరీకరించనున్నారు. అంటే ప్రైవేటు వ్యక్తులు కట్టే ప్రాజెక్టులు రైతుల కోసమా వ్యాపారం కోసమా అనేది ఇట్టే అర్థం చేసుకోవచ్చు.

ఫుడ్ ప్రాసెసింగ్ పేరుతో నీటిని తక్కువగా వినియోగించే హార్టికల్చర్ సాగును ప్రోత్సహించాలని మరో పాలసీని తీసుకొచ్చారు. ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్ షరతులు అమలు చేసిన శ్రీలంక, బంగ్లాదేశ్ ఆహార సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలనేది అందులో కీలక షరతు. అలాగే ఆహార ఉత్పత్తులు తగ్గించి ప్రాసెసింగ్‌కు అవసరమైన పంటలు పండించడం షరతుల్లో కీలకమైంది. ఇప్పుడు ఈ షరతునే పాలసీ రూపంలో ముందుకు తీసుకొచ్చారు. దీనివల్ల ఆహార ఉత్పత్తులు తగ్గి ఆహార సంక్షోభం ఏర్పడటం, అది ఆర్థిక సంక్షోభాన్ని సృష్టించడం అర్జెంటైనాతోపాటు అనేక దేశాల్లో ఎదుర్కొన్న ప్రధాన సమస్య. 2017లో తీసుకొచ్చిన ఆధునిక యాంత్రీకరణ విధానం కూడా ప్రపంచబ్యాంకు షరతుల్లో భాగమే. చిన్న కమతాలను తగ్గించి కార్పొరేట్ వ్యవసాయం చేయడం కోసం ఈ షరతును బలవంతంగా రుద్దింది. అభివృద్ధి చెందిన దేశాల్లో అమలవుతున్న ఈ పద్ధతి మనలాంటి అభివృద్ధి చెందుతున్న దేశాల్లో అదీ చిన్న కమతాలున్న చోట సాధ్యం కాదు. చిన్న కమతాలను తగ్గించడమంటే రైతులను, వాటిపై ఆధారపడి బతుకుతున్న వారికీ ఉపాధి లేకుండా చేసి బయటకు తరిమి వేయడమే !

ఇంటికొక్కరు ఎంటర్‌ప్రెన్యూర్ కావాలని కొత్త పల్లవి. ఒకవైపు పెద్దపెద్ద కంపెనీలతో ఉపాధి వస్తుందని చెబుతూనే మరోవైపు ఎవరికివారే ఎంటర్‌ప్రెన్యూర్ అనడం అర్థం కాని విషయంగా మారింది. భవిష్యత్‌లో ఉద్యోగాలు ఎవరికివారే చూసుకోవాలనే విధంగా చెబుతున్నారు. 2006లో కేంద్రం ప్రపంచబ్యాంకు నిధులతో తీసుకొచ్చిన జవహర్‌లాల్ నెహ్రూ నేషనల్ అర్బన్ రెన్యువల్ మిషన్(జెఎన్‌ఎన్‌యుఆర్‌ఎం) పథకం అప్పట్లో నిధులిచ్చే సమయంలో అర్బన్ రిఫార్మ్స్(పట్టణ సంస్కరణలు) తీసుకొచ్చింది. దీనిలో కీలకమైంది. ప్రతిపనికీ యూజర్‌ఛార్జీ వసూలు చేయడం, ప్రతిసేవకూ లెక్కగట్టి ఛార్జీలు వసూలు చేయడం. అందులో భాగంగానే యూజర్ ఛార్జీలు, ఆస్తివిలువ ఆధారిత పన్నులు, వీధిలైట్ల నిర్వహణ ప్రైవేటీకరణ, శానిటేషన్ ఖర్చులు వసూలు చేయడం, తాగునీటికి ఛార్జీలు, డిఅండ్ఓ ట్రేడ్ లైసెన్సులు పెంచడం, కాలనీ అసోసియేషన్లు ఇవన్నీ కూడా సంస్కరణల్లో భాగమే వాటినే ఇప్పుడు కొత్తగా అమలుకు సిద్ధమయ్యారు. ప్రభుత్వం పూర్తిగా తన బాధ్యతల నుండి తప్పుకుని ప్రజలే పాలించుకుని, వారే పన్నులు విధించుకుని వారే నిర్వహించుకునే విధంగా షరతులు పెట్టింది. వాటిని ఇప్పుడు అన్ని పాలసీల్లో అమలు చేస్తున్నారు.

మారిటైం పాలసీ పేరుతో సముద్రతీరం మొత్తం ప్రైవేటు వ్యక్తులకు అప్పగించే విధానాలు రూపొందిస్తున్నారు. ఇప్పటికే పోర్టులు, తీర ప్రాంత రోడ్లు అదానీ చేతుల్లోకి వెళ్లిపోయాయి. ఇక మారిటైం పాలసీ అమలు చేస్తే రాష్ట్రానికి మిగిలేదేమీ లేకపోగా పోర్టులు తీసుకున్నవారి వస్తువులు రవాణా చేసేందుకు సదుపాయాలకు అవసరమైన రాయితీలు కల్పించేందుకు మాత్రమే ఆ పాలసీ ఉపయోగపడే విధంగా ఉంది. లాజిస్టిక్స్ పార్కులు కూడా వీటికి అనుబంధంగానే ఏర్పాటు చేస్తున్నారు. మొత్తంగా రాష్ట్ర ప్రజలకు ప్రభుత్వం చేసేదేమీ కనిపించకపోగా పాలసీల పేరుతో ప్రజల ముక్కుపిండి వసూలు చేయడం, ఉన్న వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టడం అనేది సుస్పష్టంగా కనిపిస్తోంది.

వైద్య సేవలు పొందుతున్న దల్లేవాల్

రైతులతో 14న చర్చలకు ఓకే

- కేంద్రం ప్రకటనతో వైద్య సాయం పొందుతున్న దల్లేవాల్
- 121 మంది రైతుల దీక్షల విరమణ
- ఎంఎస్‌పిపై చట్టబద్ధత కల్పించడం సహా వివిధ డిమాండ్లు

న్యూఢిల్లీ : డిమాండ్ల సాధన కోసం ఆందోళన సాగిస్తున్న పంజాబ్ అన్నదాతలలో చర్చలు జరుపుతామని కేంద్రం ప్రకటించింది. దీంతో నిరవధిక దీక్ష చేస్తున్న 70 ఏళ్ల రైతు నాయకుడు జగ్జిత్ సింగ్ దల్లేవాల్ వైద్య సాయం పొందేందుకు అంగీకరించారు. పంటల కనీస మద్దతు ధరలకు (ఎంఎస్‌పీ) చట్టబద్ధత కల్పించేంత వరకూ నిరవధిక దీక్ష కొనసాగుతుందని ఆయన స్పష్టం చేశారు. పంజాబ్‌లో నిరసన తెలుపుతున్న రైతులతో ఫిబ్రవరి 14న చండీగఢ్‌లో చర్చలు జరుపుతామని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. అంతకుముందు సంయుక్త కార్యదర్శి ప్రియరంజన్ నేతృత్వంలో కేంద్ర వ్యవసాయ మంత్రిత్వశాఖకు చెందిన అధికారుల ప్రతినిధి బృందం దల్లేవాల్‌తో శనివారం సమావేశమైంది. సంయుక్త కిసాన్ మోర్చా, కిసాన్ మజ్దూర్ మోర్చాకు చెందిన ప్రతినిధులతో కూడా అధికారులు సమావేశమయ్యారు. వైద్య సాయం పొందితే ఆరోగ్యం కుదుటపడు తుందని, అప్పుడు ప్రతిపాదిత సమావేశంలో పాల్గొనవచ్చునని దల్లేవాల్‌కు అధికారులు నచ్చచెప్పారు. అందుకు దల్లేవాల్ అంగీకరించారు. దల్లేవాల్‌కు సెలైన్ ఎక్కించి వైద్య సాయం అందిస్తున్న చిత్రాలను రైతులు విడుదల చేశారు. ఈ నేపథ్యంలో డిమాండ్లు నెరవేర్చాలని, చర్చలు జరపాలని కోరుతూ దల్లేవాల్‌కు మద్దతుగా నిరవధిక నిరాహార దీక్షలు చేస్తున్న 121 మంది రైతులు కూడా ఆదివారం దీక్షలు విరమించారు. ప్రతిపాదిత సమావేశం చండీగఢ్‌లోని మహాత్మాగాంధీ స్టేట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఫిబ్రవరి 14వ తేదీ సాయంత్రం ఐదు గంటలకు జరుగుతుంది. రైతులు నిరసన తెలుపుతున్న కన్నౌరిలో వ్యవసాయ శాఖ సంయుక్త కార్యదర్శి ప్రియ రంజన్ విలేకరులతో మాట్లాడుతూ క్షీణిస్తున్న దల్లేవాల్ ఆరోగ్య పరిస్థితిని దృష్టిలో పెట్టుకొని కేంద్రం ఉన్నత స్థాయి ప్రతినిధి బృందాన్ని పంపిందని చెప్పారు. చర్చలకు ఆహ్వానిస్తూ దల్లేవాల్, రైతు సంఘాలకు ఆయన లేఖలు కూడా రాశారు. ప్రతిపాదిత సమావేశంలో రైతులతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు చర్చలు జరుపుతారని ఆయన తెలిపారు.

రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకం

- మన్‌కీ బాత్‌లో ప్రధాని మోడీ

ప్రజాశక్తి–న్యూఢిల్లీ బ్యూరో

ఈసారి రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనదని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. ఆదివారం మన్‌కీ బాత్ 118వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడారు. దేశ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 ఏళ్లు పూర్తవుతున్న సందర్భంగా ఈ రిపబ్లిక్ డే చాలా ప్రత్యేకమైనదని పేర్కొన్నారు. రాజ్యాంగాన్ని మనకు అందించిన రాజ్యాంగ పరిషత్‌లోని గొప్ప వ్యక్తులందరికీ తలవంచి నమస్కరిస్తున్నా నని అన్నారు. ఎన్నికల సంఘం ఎన్నికల ప్రక్రియను ఎప్పటికప్పుడు ఆధునీకరించి, పటిష్టం చేస్తోందని పేర్కొన్నారు. సాంకేతికతను ఉపయోగించి నిష్పక్షపాతంగా పోలింగ్ ప్రక్రియ నిర్వహిస్తోందని అన్నారు. యువత స్టార్టప్ సంస్థల వైపు ఆకర్షితులవుతున్నారని, దీనివల్ల స్టార్టప్ ఇండియా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. సమాజంలోని పరిస్థితులు మారుతున్నాయని, దేశం డిజిటల్ యుగంలోకి ప్రవేశిస్తోందన్నారు. దేశాభివృద్ధిలో మహిళలు కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లో జరుగుతున్న మహాకుంభమేళా భిన్నత్వంలో ఏకత్వానికి ప్రతీక అని అన్నారు. ఈ కార్యక్రమం అన్ని ప్రాంతాల, వర్గాల ప్రజలను ఒక్కతాటిపైకి తీసుకొచ్చిందని చెప్పారు.

తగిన శిక్ష వేయండి : సంజయ్ రాయ్ తల్లి

కొల్‌కతా : తన కుమారుడికి కోర్టు తగిన శిక్ష విధించాలని, అది ఉరి అయినా సరే... అని సంజయ్ రాయ్ తల్లి మాలతీరాయ్ అన్నారు. కొల్‌కతా ఆర్‌జి కర్ ఆసుపత్రిలో గత ఏడాది ఆగస్టు 9వ తేదీ రాత్రి జరిగిన మెడికో (31)పై అత్యాచారం, హత్య కేసులో సివిక్ పోలీస్ వాలంటీర్ సంజయ్‌రాయ్‌ని దోషిగా నిర్ధారిస్తూ సిల్దా కోర్టు శనివారం తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. శంభునాథ్ పండిట్ వీధిలో గుడిసెలో 70 ఏళ్ల మాలతీరాయ్ నివసిస్తున్నారు. తనను కలిసిన మీడియాతో ఆమె మాట్లాడుతూ ముగ్గురు కుమార్తెల తల్లిగా బాధితురాలి తల్లి ఆవేదన, బాధ తనకు తెలుసునని అన్నారు. ట్రైనీ వైద్యురాలు కూడా తన కుమార్తెలాంటిదేనని చెప్పారు. సంజయ్ నేరం రుజువైనందున కోర్టు అతనికి తగిన శిక్ష వేయాలని, ఉరితీయాలని నిర్ణయించినా సరే... అభ్యంతరం లేదని అన్నారు. తల్లిగా ఒంటరిగా ఏడుస్తానని, కానీ, తలరాతను అంగీకరించాల్సిందేనని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కేసుపై సుప్రీంకోర్టుకు వెళ్లే ఉద్దేశం లేదని మీడియా ప్రశ్నకు సమాధానంగా సంజయ్ సోదరి తెలిపారు. నేరం జరిగిన ప్రాంతంలో సంజయ్‌తోపాటు మరికొంతమంది ఉన్నట్లు కథనాలు వస్తున్నాయని, పోలీసులు, సిబిఐ పూర్తిస్థాయిలో దర్యాప్తు చేసి, తగిన శిక్ష విధించాలని కోరారు.

మీ కోసం

అరకప్ప నిమ్మరసంలో కాస్త అల్లం రసం కలుపుకొని తాగితే దగ్గు నుండి ఉపశమనం కలుగుతుంది. ఇలా రోజుకి రెండు మూడుసార్లు తాగితే ఫలితం ఉంటుంది.

జీవన సౌరభం

ప్రతి చిన్న అవాంతరానికీ సంకల్పాన్ని మార్చుకునేవారు లక్ష్యానికి దూరమవుతారు. అంతరాయాలు కలిగేకొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి.

ఒక చెట్టు కథ

మొక్క నుంచి పెరిగి చెట్టైంది
చిగురు తొడిగి కాయనిచ్చింది
కాయ పండి విత్తనం రాల్చింది
విత్తనం చిగురెత్తి వృక్షమైంది

మొదటి దశ నుంచే పెరుగుతూ
ఏపెత్తు ఎదిగి తలెత్తి
నిలుచుంది
బాటసారికి అలుపు తీర్చింది
ప్రాణవాయువిచ్చి బ్రతికించింది

రుతువుకు చేయూతనిచ్చింది
ప్రకృతికి అందాన్ని ఇచ్చింది
పచ్చదనాన్ని లోకానికి పంచింది
పచ్చని జీవితాలకి మూలమైంది

ఆరోగ్యానికి ఆయువు పోసింది
మనిషి మనుగడకు ఊతమైంది
జీవులన్నింటికీ తోడై నిలిచింది
గూడును ఇస్తూ జీవితమైంది

వర్షంతో చెలిమి చేసి పిలిచింది
పంటలకు మూలాధారమైంది
కాయను పంచి ఆకలి తీర్చింది
కొమ్మ కొమ్మ ఊయలై ఊగింది

పచ్చని చెట్టు పైన ఎర్రని
కన్నుకు
చెప్పరాని కోపం పుట్టుకొచ్చింది
స్వార్థం నిండిన మనిషి మనసు
చెట్టు మూలాన్ని పెకిలించింది

నిప్పులు చెరిగిన కొడవలి కోత
ఒక చెట్టు గొంతుకు
బిగుసుకుంది
విరిగిన చెట్టును చూసి నవ్వింది
ఆ నవ్వు కొంత కాలమే
నిలిచింది

మొక్క ఎంతో విలవిలలాడింది
చెట్టమ్మ కన్నీరు పెట్టుకుంది
ఆకులు రాల్చి అంగలార్చింది
మోడుగా మారి విలపించింది

సూర్య కిరణం నిటారుగా వచ్చి
నెత్తిన ఎండతో మండించింది
భూమి అగ్నిగుండమై కాలింది
వర్షాభావంతో సంకటమైంది

పంట చేను కన్నీరు పెట్టుకుంది
చెట్టు లేక నేలతల్లి ఏడ్చింది

కరుణ లేని మనిషి కోతకు గురై
చెట్టు చేవ కనుమరుగైంది

దిక్కుతెలియని మనిషి జీవనం
అతలాకుతలమై అంగలార్చింది
నీరు లేక చెరువు
ఎండిపోయింది
బీడు భూమితో అన్నం
కరువైంది

కొత్త కొత్త రోగాల పుట్ట
పగిలింది
ప్రాణ వాయువు
కరువైపోయింది
జీవనం సాగడమే బరువైంది
మనిషి బ్రతుకే ప్రశ్నార్థకమైంది

చెట్టు విలువ తెలిసి వచ్చినాక
మనిషికి జ్ఞానోదయం అయింది
సాగిలపడి చెట్టును మొక్కాడు
చెట్టును ఆలింగనం
చేసుకున్నాడు

– నరెద్దుల రాజారెడ్డి,
96660 16636.

'ఎ'తో మొదలయ్యే పదాలు గుర్తించండి

పిల్లలూ, ఇక్కడ కనిపిస్తున్న బాక్సులో ఆంగ్ల అక్షరం 'ఎ'తో మొదలయ్యే పదాలు ఉన్నాయి. క్లూ ఆధారంగా వాటిని గుర్తించండి చూద్దాం.

A	T	G	T	O	I	T	H	O	L	A	A	N	P
U	A	C	T	L	O	E	S	R	T	R	E	T	A
T	D	N	O	A	R	O	U	N	D	I	O	N	U
O	U	A	B	U	A	M	B	I	R	T	A	E	T
M	L	T	B	N	I	N	M	G	O	H	D	I	O
O	T	U	A	N	D	A	A	O	H	E	M	C	M
T	T	E	N	A	T	O	M	O	T	M	I	N	O
I	P	A	N	G	R	Y	T	R	U	I	S	A	B
V	X	I	D	N	E	P	P	P	A	T	S	M	I
E	A	R	T	I	S	T	I	C	A	I	I	A	L
A	B	O	U	T	P	P	I	I	S	C	O	Z	E
E	T	A	I	R	P	O	R	P	P	A	N	I	U
A	L	L	M	O	S	T	N	O	U	U	T	N	A
D	I	A	P	P	E	A	R	I	I	D	O	G	H

APPEAR
ALLMOST
ARITHEMITIC
APPPENDIX
ANGRY
ABOUT
AMAZING
ABBOTT
ATOM
AROUND
AUTOMOBILE
ADULT
APPROPRIATE
ADMISSION
ARTISTIC
AUTOMOTIVE
AUTHOR
ANNUAL
AMBUSH
ANCIENT

అభినవ శ్రీకృష్ణదేవరాయలు

మాటలో మాధుర్యం..వాచకంలో స్పష్టత..భావ వ్యక్తీకరణలో సరికొత్తదనం..నటనలో వైవిధ్యం...డైలాగ్‌ల డెలివరీలో గాంభీర్యం...మనిషి నిలువెత్తులో నటనాకౌశలం..ఏ పాత్రలోనైనా జీవించేతత్వం..ఓవరాల్‌లో రంగస్థలంపై ఓ నిలువెత్తు విగ్రహంగా హావభావాలను పలికించే వ్యక్తే కోనేటి సుబ్బరాజు. అభినవ శ్రీకష్ణదేవరాయులు పాత్రలో రాజసం. రాముడి పాత్రలో హూందాతనం..లక్ష్మణుడి పాత్రలో వినయం..విశ్వామిత్రుడు పాత్రలో గభీరం ...సాయిబాబా పాత్రలో ప్రేమ కరుణ... ఇలా ఏ పాత్రను ఎంచుకున్నా అందులో జీవించేలా నటిస్తున్నారు. నాలుగు దశాబ్ధాలుగా నాటకరంగంలో అపారమైన అనుభవం గడించి నటనతో అలరిస్తూ, నాటక పోటీలకు గుణ నిర్ణేతగా వ్యవహరిస్తూ అద్భుతాలను సష్టిస్తున్నారు.

నాటక రంగ కళలో...మేటిగా

నాటక రంగ కళను కాపాడేందుకు...తెలుగు నాటక రంగం తెరమరుగు కాకుండా ఎందరో కళాకారులు, కళా సంస్థలు నిరంతరం కషిచేస్తున్నాయి. సినిమా, టీవీల ప్రభావంతో మసకభారుతున్న వేళ నాటక సమాజాలను ఆదరించేవారు లేక, ఆర్థిక వనరులు లేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో నాటక కళను కాపాడేందుకు అనేక మంది కృషిచేస్తున్నారు. అలాంటి వారిలో 'నేనున్నా..' నంటూ ముందువరసలో ఉంటున్నారు కళా తపస్వి కోనేటి సుబ్బరాజు. కళ కళ కోసం కాదని సమాజోద్ధరణకు దోహదం చేస్తుందని నమ్మి దానిని ఆచరిస్తున్నారాయన. నచ్చిన, మెచ్చిన కళ కోసం వత్తిగా ఉద్యోగాన్ని కొనసాగిస్తూనే ప్రవత్తిగా నాటక రంగ కళను ఎంచుకుని అందులో దూసుకుపోతున్నారు.

అన్నమయ్య జిల్లా రాజంపేట మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన రైతుకుటుంబం కె.సుబ్బరాజు, సుబ్బమ్మ దంపతులకు సుబ్బరాజు జన్మించారు. ఎంఎను పూర్తిచేశారు. వీధి నాటకాలు ప్రదర్శనలో దిట్ట అయిన తన తండ్రి సుబ్బరాజు నుంచి నటనలో వచ్చిన వారసత్వంగా భారీ నాటకాలను ప్రదర్శిస్తూ వస్తున్నారు. 1974లో బాలనటుడిగా ప్రాథమిక విద్య దశలోనూ పలు లఘు నాటికల్లో నటించి మెప్పించారు. ఉన్నతవిద్యలోనూ ఇదే ఒరవడి కొనసాగించారు. 1980 నుంచి నటుడిగా గుర్తింపుపొందారు. ఏ ప్రదర్శనైనా భారీ తారాగణంతో భారీ సెట్టింగ్‌లతో నిరంతరం నాటకాలు ప్రదర్శిస్తూ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మంచి నటుడిగా గుర్తింపు పొందారు. ప్రస్తుతం తిరుమల తిరుపతి దేవస్థానం (టిటిడి) అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. ఓ వైపు ఉద్యోగ ధర్మాన్ని ఆదర్శంగా కొనసాగిస్తూనే ప్రవత్తిగా నాటక రంగ కళాకారుడిగా తన ప్రస్థానాన్ని వైభవంగా కొనసాగిస్తున్నారు. శ్రీనివాసుడు, నారదుడు, భగుమహర్షి, చోళరాజు, ఆకాశరాజు, కుబేరుడు, షిర్డీసాయిబాబా, మహల్సాపతి, ధుర్యోధనుడు, కర్ణుడు, అర్జునుడు, అభిమన్యుడు, శ్రీకష్ణదేవరాయ, లక్ష్మణుడు, విశ్వామిత్రుడు వంటి అనేక పాత్రల్లో నటించి మెప్పిస్తున్నారు. ఏపాత్రలోనైనా పరకాయ ప్రవేశంచేస్తే అందులో జీవిస్తూ ఒదిగిపోవటం ఆయన లక్షణం.

సత్కారాలు

స్వర్ణకంకణ ధారణ, స్వర్ణ కిరీట ధారణ, స్వర్ణాభిషేకం.
పురస్కారాలు

- ప్రప్రథమంగా రాష్ట్ర ప్రభుత్వ బంగారు నంది పురస్కారం
- విశ్వవిఖ్యాత నటసార్వభౌమ ఎన్‌టిఆర్ జీవిత సాఫల్య పురస్కారం
- విశ్వ నట చక్రవర్తి ఎస్‌విఆర్ జీవిత సాఫల్య పురస్కారం
- అందాల విలన్ రాజనాల జీవిత సాఫల్య పురస్కారం
- ఉప్పులూరి రాజారావు కళాపీఠం వారి ' ఉప్పులూరి రాజారావు' పురస్కారం
- కళారాధన నంద్యాల వారి కళాజ్యోతి పురస్కారం
- యువ కళావాహిని (హైదరాబాద్) వారి సురభి వ్యవస్థాపకులు, సురభి వనారస గోవిందరావు పురస్కారం
- అల్లూరి సీతారామరాజు కళాపరిషత్ (కాకినాడ) నటరత్న ఎన్‌టిఆర్ పురస్కారం

కళే శ్వాస, ధ్యాసగా...

'కళ'ను భావితరాలకు అందించటానికి తనవంతుగా పాటుపడుతున్నారు. కళే శ్వాస, ధ్యాస, ఊపిరిగా సమన్వయంతో కషిచేస్తున్నారు. తను ప్రదర్శించే నాటకాల్లో 60 నుంచి 70 మంది కళాకారులకు అవకాశాలు కల్పిస్తున్నారు. నిరంతరం నాటక ప్రదర్శనలకు అవకాశం కల్పిస్తూ కళాసేవకుడు, కళాతపస్వి, అభినవ శ్రీకష్ణ దేవరాయులుగా పేర్గాంచారు. తండ్రికి తగ్గ తనయుడిగా నాటక రంగంలో దూసుకుపోతూ అందరిచేత శబాష్ అనిపించుకుంటున్నారు.

న్యాయనిర్ణేతగా అనుభవం

2000 నుంచి రాష్ట్రవ్యాప్తంగా అనేక పరిషత్తులకు న్యాయనిర్ణేతగా వ్యవహరిస్తూ వస్తున్నారు. సుబ్బరాజు కళాపరిషత్తు నిర్వాహకుడిగా, న్యాయనిర్ణేతగా, నటుడిగా, రచయితగా, దర్శకుడిగా అపార అనుభవాన్ని గడించారు. 2016లో 60వ వజ్రోత్సవ శ్రీ వెంకటేశ్వర నాట్య కళాపరిషత్ గరుడా అవార్డుల కోసం ప్రాథమిక పరిశీలనకు సాంఘిక నాటికలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. రాష్ట్రప్రభుత్వ నంది అవార్డు పోటీలకు మూడుసార్లు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు.

ఘనసత్కారాలు

దేశంలోని ముఖ్యపట్టణాలైన ఢిల్లీ, డెహ్రాడూన్, హైదరాబాద్, కర్నాటక, చెన్నై, ముంబై, భువనేశ్వర్, బరంపూర్, తిరువనంతపురం, పాండిచ్చేరి, మైసూర్‌తో పాటు ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని పలు ముఖ్య నగరాలు, పట్టణాల్లో హైదరాబాద్, శ్రీకాకుళం, విశాఖపట్నం, అత్తిలి, భీమవరం, విజయవాడలతో పాటు పలు సంస్థల ద్వారా ఘన సత్కారాలు అందుకున్నారు.

ఆరు దశాబ్ధాలుగా...

సుబ్బరాజు కళాపరిషత్ 60 వసంతాల కళాపరిషత్ పద్యనాటక, సాంఘిక నాటిక, ఏకపాత్రాభినయం నృత్య పోటీలు దిగ్విజయంగా జరపటంతో పాటుగా ఉభయ రాష్ట్రాల్లోని సీనియర్ నటీమణులు 64 మందికి తిరుపతి మహాకళాక్షేత్రంలో ఘనసత్కారాలు చేయించారు. 62వ వార్షిక కళోత్సవాలు సందర్భంగా 100మంది కళాకారులకు ఏకపాత్రాభినయ పోటీలు నిర్వహించి 100 మందికి సత్కారాలు చేయించారు. 5000 కు పైగా సత్కారాలు 50కి పైగా బిరుదులు అందుకున్న కోనేటి తెలంగాణా మిర్యాలగూడలో ప్రదర్శించిన సింహగర్జన, విశాఖపట్టణంలో ప్రదర్శించిన నాటకాలు బాహుబలుడు పార్ట్ 1, పార్ట్ 2, శ్రీశైలం, శ్రీకాళహస్తి, తిరుపతిలో ప్రదర్శించిన పార్వతీ కళ్యాణం, 70 మంది కళాకారులతో ఢిల్లీలో ప్రదర్శించిన శ్రీనివాసకళ్యాణం ఆయనకు ఎనలేని కీర్తిని తెచ్చిపెట్టాయి.

–యడవల్లి శ్రీనివాసరావు

కళామతల్లి సేవల్లో..

అంతరించిపోతున్న నాటక రంగ కళకు ప్రోత్సాహాన్ని ఇవ్వాలనే లక్ష్యంతో నా వంతుగా నాటిక, నాటక ప్రదర్శనలకు ప్రోత్సాహాన్ని అందిస్తున్నా. టిటిడి ఎఇఒగా నా వృత్తి బాధ్యతలను సమర్ధవంతంగా నిర్వహిస్తూనే ప్రవృత్తిగా ఎంచుకున్న నాటక రంగ కళను బ్రతికించటానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తున్నా. ఔత్సాహిక కళాకారులను ప్రోత్సహించటానికి ప్రాధాన్యత ఇస్తున్నా. ఎందరో కళాకారులకు ఆర్థిక సహాయం చేస్తున్నా, ఇటీవల విజయవాడ వరద భాదితులకు ఆర్థిక సహాయం చేశా.

–కోనేటి సుబ్బరాజు,
రంగస్థల నటులు

వెండితెరపై 'సంక్రాంతి' కళ

ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సంక్రాంతికి టాలీవుడ్‌కు చెందిన పెద్ద హీరోల సినిమాలు సందడి చేస్తుంటాయి. ఈ ఏడాది కూడా అదే ట్రెండ్ కొనసాగినా కొంత మిశ్రమ ఫలితాలొచ్చాయి. గతేడాది పెద్ద హీరోల సినిమాలు చాలా తక్కువగా రావటంతో చిత్రసీమ ఆటుపోట్లను ఎదుర్కొంది. హనుమాన్, గుంటూరుకారం, సైంధవ్ చిత్రాలు విడుదలవ్వగా, హనుమాన్, ఆ తర్వాత గుంటూరు కారం బ్లాక్‌బస్టర్‌గా నిలిచాయి. వేసవి తర్వాత వచ్చిన కల్కి, సెప్టెంబర్‌లో వచ్చిన దేవర బాగా ఆడాయి. ఆఖరులో వచ్చిన 'పుష్ప 2'కు పోటీగా మరే చిత్రమూ పెద్దవి లేవు. బచ్చలమల్లి, నితిన్ రాబిన్‌హుడ్, ప్రియదర్శి సారంగపాణి జాతకం వంటి చిత్రాలు ఉన్నా అవి పెద్దగా ఆదరణకు నోచుకోలేదు. ఈ ఏడాది గేమ్‌ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం సినిమాలు వచ్చినా 'సంక్రాంతికి వస్తున్నాం..' బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఆ తర్వాత స్థానంలో డాకు మహారాజ్, గేమ్‌ఛేంజర్ నిలిచాయి. సరిగ్గా ఆరేళ్ల క్రితం 2019లో ఇదే హీరోలు నటించిన సినిమాలు సంక్రాంతికి రాగా అప్పట్లో కూడా ఇలాంటి ఫలితాలు వచ్చి సీన్ రిపీట్ అయ్యింది.

పెద్ద హీరోల సినిమాలతోనే సందడి

అగ్రతారల సినిమాలు విడుదలయ్యాయంటే...ఒకట్రెండు వారాలపాటు బాక్సాఫీస్ వద్ద హవా కొనసాగుతోంది. ఆ తర్వాత కానీ కొత్త సినిమాలు విడుదలకు ముందుకు రావు. ఏటేటా తెలుగు చిత్రాలకు పోటీగా తమిళ చిత్రాలు కూడా సంక్రాంతికి వచ్చేవి. ఈ ఏడాది అజిత్ సినిమా 'విదాముయర్చి'సినిమా వస్తుందని భావించినా రాలేదు. ఇక మొత్తంగా గేమ్‌ఛేంజర్, డాకు మహారాజ్, సంక్రాంతికి వస్తున్నాం చిత్రాల మధ్య పోటీ నువ్వా నేనా అన్నట్లుగా సాగుతుందని అందరూ భావించారు. కానీ ఫలితాలు భిన్నంగా వచ్చాయి.

కథలు భిన్నం..ప్రేక్షకాదరణ విభిన్నం

ఈ సంక్రాంతికి వచ్చిన మూడు సినిమాల్లో కథపరంగా దేనికదే విభిన్నంగా ఉన్నాయి. 'గేమ్ ఛేంజర్' రాజకీయ కోణాన్ని ఆవిష్కరించే కథ. రామ్‌చరణ్ యువ ఐఎఎస్ అధికారిగా, రాజకీయ నాయకుడిగా కనిపించారు. అయినా ఈ సినిమా రామ్‌చరణ్‌కు ఒకింత నిరాశనే మిగిల్చింది. ఆరేళ్ల క్రితం వచ్చిన 'వినయ విధేయ రామ'లాగా ఈ చిత్రానికి పూర్తి నెగెటివ్ టాక్ ఏమీ రాలేదు. బాక్సాఫీస్ దగ్గర ఈ సినిమా పడుతూ లేస్తూ సాగుతోంది. వసూళ్లు యావరేజ్‌గా ఉన్నాయి. దర్శకుడు శంకర్ దర్శకత్వంలో సుమారు రూ.500 కోట్లు బడ్జెట్‌తో ఈ చిత్రం తెరకెక్కింది. అయితే పూర్తిగా రాజకీయ కోణంలో సాగటంతో ప్రేక్షకులకు పండుగ సీజన్‌లో పెద్దగా ఎక్కలేదు. మొత్తం ఐదు గంటల రన్‌టైంతో తీశామనీ, రెండు గంటలకు కుదించటంతో తనకే సంతృప్తిగా లేదని దర్శకుడు తన తాజా ఇంటర్వ్యూలో ప్రకటించటం గమనార్హం. రామ్‌చరణ్ సరసన కియారా అద్వానీ, మరో పాత్రలో అంజలి నటించి మెప్పించారు. కథలో గందరగోళం ఉండటంతో సీన్లలో అసమతుల్యత పాటించటంతో సగటు ప్రేక్షకులకు నప్పలేదు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్‌రాజు, శిరీష్ సంయుక్తంగా నిర్మించారు. 'జరగండి..', 'రా మచ్చా మచ్చా..', 'ధోప్' వంటి పాటలు బాగానే ఆకట్టుకున్నాయి.

నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బాబీ కొల్లి దర్శకత్వం వచ్చిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'డాకు మహారాజ్' కూడా మిశ్రమ ఫలితాన్నే అందుకుంది. సితార ఎంటర్‌టైన్స్‌మెంట్స్ పతాకంపై సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మించారు. వాల్తేరు వీరయ్య తర్వాత బాబీ నుంచి

వచ్చిన చిత్రం ఇదే. ఆట షురూ అంటూ పక్కా మాస్ యాంగిల్‌తో బాలయ్య ఎంట్రీ ఇచ్చారు. కథ రొటీన్ అయినా తెరకెక్కించటంలో దర్శకుడు కొత్తదనం, ఎఫెక్ట్ కనిపించింది. యాక్షన్ పార్ట్ మొత్తం సగటు తెలుగు, మాస్, కమర్షియల్ సినిమాకు భిన్నంగా హాలీవుడ్ స్లీక్ యాక్షన్‌ను తలపించేలా చేశారు. కృష్ణమూర్తి కుటుంబం, పాప, ఎమ్మెల్యే త్రిమూర్తులు, అతడి తమ్ముడు ఈ మూడు పాత్రలు చుట్టూ తిరిగిన కథ కాస్త నెమ్మదిగా సాగుతాయి. నానాజీగా బాలయ్య ఎంట్రీ బాగుంది. ఫస్టాఫ్ పాప ఎమోషన్‌ని ఎలివేట్ చేయటానికి చాలా సమయం తీసుకున్నారు. మరోవైపు స్పెషలాపీసర్ స్టీఫెన్ (షైన్ టామ్ చాకో) డాకు గురించి చేసే అన్వేషణ డాకూ పాత్రపై ఆసక్తిని పెంచేలా ఉంటుంది. అక్కడ ఫైట్స్ సీక్వెన్స్ తర్వాత వచ్చే దబిడి దిబిడి సాంగ్‌కు తమన్ సంగీతం విపరీతంగా ఇచ్చారు. నీళ్ల అడిగినందుకు ఓ చిన్న పిల్లలను, ఆ ఊరిని తగులబెట్టిన విలన్ గ్యాంగ్ ఇంటికి వెళ్లి ఊచకోత కోసి, నందిని పాత్రధారి శ్రద్ధాతో పలికే సంభాషణల్లో బాలకృష్ణ తరహా ఎమోషన్స్ మిస్సయ్యాయి. పవర్‌ఫుల్ డైలాగులు అంతంతమాత్రమే. కామెడీ పెద్దగా లేనే లేదు.

సీనియర్ నటుడు వెంకటేష్ నటించిన 'సంక్రాంతికి వస్తున్నాం' బ్లాక్‌బ్లస్టర్‌గా నిలిచింది. అనిల్ రావిపూడి దర్శకత్వంలో 8వ సినిమా తెరకెక్కిన ఈ సినిమా ఆద్యంతం థియేటర్లలో నవ్వుల జల్లులను పూయిస్తోంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై దిల్‌రాజు నిర్మించిన చిత్రం ఇది. భీమ్స్ సిసిరోలియో స్వరాలు అందించారు. 'గోదావరి గట్టు..', 'మీను', 'పొంగల్'తోపాటుగా మిగతా పాటలన్నీ బాగానే సాగాయి. ఐశ్వర్యరాజేష్; మీనాక్షిచౌదరీ కథానాయికలుగా ఇద్దరూ పోటీపడి నటించారు. విక్టరీ వెంకటేష్ నటించిన ఎన్నో చిత్రాలు సంక్రాంతికి విడుదలైన బ్లాక్‌బస్టర్లుగా నిలిచాయి. 2019లో ఎఫ్ 2 తర్వాత సంక్రాంతికి వచ్చిన సినిమాలు కూడా ఆడలేదు. ఈ ఏడాది సంక్రాంతికి వస్తున్నాం' పేరుతో మరో బ్లాక్‌బ్లస్టర్ హిట్‌ను అందుకున్నారు. ఇందులో మాజీ పోలీస్ అధికారిగా, బాధ్యతగల భర్తగా, మాజీ ప్రియుడిగా బ్యాలెన్స్ పాత్రలో వెంకటేష్ నటించారు. వెంకీ, మీనుతో ప్రేమ కథ బయటపడ్డాక ఇద్దరితో వేగే సన్నివేశాలు ఆకట్టుకున్నాయి. భాగ్యం పాత్రలో ఐశ్వర్యరాజేష్ జీవించిందనే చెప్పాలి. గోదావరి యాసలో ఆమె భాష సాగుతుంది. ఈ మధ్య నటించిన అన్ని చిత్రాల్లో డీ గ్లామర్‌గా కనిపించిన మీనాక్షిచౌదరి ఇందులోనూ గ్లామర్‌గా మెప్పించారు. నటనలోనూ కథానాయికలు ఇద్దరూ పోటీపడ్డారు. భార్య, మాజీ ప్రియురాలి మధ్య సన్నివేశాల్లో బయటపడటానికి వెంకటేష్ నటన, హావభావాలు రక్తికట్టిస్తాయి. వెంకీ తనయుడిగా నటించిన బాలనటుడు రేవంత్ బుల్లిరాజు పాత్ర సినిమాకు హైలెట్‌గా నిలిచింది. పెద్దల పట్ల అతడు అగౌరవంగా మాట్లాడటం, తిట్లు రూపంగా మాట్లాడినా బాలుడు కావటంతో ఆయా మాటలను ప్రేక్షకులు సీరియస్‌గా తీసుకోలేదనే చెప్పాలి. ఓటీటీ వెబ్‌సిరీస్ వల్లనే మా వాడు ఇలా మాట్లాడుతున్నాడంటూ వెంకటేష్ అనటం బుల్లిరాజు మాటల్లో తీవ్రతను తగ్గించినట్లయ్యింది. ఆద్యంతం కామెడీతో సాగటంతో బ్లాక్‌బ్లస్టర్‌గా ఈ సినిమా నిలిచింది. 2019లో సంక్రాంతికి వెంకటేష్ నటించిన ఎఫ్ 2, రామ్‌చరణ్ నటించిన వినయ విదేయ రామ, బాలకృష్ణ నటించిన ఎన్‌టిఆర్ : కథానాయకుడు సినిమాలు రాగా ఎఫ్2నే విజయం వరించింది.

ఖోఖో జగజ్జేతలు మనమే

- ఫైనల్లో నేపాల్‌పై గెలుపు

న్యూఢిల్లీ: ఖోఖో ప్రపంచకప్ ప్రారంభ సీజన్ టైటిళ్లను భారతజట్లు చేజిక్కించుకున్నాయి. ఇందిరాగాంధీ ఇండోర్ స్టేడియంలో ఆదివారం జరిగిన ఫైనల్లో తొలుత మహిళల జట్టు 78-40పాయింట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేయగా.. ఆ తర్వాత పురుషుల జట్టు కూడా 54-36పాయింట్ల తేడాతో నేపాల్ జట్టునే మట్టి కరిపించి టైటిల్‌ను చేజిక్కించుకొని జగజ్జేతగా నిలిచింది. ప్రియాంక ఇంగ్లే నేతృత్వంలో భారత మహిళలజట్టు ఈ టోర్నీలో అద్భుత ప్రదర్శనతో అదరగొట్టింది. గ్రూప్ దశ నుంచి టైటిల్‌ను చేజిక్కించుకొనేంత వరకు ప్రత్యర్థి జట్లకు ఏ ఒక్క అవకాశాన్ని ఇవ్వలేదు. టాస్ గెలిచిన నేపాల్.. ముందుగా భారత్‌ను అటాక్ రమ్మని ఆహ్వానించింది. ఇది ఆతిథ్య భారత్‌కు వరంగా మారగా, పర్యాటక జట్టు నేపాల్‌కు శాపంగా మారింది. ఆది నుంచి రెచ్చిపోయిన భారత జట్టు నేపాల్‌ను వరుస విరామాల్లో తీవ్ర ఒత్తిడిలోకి నెట్టింది. ఎక్కడా నేపాల్‌కు అవకాశం ఇవ్వకుండా భారత్ తన ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. చివరి వరకు ఇదే ఆటతీరుతో చెలరేగిపోయిన భారత జట్టు.. నేపాల్‌ను మట్టికరిపించి ప్రపంచకప్‌ను ముద్దాడింది. ఫైనల్లో పురుషుల జట్టు తొలుత 26-0పాయింట్లతో భారీ ఆధిక్యతను సంపాదించింది. ఆ తర్వాత రౌండ్-1 ముగిసేసరికి 26-18తో నిలిచిన భారత్ రెండోరౌండ్‌లో 56-18కు చేరింది. ఆ రౌండ్ ముగిసేసరికి భారత్ 54-36పాయింట్లతో భారీ ఆధిక్యతను నమోదు చేసుకొని టైటిల్‌ను హస్తగతం చేసుకుంది.

భారత్ బోణి

- ఐసిసి మహిళల టి20 ప్రపంచకప్

కౌలాలంపూర్: ఐసిసి అండర్-19 మహిళల టి20 ప్రపంచకప్‌లో భారత్ బోణీ కొట్టింది. గ్రూప్-ఎ తొలి లీగ్ మ్యాచ్‌లో వెస్టిండీస్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో భారత్ 9వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. తొలుత బ్యాటింగ్‌కు దిగిన వెస్టిండీస్‌ను భారత బౌలర్లు 13.2 ఓవర్లలో 44 పరుగులకే పరిమితం చేశారు. పరుణిక సిసోడియా మూడు, ఆయుశి శుక్లా, జోషిత్ వీజే తలో రెండు వికెట్లు పడగొట్టారు. ముగ్గురు విండీస్ బ్యాటర్లు రనౌటయ్యారు. విండీస్ ఇన్నింగ్స్‌లో అసాబి ఖలందర్(12), కేనిక కస్సార్(15) మాత్రమే రెండంకెల స్కోర్లు చేయగా.. ఏడుగురు విండీస్ బ్యాటర్లు డకౌటయ్యారు. స్వల్ప లక్ష్యాన్ని భారత్ 4.2ఓవర్లలో వికెట్ మాత్రమే కోల్పోయి ఛేదించింది. ఓపెనర్ గొంగడి త్రిష(4) పరుగులు చేసి ఔట్ కాగా.. కమలిని(16), సనికా ఛల్కే(18) భారత్‌ను విజయతీరాలకు చేర్చారు.

మరో గ్రూప్-ఏలో లీగ్ మ్యాచ్‌లో మలేషియాపై 139 పరుగుల భారీ తేడాతో శ్రీలంక ఘన విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన శ్రీలంక నిర్ణీత 20 ఓవర్లలో 6వికెట్ల నష్టానికి 162 పరుగులు చేసింది. లంక బ్యాటర్లలో దహామి సనేత్మ (55) అర్ధ సెంచరీతో రాణించింది. 163 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన మలేసియా 23 పరుగులకే ఆలౌటైంది. మలేషియా ఇన్నింగ్స్‌లో ఒక్కరు కూడా రెండంకెల స్కోర్ చేయలేకపోయారు. లంక బౌలర్లలో చమోది ప్రబోద(3/5) బౌలింగ్‌లో రాణించింది. భారత్ జనవరి 21న మలేషియాతో 23న శ్రీలంకతో చివరి గ్రూప్ స్టేజీ మ్యాచ్ ఆడనుంది.

క్వార్టర్స్‌లో జకోవిచ్ ప్రత్యర్థి అల్కరాజ్

- ఆస్ట్రేలియన్ ఓపెన్ రిజల్ట్స్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో మరో ఉత్కంఠ పోరుజరగనుంది. 25గ్రాండ్‌స్లామ్ టైటిళ్ల విజేత నొవాక్ జకోవిచ్‌తో.. స్పెయిన్ సంచలనం కార్లోస్ అల్కరాజ్ ఢీ కొట్టనున్నాడు. వీరిద్దరూ క్వార్టర్‌ఫైనల్లో తలపడనున్నారు. ఆదివారం జరిగిన ప్రి క్వార్టర్స్‌లో జకోవిచ్ 6-3, 6-4, 7-6(7-4)తో చెక్ రిపబ్లిక్‌కు చెందిన జిరి లెహక్రాపై విజయం సాధించాడు. 10సార్లు ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టైటిల్‌ను నెగ్గిన జకోవిచ్.. తొలి రెండు సెట్‌లను సునాయాసంగా గెలుపొందినా.. మూడో సెట్ చేజిక్కించుకొనేందుకు ట్రైబ్రేక్ వరకు పోరాడాల్సి విచ్చంది. మరో ప్రి క్వార్టర్‌ఫైనల్లో 2వ సీడ్, జర్మనీకి చెందిన జ్వెరేవ్ 6-1, 2-6, 6-3, 6-2తో 14వ సీడ్ హంబర్ట్(ఫ్రాన్స్)ను చిత్తుచేసి క్వార్టర్స్‌కు చేరాడు. ఇక 3వ సీడ్ అల్కరాజ్ 7-5, 6-1తో తొలి రెండు సెట్‌లు గెలుపొందిన తర్వాత 15వ సీడ్ డ్రాపర్(బ్రిటన్) గాయంతో మ్యాచ్ మధ్యలో వైదొలిగాడు. మరో ప్రి క్వార్టర్స్‌లో 12వ సీడ్ టామీ పాల్(అమెరికా) 6-1, 6-1, 6-1తో డోవిడోవిచ్(స్పెయిన్)ను ఓడించాడు.

ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలు అక్సెల్సన్, అన్

ఇండియా ఓపెన్ బ్యాడ్మింటన్ టోర్నీ టైటిళ్లను డెన్మార్క్‌కు చెందిన విక్టర్ అక్సెల్సన్, కొరియాకు చెందిన సి-యంగ్ అన్ చేజిక్కించుకున్నారు. ఆదివారం జరిగిన ఫైనల్లో అక్సెల్సన్ 21-16, 21-8తో సి.వై. లీ(హాంకాంగ్)ను, మహిళల సింగిల్స్ ఫైనల్లో టాప్‌సీడ్, సి-యంగ్ అన్ 21-12, 21-9తో 8వ సీడ్ ఛోఛువాంగ్(థాయ్‌లాండ్)ను ఓడించారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68